వసుంధర
నీ నిరంతర వెలుగులకై
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

: fb.com/vaartha Digital

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-11-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 275 పేజీలు: 10+4 వెల: 6.50

## ట్రంప్‌కు ఎదురుదెబ్బ





న్యూయార్క్, వర్జీనియాలో డెమొక్రాట్ల విజయం

గవర్నర్‌గా తెలంగాణ మూలాలున్న మహిళ

5

## పట్టాలపైనే పోయిన ప్రాణాలు



### ప్రయాణికులపై నుంచి దూసుకుపోయిన రైలు

### ఆరుగురు అక్కడికక్కడే మృతి, పలువురికి తీవ్ర గాయాలు

### యుపిలో ఘోర విషాదం

**లక్నో, నవంబరు 5:** ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. చునార్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం వేగంగా వెళ్తున్న రైలు కిందపడి ఆరుగురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. కార్తిక పౌర్ణమి పుణ్యస్నానాల కోసం వారణాసికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. చోపాన్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్యాసింజర్ రైలు (13309) చునార్ >>2

# ముస్లిం రిజర్వేషన్లకు కాంగ్రెస్సే రక్ష

### బిజెపి, బిఆర్‌ఎస్ విలీనం ఖాయం.. కవిత చెప్తున్నది కూడా అదే..

### అజారుద్దీన్‌కు పదవిస్తే కిషన్‌రెడ్డికి బాధ ఎందుకు?

### ఈ ఎన్నిక కెసిఆర్, మోడీటీమ్‌కు - రేవంత్, రాహుల్ టీమ్‌కు మధ్య పోటీ

### 'జూబ్లీ' ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



బుధవారం జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్, మంత్రి వివేక్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 5, ప్రభాతవార్త:** ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేసింది వైస్సార్ అని, ఇప్పుడు ఆ రిజర్వేషన్లు కాపాడుతుంది తామేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి షేక్‌పేట, యూసుఫ్ గూడ ప్రాంతాల్లో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ అధిక ప్రధాన్యమిస్తుందన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానన్న కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తనకు చిన్ననాటి నుంచి అక్బరుద్దీన్‌తో దోస్తి ఉందని, కళాశాలలో స్నేహితులమని, హిమాయత్ నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో నివసించే వారమన్నారు. ఆ స్నేహంతో ఇప్పుడు ఎన్నికల్లో కలిసి వెళుతున్నామని, ఎంఐఎం బలపరిచిన నవీన్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తే కిషన్‌రెడ్డికి ఎందుకు బాధ కలుగుతుందని, తానేమి కిషన్‌రెడ్డి స్థలమో లేక గుజరాత్‌లో మోడికి సంబంధించిన స్థలాన్ని ఇవ్వడం లేదని, తమ పార్టీ పెద్దల నిర్ణయం మేరకు దేశానికి వన్నె తెచ్చిన క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామన్నారు. బీజేపీ ఎన్నికల బరిలో లేదని, కనీసం డిపాజిట్ కూడా దక్కదన్నారు. కిషన్‌రెడ్డికి దమ్ముంటే ఎన్నికల్లో డిపాజిట్ తెచ్చుకోవాలని సవాల్ విసిరారు. బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందన్నారు. బీజేపీ ఓటును బీఆర్‌ఎస్‌కు వేయిస్తుందన్నారు. బీజేపీలో బీఆర్‌ఎస్ కలిసిపోవడం ఖాయమని, ఇదే విషయాన్ని కేసీఆర్ కుమార్తె కవిత తేల్చిచెప్పారన్నారు. 2014లో నవీన్‌యాదవ్‌కు ఎంఐఎం పార్టీ జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందని, మళ్లీ 11 ఏళ్ల తరువాత ఇప్పుడు ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్‌యాదవ్ మీ ముందుకు వచ్చారన్నారు. అతన్ని బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమస్యలు తీర్చే జవాబుదారి తీసుకుంటానని, తన ఇళ్లు సమీపంలోని జూబ్లీహిల్స్‌లోనే ఉందని ఆయన స్పష్టం >>2

# ఇది భారత్ గెలుపు

### మహిళల ప్రపంచకప్ టీమ్‌ను అభినందించిన ప్రధాని మోడీ

### ప్రధానికి 'నమో-1' జెర్సీ అందించిన మహిళా జట్టు



బుధవారం ఢిల్లీలో ప్రపంచకప్ ట్రోఫీతో ప్రధాని మోడీ, మహిళల క్రికెట్ జట్టు సభ్యులు

**న్యూఢిల్లీ, నవంబరు 5:** చారిత్రాత్మక విజయం సాధించిన తర్వాత భారత మహిళల క్రికెట్ జట్టు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసింది. మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత జట్టు ఆదివారం దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో ఓడించి తొలిసారి ఐసీసీ ట్రోఫీని నెగ్గింది. 52 సంవత్సరాల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ చరిత్రలో తొలిసారిగా ట్రోఫీని గెలుచుకున్నందుకు హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టును ప్రధాని మోదీ అభినందించారు. వరుసగా మూడు పరాజయాలు, >>2

# హార్యానాలోనూ ఓట్ చోరీ

### 25 లక్షలకు పైగా దొంగ ఓట్లు

### కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆరోపణలు

### వాటిని కొట్టిపారేసిన ఇసి

### 'సర్'పై మీ వైఖరేంటో చెప్పాలన్న ఎన్నికల సంఘం



**న్యూఢిల్లీ, నవంబరు 5:** హర్యానాలోనూ 'ఓట్ చోరీ' జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. "22 మంది ఓటర్లకు బ్రెజిలియన్ మోడల్ ఫొటోను ఉపయోగించడం, రెండు బూత్‌లలో 223సార్లు ఓటర్ల జాబితాలో ఒక మహిళ ఫొటో కనిపించడం, 501 మంది ఓటర్లు ఉన్న గుర్తుతెలియని ఇల్లు, ఉత్తర్ ప్రదేశ్ రాజకీయ నాయకులు ఓటర్లు ఉన్నాయి. ఇలా 25.41 లక్షల మేర నకిలీ ఓట్లు ఉన్నాయి. వీటికి 100శాతం రుజువులు ఉన్నాయి" అని పేర్కొన్నారు. "ఒక బ్రెజీలియన్ మోడల్ ఫొటోతో ఓట్లను రిజిస్టర్ చేయించి, చాలా ఎన్నికల బూత్‌లలో ఓట్లు వేయించారు. ఈ లెక్కన ప్రతీ 8 మంది హర్యానా ఓటర్లలో ఒకరు నకిలీ ఓటర్లే. అంటే దాదాపు 12.5 శాతం మంది నకిలీ ఓటర్లు రాష్ట్రంలో ఉన్నారు. పోస్టల్ ఓట్లు, బూత్ ఓట్ల లెక్కల్లోనూ పెద్ద తేడాలు కనిపిస్తున్నాయి. దీనిపై మా పార్టీ దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. ఎన్నికల కమిషన్ ప్రధానమంత్రి నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్ షాతో కలిసి దేశ ప్రజాస్వామ్య పునాదిని ధ్వంసం చేయడానికి, బిజెపికి క్రమపద్ధతిలో సహాయడానికి యత్నిస్తోందని ఆరోపణలు గుప్పించారు. ఓట్ల చోరీ జరగకుంటే, 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలిచి ఉండేదని ఆయన వ్యాఖ్యానించారు. ఆ ఎన్నికల్లో నకిలీ, డూప్లికేట్, బల్క్ ఓటింగ్ జరగబట్టే బిజెపి గెలిచిందని ఆరోపించారు. బుధవారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్‌ను ఓడించేందుకు 'ఆపరేషన్ సర్కార్ చోరీ'ని నిర్వహించారని మండిపడ్డారు. బిజెపి ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం సహకరిస్తోంది అనేందుకు 'హెచ్' ఫైల్స్ రుజువులుగా నిలుస్తాయని, అవి తమచేతిలో ఉన్నాయన్నారు. 100 శాతం రుజువులతో తాను మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని దేశంలోని జెన్‌జీ యువతకు పిలుపునిచ్చారు. ఓట్లచోరీ ద్వారా జెన్‌జీ నుంచి భవిష్యత్తును లాక్కుంటున్నారని ధ్వజమెత్తారు. ఇళ్లు లేని వాళ్లకు ఇంటి నంబరుగా జీరోను కేటాయిస్తామని దేశ ప్రజలకు సిఇసి జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని, ఆ ఇళ్ల పేరుతో ఏం జరుగుతోందో ఇప్పుడు అందరికీ తెలిసిపోయిందని రాహుల్ >>2

# తిరుమల లడ్డూ నాణ్యత పెంచాం



బుధవారం మీడియాతో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

### రెండు గంటల్లో దర్శనం కలిగించే ఎఐ ప్రాజెక్టు

### టిటిడి ఆలయాల్లో నిత్యాన్నదానం

### కరీంనగర్, దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు

### గత యేడాది టిటిడికి వెయ్యి కోట్ల విరాళాలు

### చైర్మన్‌గా యేడాదిపూర్తి సందర్భంగా మీడియాతో బిఆర్ నాయుడు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్5:** గత ఏడాది కాలంలో టిటిడికి రూ. 1000 కోట్ల విరాళాలు వచ్చాయని బోర్డు చైర్మన్ బిఆర్ నాయుడు వెల్లడించారు. చైర్మన్‌గా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం మీడియాతో మాట్లాడారు. మొదటి బోర్డు మీటింగ్‌లోనే అన్యమతస్థులను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నామని, కొందరిని తొలగించామన్నారు. ఏఐ టెక్నాలజీ ద్వారా రెండు,మూడు గంటల్లోనే సమాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేయాలని అనుకున్నామని, కానీ ఒక వర్గం ఏఐపై వ్యతిరేకత వ్యక్తం చేసిందని,నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మళ్లీ ఏఐ ప్రాజెక్టును పట్టాలెక్కిస్తున్నామని చెప్పారు. తిరుమల కొండపై రాజకీయాలు మాట్లాడితే చర్యలు తీసుకోవాలని తీర్మానించామని, తిరుమలపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.. శ్రీవారి అన్నప్రసాదంలో మార్పులు తీసుకొచ్చాం లడ్డూ ప్రసాదంలో నాణ్యత పెంచాం, అన్న ప్రసాదంలో వడను తీసుకొచ్చామని చెప్పారు. తిరుపతి స్థానికులకు నెలలో ఒక మంగళవారం 3వేల మందికి స్వామివారి దర్శనం కల్పిస్తున్నామన్నారు. గతంలో టూరిజం టికెట్లు 4వేల వరకు ఇచ్చేవారు, అవి బ్లాక్ మార్కెట్‌కు వెళ్లేవని, టూరిజం ప్యాకేజీలను రద్దు చేసి ఆ టికెట్‌లను సామాన్య భక్తులకు ఇస్తున్నామన్నారు.. తిరుమలలో కాటేజీలు, గెస్ట్‌హౌస్‌లకు స్వామివారి పేర్లు వచ్చేలా పెట్టాం స్విమ్స్ ఆస్పత్రి నిర్వాహణ,అభివృద్ధి, ఆర్థిక వనరుల సమీకరణ కోసం >>2



బుధవారం పాట్నాలో ఎన్నికల సామాగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

# బీహార్‌లో నేడే తొలి దశ పోలింగ్

### 121 నియోజకవర్గాల్లో 1314 మంది అభ్యర్థులు

### బరిలో తేజస్వి యాదవ్ సహా పలువురు మహామహులు

**పాట్నా, నవంబరు 5:** బీహార్‌లో గురువారం 121 నియోజకవర్గాల్లో మొదటి దశ పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. తొలి విడతలో 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా 3.75కోట్ల మంది బీహారీలు వారి భవితన్యాన్ని తేల్చనున్నారు. అందులో 122 మంది మహిళా >>2

## బాలికపై లైంగిక దాడి..

### సహకరించిన తల్లి, ప్రియుడికి 180 యేళ్లు కఠిన శిక్ష

### రూ. 11.75 లక్షల జరిమానా

3

## నడిరోడ్డుపై దేశాధ్యక్షురాలికి లైంగిక వేధింపులు

5



బీహార్‌లోని చంపారన్ జిల్లాలో బుధవారం ఎన్నికల ప్రచారంలో ప్రియాంక, పొంగులేటి

# బీహార్‌లో గెలిస్తే తెలంగాణ మోడల్ పాలన

### ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్5:** రెండు దశాబ్దాల పాటు అవినీతి అక్రమాలు అవకాశవాద రాజకీయాలతో బీహార్ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని బీహార్ కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. బీహార్ రాష్ట్రం పశ్చిమ చంపారన్ జిల్లా చనుపటియా >>2

# పేదలకు 4.50 లక్షల ఇళ్లు

### 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ

### యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం

### వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్

### ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం: డి.సిఎం భట్టి

**పరిగి, నవంబర్ 5, ప్రభాతవార్త:** పరిశ్రమలు, అనుబంధ రంగాలు అభివృద్ధి చెందాలంటే విద్యుత్ ఎంతో అవసరం ఉందని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కలుగుతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం ఆయన వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గంలో 674 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించనున్న ఒక 400 కేవీ సబ్ స్టేషన్ ,తొమ్మిది 33/11 కెవి సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పరిగి నియోజకవర్గంలోని నజీరాబాద్ తండాలో 24 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన 220 కె.వి సబ్‌స్టేషన్‌ను డిప్యూటీ సీఎం మల్లు విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా పలుకేంద్రాలకు ట్రాన్స్ఫార్మర్ లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎబిఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పాల్గొని ఆయన మాట్లాడుతూ...



సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డి.సిఎం భట్టి

నీళ్లు, నిధులు, నియామకాల కొరకు తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రజలసంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం >>2



బుధవారం బీదర్ జిల్లా హల్లిఖేడ్ వద్ద ప్రమాద దృశ్యం

# దైవ దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు..

### కర్ణాటకలో కారు-వ్యాన్ ఢీ

### నలుగురు సంగారెడ్డి వాసుల మృతి, ఒకరి పరిస్థితి విషమం

**నారాయణఖేడ్, నవంబర్ 5 ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ జిల్లా హల్లిఖేడ్, సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు,వ్యాన్ ఢీకొన్న ఘటనలో నలుగురు నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామ వాసులు ప్రాణాలు కోల్పోగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా గణగాపూర్‌లోని శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లి.. తిరిగి స్వగ్రామానికివస్తుండగా ఈ ప్రమాదం సంభవించిందని >>2



బుధవారం ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొన్నం తదితరులు

## ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు తీసుకున్న సుదర్శన్‌రెడ్డి

### ఆయనకు అభినందనలు తెలిపిన మండలి చైర్మన్, మంత్రులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్5:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా మాజీ మంత్రి,బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి బుధవారం ఉదయం సచివాలయలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

## పట్టాలపైనే పోయిన ప్రాణాలు

>> స్టేషన్‌లోని 4వ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఆగింది. ఈ రైలులో వచ్చిన భక్తులు, ఫుట్ ఓవర్‌బ్రిడ్జిని ఉపయోగించకుండా, పట్టాలు దాటి 3వ నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో అదే ట్రాక్‌పై వేగంగా వస్తున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ (కల్కా మెయిల్,12311) వారిని బలంగా ఢీకొట్టింది. ఆ రైలుకు చునార్ స్టేషన్‌లో హాల్ట్ లేదు. దీంతో భక్తులు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, పలువురి శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్టేషన్‌లో గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వారణాసి జోన్ ఏడీజీ పీయూష్ మోర్డియా ఆరుగురు మరణించినట్లు ధృవీకరించారు. ఈ ప్రమాదం కారణంగా చునార్ జంక్షన్‌లో రైళ్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదని నార్త్ సెంట్రల్ రైల్వే జోన్ అధికారులు తెలిపారు. ఈ దుర్ఘటనపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, వెంటనే ఘటనా స్థలానికి చేరుకోవాలని సీనియర్ అధికారులను ఆదేశించారు. సహాయక చర్యల్లో పాల్గొనాలని ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను ఆదేశించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధితుల కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అధికారులు మృతుల వివరాలను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

## జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి చర్చలు సఫలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్5:** జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేపట్టిన చర్చలు సఫలం అయ్యాయి. ఈ మేరకు కాటన్ మిల్లులు బంద్‌ను కాటన్ మిల్లర్స్ అసోసియేషన్ విరమించుకుంది. దాంతో పత్తి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగనున్నాయి. జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ డిమాండ్లపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితోనూ చర్చలు జరిపారు. జిన్నింగ్ మిల్లర్స్‌కు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. దాంతో సమ్మె విరమిస్తున్నట్లు జిన్నింగ్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రకటించారు. మంత్రి తుమ్మల హామీతో సమ్మె విరమించినట్లు చెప్పారు.

## లడ్డూ నాణ్యత పెంచాం

>> నిపుణుల కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. కమిటీ నివేదిక ఆధారంగా స్విమ్స్ ఆస్పత్రికి రూ.71 కోట్లు ఇచ్చామన్నారు. బ్రేక్ దర్శనం సమయాల్లోనూ మార్పులు తీసుకొచ్చాం శ్రీవారి ట్రస్ట్ ద్వారా 5వేల శ్రీవారి ఆలయాలు నిర్మించాలని తీర్మానించామన్నారు. తిరుపతి–తిరుమల మధ్య ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు, టీటీడీకి వంద ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలని కేంద్ర మంత్రి కుమారస్వామిని కోరామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాల్లో నిత్యాన్న ప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇప్పటికే కొన్ని ఆలయాల్లో ప్రారంభమైందన్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సహాయంతో అలిపిరి పాదాల మండపం పునః నిర్మాణం చేస్తామన్నారు. ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయాల నిర్మించబోతున్నాం ఇప్పటికే రెండు రాష్ట్రాలు ఆమోదం తెలిపాయని తెలిపారు. ఒంటిమిట్టలో భక్తుల సౌకర్యార్థం వంద గదులతో వసతి గృహ నిర్మాణం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎస్వీ గోశాల అభివృద్ధికి నిపుణుల కమిటీ కమిటీ సూచనల మేరకు గోశాలను మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లో ఆలయాలు,భజన మందిరాలు నిర్మిస్తామని, వీటి సంఖ్య పెరగవచ్చునని చెప్పారు. పరకామణిలో చోరీ ఘటనపై సీఐడీ ఎంక్వైరీ కొనసాగుతోందన్నారు. తిరుపతిలో ఉన్న ఫ్లైఓవర్ పేరును గత ప్రభుత్వం శ్రీనివాస సేతుగా మార్చింది ఫ్లైఓవర్‌కు తిరిగి చంద్రబాబు పెట్టిన గరుడ వారధిగా పేరు మార్చామన్నారు.గత ప్రభుత్వం అలిపిరిలో ముంతాజ్ హోటల్ కోసం 20ఎకరాలు కేటాయించింది, ముంతాజ్ హోటల్ భూముల లీజును రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు దేవలోక్, ముంతాజ్ హోటల్స్, ఎంఆర్‌కేఆర్ ప్రోపర్టీస్, టూరిజం హోటల్ మేనేజ్మెంట్ కాలేజీకి ఇచ్చిన 50 ఎకరాల భూమిని టీటీడీకి కేటాయించాలని తీర్మానించామన్నారు. పోటు కార్మికులకు జీఎస్టీకట్ కాకుండా..వారి వేతనం పెంచాం,స్విమ్స్ హెల్త్‌కార్డులు వచ్చేలా చర్యలు తీసుకున్నాం, 650 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, డ్రైవర్లను రెగ్యులరైజ్ చేయాలని తీర్మానం చేశామని చెప్పారు. అమరావతిలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో అనేక అక్రమాలున్నాయి చేసిన డిజైన్‌కు, నిర్మించిన ఆలయానికి సంబంధం లేదని పేర్కొన్నారు. 175కోట్ల రూపాయల వ్యయంతో అమరావతిలోని శ్రీవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని, గత యేడాది వైకుంఠ ఏకాదశి ఘటనను దృష్టిలో పెట్టుకొని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. శ్రీవాణి దర్శనం సమయాలను మార్చడంతో భక్తులకు దర్శనం సులభతరమైందన్నారు. రూ,30 కోట్లతో కరీంనగర్‌లో, రూ.4.5 కోట్లతో దుబ్బాకలో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నామని తెలిపారు. బ్రేక్ దర్శనాలు మొన్నటి వరకు ఉదయం 10.30కి ఉండేవని,ఇప్పుడు వాటిని తిరిగి తెల్లవారుజామున మార్చామన్నారు.

### బీజాపూర్ జిల్లాలో
## ఎన్‌కౌంటర్
### ముగ్గురు మావోయిస్టుల మృతి

**చర్ల, నవంబర్ 5, ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్ దండకారణ్యంలో మరోమారు కాల్పుల మోతతో దద్దరిల్లాయి. బీజాపూర్ జిల్లా తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం మరిమల్ల అటవీప్రాంతంలో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల పక్కా సమాచారంతో సిఆర్పిఎఫ్ డిఆర్జి ఎస్టిఎఫ్ బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో అన్నారం మరిమల్ల అటవీప్రాంతంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరు వైపుల నుండి హోరాహోరీగా కాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పులలో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందగా వారి మృత దేహాలతో పాటు ఆయుదాలు, పేలుడు పదార్ధాలు, నిత్యావసర సరుకులను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నాయి. మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

## కాంగ్రెస్సే రక్ష

>> చేశారు. ఈ ఎన్నికలు కేసీఆర్, నరేంద్రమోడి టీంకి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ టీంకి మధ్య జరుగుతున్న ఎన్నిక అని అన్నారు. మోడి ప్రధాని అయ్యారంటే కారణం కేసీఆర్ అని, పార్లమెంటు ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన ఎనిమిది సీట్లతోనే మోడి ప్రధాని అయ్యాడన్నారు. మొన్న ఎన్నికల్లో కారు టైరు పంక్చరైందని, కారు షెడ్డుకు వెళ్లిందన్నారు. ఈ ఎన్నికల్లో నక్కజిత్తుల నక్కలన్ని మేకతోలు కప్పుకొని ఓట్ల కోసం వస్తున్నాయన్నారు. నంది అవార్డులు, ఆస్కార్‌లు తీసుకొచ్చిన సినీ కార్మికుల గురించి పదేళ్లలో కేసీఆర్, కేటీఆర్ ఎప్పుడు పట్టించుకోలేదని, హీరోలతో కలిసి కేటీఆర్ గెస్ట్‌హౌజ్‌లలో తిరిగాడని ఆరోపించారు. సినీ కార్మికుల సమస్యలన్ని తీర్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కాళేశ్వరం లక్ష కోట్ల అవినీతి విషయంలో, ఫార్ములా రేస్ విషయంలో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్ట్ చేయకుండా కిషన్‌రెడ్డి చర్చకు సిద్దం అంటూ సవాల్ విసురుతున్నాడని, కిషన్‌రెడ్డి చర్చకు రావల్సింది తన వద్దకు కాదని, మోడి వద్దకు వెళ్లి ఎందుకు అరెస్ట్ చేయడం లేదని చర్చించాలంటూ చురకలు వేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి 30వేల మెజార్టీతో గెలవడం ఖాయమని అన్నారు. సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### వారం - వర్జ్యం

**06-11-2025, గురువారం**
**శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,**
**కార్తీకమాసం, దక్షిణాయణం**
**శరద్ ఋతువు, కృష్ణ పక్షం**
పాడ్యమి మ.2.56, స్వాతి కార్తె
భరణి ఉ.6.34, కృత్తిక తె.3.28
వర్జ్యం : ఉ.10.35-1.23
దు.ఉ.9.57-10.43, 2) మ.2.33-3.19
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** కార్యాలయంలోని నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు.

**వృషభం:** మీ కృషిని, పట్టుదలను అందరూ మెచ్చుకుంటారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు.

**మిథునం:** దానధర్మాల వంటి పుణ్యకార్యాచరణ పట్ల మక్కువ పెరుగుతుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కర్కాటకం :** వ్యాపార విస్తరణకు తగినంత ఆర్థిక వనరులు సమకూరడం కష్టమవుతుంది. ఆరోగ్య విషయంలో మెలుకువ అవసరం.

**సింహం:** వృత్తి విషయంలో కొంత ఓర్పును పాటించుట అవసరమవుతుంది. ఆభరణాలు కొనుగోలుచేస్తారు. వాహన సౌఖ్యం కలదు.

**కన్య :** మధ్యవర్తిత్వానికి దూరంగా ఉండండి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**తుల :** సహోదర, సహోదరీ వర్గము కొన్ని కారణముల వలన దూరంగా ఉంటారు. ఆర్థిక పరిస్థితి సానుకూలంగా ఉండదు.

**వృశ్చికం:** సంతాన స్థిరత్వం, మానసిక ఆనందాన్ని కలిగిస్తుంది. వస్తు, వాహనాలు కొనుగోలుచేస్తారు. నూతన పరిచయాలు పెరుగుతాయి.

**ధనుస్సు:** ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు. ఆస్తి తగాదాలు తీరి లబ్ధి పొందు తారు. బాధ్యతలు సమర్థవంతంగా నెరవేరుస్తారు.

**మకరం:** అందరిలోనూ ప్రత్యేకంగా గుర్తింపు లభిస్తుంది. సభలలో పాల్గొంటారు. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు.

**కుంభం:** వాహనాలు, భూములు, స్థలాలు కొనుగోలు చేస్తారు. కొత్త కార్యక్రమాలు చేపట్టి సన్నిహితుల సాయంతో పూర్తిచేస్తారు.

**మీనం:** ఆస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. మానసిక ప్రశాంత పొందుతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# హర్యానాలోనూ ఓట్ చోరీ

>> పేర్కొన్నారు. డూప్లికేట్ ఓట్లను ఎందుకు తొలగించడం లేదని ఇసిని ఆయన ప్రశ్నించారు. ఒకవేళ వాటిని తొలగిస్తే ఎన్నికల్లో సరైన ఫలితం వచ్చేదన్నారు. హర్యానాలోని ఏదో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఈ ఓట్ల చోరీ ఉదంతం పరిమితం కాలేదని మాకు అనుమానం కలుగుతోందన్నారు. ఈ వ్యవహారం రాష్ట్రాల స్థాయిలో, జాతీయ స్థాయిలోనూ జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు.

**రాహుల్ ఆరోపణలను కొట్టిపారేసిన ఇసి**

ఓట్ చోరీ అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను ఎన్నికల సంఘం అధికార వర్గాలు కొట్టిపారేశాయి. హర్యానాలో ఓటర్ల జాబితాలపై ఒక్క అప్పీల్ కూడా దాఖలు కాలేదని పేర్కొన్నారు. ఎన్నికల టైంలో పోలింగ్ బూత్‌లలో కాంగ్రెస్ ఏజెంట్లు ఏం చేస్తున్నారని ఇసి అధికారులు ప్రశ్నించారు. ఎవరైనా వ్యక్తి ఇప్పటికే వేరొక చోట ఓట్లు వేసి ఉంటే అభ్యంతరం తెలపాల్సిన బాధ్యత కాంగ్రెస్ ఏజెంట్లపై ఉంటుందన్నారు. ఎవరైనా ఓటరు సమాచారంపై సందేహాలున్నా కాంగ్రెస్ ఏజెంట్లు అడగొచ్చని సూచించారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియపై వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని రాహుల్ గాంధీని ఇసి కోరింది. దేశ పౌరసత్వాన్ని తనిఖీ చేస్తూనే డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన ఓటర్లు, వలస వెళ్లిపోయిన ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితాల నుంచి తొలగించడంలో తప్పేం ఉందని ఎన్నికల సంఘం ప్రశ్నించింది. ఈ ప్రక్రియను కూడా రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారా అని నిలదీసింది.

## ఏపిలో స్వతంత్ర పాలనా యూనిట్లుగా పంచాయతీలు

### క్లస్టర్ వ్యవస్థ రద్దు!, సంస్కరణల అమలుకు ఉత్తర్వులు జారీ

**విజయవాడ,నవంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయితీరాజ్ శాఖలో సంస్కరణలకు ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది.ప్రస్తుతం అమలులో ఉన్న పంచాయితీ క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసింది. పంచాయితీలను స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా ప్రకటించింది. వీటిని నాలుగు గ్రేడులుగా విభజించడంతో పాటు పంచాయితీ కార్యదర్శుల పేర్లను పంచాయితీ అభివృద్ధి అధికారులు(పీడీఓ)గా మార్చింది. పురపాలక సంఘాల తరహాలో ప్రతి పంచాయితీలోనూ పారిశుధ్యం,త్రాగునీటి సరఫరా,గ్రామీణ ప్రణాళజక,వీధి దీపాలు,ఇంజినీరింగ్,ఆదాయం,పన్ను వసూళ్ళ విభాగాలను ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనలను మంత్రివర్గం ఇటీవల ఆమోదించడంతో రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఇందుకు సంబంధించి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని పంచాయితీరాజ్ శాఖ కమీషనర్‌ను ఆదేశించారు,ప్రస్తుతం ఉన్న 7,244 క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి 13,351 గ్రామ పంచాయితీలు స్వతంత్ర పరిపాలన యూనిట్లుగా విభజన13,351 పంచాయితీలు నాలుగు గ్రేడ్లుగా వర్గీంచారు.వీటిలో రూరల్ పంచాయితీలు 359 గ్రేడ్1,గా ఉంటాయి, -3,082,ఉంటాయి,గ్రేడ్2-3,163 ఉంటాయి.గ్రేడ్3-6,747 ఉంటాయి.గ్రేడ్-1 పంచాయితీ కార్యదర్శుల పోస్టులను డిప్యూటీ ఎంపీడీవో క్యాడర్‌లో చేర్చాలని నిర్ణయంమిగతా కార్యదర్శులను మూడు గ్రేడ్‌లుగా విభజనరూరల్ పంచాయితీల్లో మెరుగైన పరిపాలన కోసం జూనియర్ అసిస్టెంట్లు,బిల్ కలెక్టర్లు 359 మందిని సీనియర్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చెయ్యాలని నిర్ణయంప్రతి పంచాయితీలోనూ పారిశుధ్యం,త్రాగునీటి సరఫరా,గ్రామీణ ప్రణాళిక,వీధి దీపాలు,ఇంజనీరింగ్, ఆదాయం విభాగాల్లో సిబ్బంది ఏర్పాటుఇంజనీరింగ్,డిజిటల్ అసిస్టెంట్ల సేవలు గ్రామీణ ప్రణాళజక అసిస్టెంట్‌లుగా వినియోగిస్తారు,డిజిటల్ అసిస్టెంట్లతో పంచాయితీల్లో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటు చేస్తారు,పంచాయితీల్లో కార్యదర్శుల ఖాళీలు 2025-26 ప్యానల్‌కు ముందే నింపాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఏపిలో 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు

### అవినీతి ఆరోపణల నేపథ్యంలో దాడులు జరిపిన ఏసిబి

**విజయవాడ.డిసెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా 120 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారులు ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, విజయనగరం జిల్లాలోని భోగాపురం, సత్యసాయి జిల్లాలోని చిలమత్తూరు, నెల్లూరు జిల్లాలోని స్టోన్‌హౌస్‌పేట, విశాఖపట్నం జిల్లాలోని మధురవాడ, పల్నాడు జిల్లా నరసరావుపేట తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ దాడులు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక దాడులు చేసింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు రావడంతో అధికారులు మెరుపు దాడులు చేశారు. బయట వ్యక్తులను అనుమతించకుండా కార్యాలయం గేట్లు మూసేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి విచ్చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తనిఖీ చేస్తున్నామని ఏసీబీ అధికారులు వివరించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కార్యాలయం తలుపులు మూసేసి సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారించారు. కార్యాలయంలోనికి ఎవరినీ అనుమతించ లేదు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్నట్లు గత కొంతకాలంగా తీవ్ర అరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు కార్యాలయంలో విస్తృత తనిఖీలు చేపట్టారు. అధికారుల సోదాలతో అప్రమత్తమైన డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులకు తాళం వేసుకుని పరారయ్యారు. గతంలోనూ రాజంపేట సబ్ రిజిస్టర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దస్తావేజుల తనిఖీలు చేపట్టారు. దీంతో సబ్ రిజిస్ట్రేషన్ వద్దనున్న నోటరీ, దస్తావేజుల రైటర్లు కార్యాలయాలు మూసివేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై అనిశా అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కార్యాలయానికి తలుపులు వేసి పలు రికార్డులు పరిశీలించారు. ఆ సమయంలో సబ్ రిజిస్టర్ సెలవులో ఉన్నారు. కార్యాలయంలోని పలు కీలక ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు.



న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో ఇండియా-న్యూజిలాండ్ బిజినెస్ ఫోరంలో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

# పేదలకు 4.50 లక్షల ఇళ్లు

>> ఇస్తున్నదని తెలిపారు. ఇందులో భాగంగా అత్యంత నిరు పేదలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లాలో 1,48,193 మందికి ఉచిత విద్యుత్ అందిస్తున్నామని,పరిగి నియోజకవర్గంలో44,465 మంది లబ్ధిదారులు ఉచిత విద్యుత్తు లబ్ధి పొందుతున్నారని అన్నారు. విద్యుత్ సౌకర్యం కల్పిస్తే పరిశ్రమలు వస్తాయని, తద్వారా పరిశ్రమలతో పాటు, అనుబంధ రంగాలు, విద్యా సంస్థలు తదితర రంగాలలో పరిగి ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రైతులకు 27 వేల 970 వ్యవసాయ పంపు సెట్ల కు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కార్యక్రమాలు రైతు భరోసా ,రైతు రుణమాఫీ , రైతు బీమా ,ఇందిరమ్మ ఇల్లు , రాజీవ్ ఆరోగ్యశ్రీ, కళ్యాణ లక్ష్మి ్మ, ఉచిత కరెంట్ లాంటి పథకాలను ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. పేదప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు నాలుగు లక్షల 50 వేల ఇండ్లను మంజూరు చేస్తూ, ఒక్కొక్క ఇంటికి 5 లక్షల చొప్పున ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసి, ప్రతి ఇంటికి 5 లక్షల చొప్పున కేటాయించామని, రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 93 లక్షల కుటుంబాలకు రూ. 10 లక్షలతో ఏ ఆసుపత్రికి వెళ్లిన వైద్యం చేస్తున్నామన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, ఉద్యోగులకు నియామక పత్రాలు అందించకుండా కోర్టుకు వెళ్లారని విమర్శించారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 60 వేల ఉద్యోగాలను కల్పించిందని, కోర్టుకు వెళ్లిన వారికి నియామక పత్రాలను అందజేశామన్నారు. తెలంగాణలో కేవలం సంక్షేమం కోసమే ఒక లక్ష 600 వేల 310 కోట్ల ను ఖర్చు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మంజూరు చేసి, 25 ఎకరాలలో 200 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. పరిగి నియోజకవర్గంలో కూడా 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలును మంజూరు అయిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో చదువు ఉండేలా ప్రపంచంతో పోటీపడేలా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో విద్య ఉండబోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వారానికి మూడు రోజులు ప్రజాబాట నిర్వహించ బోతుందని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులే ప్రజల వద్దకు వెళ్తారని, అంబులెన్స్ లాగా ఒక వాహనం కూడా ఉంటుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచబోతున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ ను ఎవరు ఆపలేరని, ఏ ఒక్క ప్రతిపక్షం కూడా ఆపలేదని స్పష్టం చేశారు., ప్రతిక్షణం ప్రజల కోసమే ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.ఈ సమావేశంలో చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, పరిగి నియోజక వర్గ శాసన సభ్యులు డాక్టర్ రామ్ మోహన్ రెడ్డి,ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫారుకి, ఎచ్ ఆర్ డి డైరెక్టర్ శివాజీ, జిల్లా ఎస్ పి నారాయణ రెడ్డి, వికారాబాద్ ఎస్ ఇ రవి ప్రసాద్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేడే తొలి దశ పోలింగ్

>> అభ్యర్థులు కాగా జన్ సురాజ్ పార్టీ తరపున ఓ ట్రాన్స్‌జెండర్ కూడా బరిలో ఉన్నారు. తొలి విడతలో ఓటువేయనున్న 3.75 కోట్లమంది కోసం కేంద్ర ఎన్నికల సంఘం 45,341 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అందులో 36,733 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి. 10.72లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న ఓటింగ్, సాయంత్రం 6గంటలకు ముగియనుంది. భద్రతా కారణాలతో సిమ్రిబ ఖ్తియార్‌పుర్, మహిషి, తారాపుర్, ముంగర్, జమల్‌పుర్, సూర్యగర్హ్ నియోజకవర్గంలోని 56 పోలింగ్ బూత్‌ల్లో ఓటింగ్ సాయంత్రం 5గంటలకే ముగియనుంది. రాష్ట్ర పోలీసులతోపాటు కేంద్ర పారామిలిటరీ బలగాలతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. మొత్తం 1314 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ప్రధానంగా ఎన్‌డిఏ, ఇండియా కూటమిల మధ్యే పోటీ నెలకొంది. అయితే రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సారథ్యంలోని జనసురాజ్ పార్టీ తొలిసారి బిహార్ బరిలో దిగింది. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ ప్రభావంపై ఉత్కంఠ నెలకొంది. తొలి దశ పోలింగ్ జరుగుతున్న ప్రాంతాల్లో ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వి యాదవ్‌తోపాటు సిఎం నితీశ్ కుమార్ కేబినెట్‌లోని 16 మంది మంత్రులు తమ భవితవ్యం తేల్చుకోనున్నారు. తేజస్వి యాదవ్ సోదరుడు, జనశక్తి జనతాదళ్ అధినేత తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా బరిలో ఉన్నాడు. 16 మంది మంత్రులలో 11 మంది బిజెపి తరపున, ఐదుగురు జెడియు నుంచి పోటీ చేస్తున్నారు. తమ పనితీరు, ప్రభుత్వ విశ్వసనీయత, పాలనా రికార్డు, సంస్థాగత బలానికి ప్రత్యక్ష పరీక్షగా భావిస్తున్నారు. ఈనెల 11న మిగతా 122స్థానాలకు రెండో విడతలో పోలింగ్ జరగనుంది.

## తిరిగిరాని లోకాలకు..

>> తెలుస్తోంది. ఈ అనూహ్య దుర్ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. బొలెరో వాహనం వేగంగా వస్తు కారును రెదురుగా ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు. కారు పూర్తిగా ధ్వంసమైనట్టు తెలుస్తోంది. మృతులు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60), నాగరాజు (40) చెందినవారుగా గుర్తించారు. వీరంతా దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లి.. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు వాపోతున్నారు. నలుగురిలో ప్రతాప్ కు తీవ్ర గాయాలు కాగా బీదర్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం చేస్తున్నారు. హల్లిఖేడ్ పోలీసు అధికారులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బిరిదర్ ప్రతాప్‌ను సమీపంలోని బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారంతా కుటుంబ సభ్యులు, బంధువులే కావడంతో వారి స్వగ్రామంలో విషాదం నెలకొంది. ఈ సంఘటన తెలుసుకున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. ఆ తరువాత మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు. బీదర్, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిరిదర్ ప్రతాప్‌ను పరమర్శించారు. హల్లిఖేడ్ పోలీసు అధికారులు ఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాలను వెలికి తీసి పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బిరిదర్ ప్రతాప్‌ను సమీపంలోని బీదర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారంతా కుటుంబ సభ్యులు, బంధువులే కావడంతో వారి స్వగ్రామంలో విషాదం నెలకొంది. ఈ సంఘటన తెలుసుకున్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే సోదరుడు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి పరిశీలించారు. ఆ తరువాత మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని తెలిపారు.బీదర్,ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిరిదర్ ప్రతాప్ ను పరమర్శించారు.

## తెలంగాణ మోడల్ పాలన

>> అసెంబ్లీ నియోజకవర్గంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీతో కలిసి మంత్రి పొంగులేటి ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎన్డీయే కూటమికి ఓటమి భయం పట్టుకుందని అందువల్లే అలవికాని హామీలను ఇస్తుందని విమర్శించారు.వారి ఎన్నికల ప్రణాళికలో కోటి వరాలు ప్రకటించడం, యువతకు కోటి ఉద్యోగాలు, కోటి మంది లక్‌పతి దీదీలు హామీలు ఇచ్చారని అధికారంలో ఉన్న ఈ 20 సంవత్సరాలలో ఏన్ని ఉద్యోగాలు ఇచ్చారు, ఎంతమంది దీదీలను లక్‌పతులుగా చేశారని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు వీటిని అమలు చేయలేదని ప్రశ్నించారు.

బీహార్ ప్రజలను కొత్త కొత్త హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. మహాగట్ బంధన్‌ను గెలిపిస్తే తెలంగాణ మోడల్ పాలనను బీహార్‌లో అందిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతను ఇస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని వివరించారు. రైతులకు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయిలకే సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. బీహార్ ప్రజలు ఈ సారి విజ్ఞతతో ఆలోచించి మహాగట్ బంధన్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మహాగట్ బంధన్‌ను గెలిపిస్తే యువకుడైన తేజస్వియాదవ్ ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఎన్డీయే కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరన్న విషయాన్ని ప్రకటించలేని దుస్థితిలో ఉందని విమర్శించారు.ఈ బహిరంగ సభలో బీహార్ రాష్ట్ర ఇంచార్జ్ కృష్ణ అల్వార్, ఎంజిబి అభ్యర్థి అభిషేక్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇది భారత్ గెలుపు

>> సోషల్ మీడియాలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్న తర్వాత టోర్నీలో అద్భుతమైన పునరాగమనం చేసి టైటిల్‌ను సాధించడంపై ప్రధాని ప్రశంసించారు. ఢిల్లీ చేరుకున్న తర్వాత మహిళా జట్టుకు హోటల్‌లో డ్రమ్స్, పూలతో ఘన స్వాగతం లభించింది. ప్లేయర్లు, కోచ్ అమోల్ మజుందార్ కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ప్రధానమంత్రి మోదీ జట్టును అభినందించారు. భారత క్రికెట్ ఈ చారిత్రాత్మక క్షణం కలల విజయంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రధానికి 'నమో' అని ఉన్న జెర్సీని అందజేశారు. 2017 వరల్డ్ కప్ ఫైనల్‌లోభారత్ చివరివరకూ పోరాడినా విజయం సాధించలేక రన్నరప్‌తో సరిపెట్టుకుంది. అప్పుడు మిథాలిరాజ్ నేతృత్వంలోని జట్టు నరేంద్రమోడీని కలిసింది. తాజాగా ఆవిషయం ప్రధాని గుర్తుచేసారు. ప్రధానికి ప్రపంచకప్ ట్రోఫీతోపాటు నమో–1 అని రాసి ఉన్న జెర్సీని కూడా అందించారు.

# రెండేళ్ల కుమార్తెతో కలిసి గృహిణి ఆత్మహత్య

## ట్యాంక్‌బండ్ నుంచి దూకి మృతి



కార్తీక అగర్వాల్(ఫైల్)

**హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 5,ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఒక వివాహిత తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ట్యాంకు బండ్ లో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బహదూర్‌పురాలో నివాసం ఉంటూ వ్యాపారం చేస్తున్న పృధ్వీలాల్, ఛార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న కార్తీక అగర్వాల్ (28) దంపతులకు రెండేళ్ల కుమార్తె బియ్యారా ఉంది. అయితే దంపతులిద్దరి మధ్య గొడవలు తలెత్తడంతో గడచిన రెండేళ్లుగా వీరు విడివిడి గా ఉంటున్నారు. కార్తీక బహదూర్‌పురాలో నివాసం ఉంటున్న తల్లి దండ్రులవద్ద కుమార్తెతో కలిసి ఉంటుంది. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు గానీ ఈ నెల 2వ తేదీన కార్తీక అగర్వాల్ తన రెండేళ్ల కుమార్తెతో కలిసి ట్యాంకు బండ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నెక్లెస్ రోడ్డులోని నీరా కేఫ్ సమీపంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతురాలి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించి భద్రపరిచారు. అయితే తమ కుమార్తె, మనుమరాలు కనిపించడంలేదంటూ కార్తీకఅగర్వాల్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆత్మహత్యకు పాల్పడిన మహిళ కార్తీక అగర్వాల్‌గా పోలీసులు గుర్తించారు. దీంతో వెంటనే ఆమె తల్లి దండ్రులకు లేక్ పోలీసులు సమాచారం అందించారు. మంగళవారం పాపమృతదేహాన్ని గుర్తించారు. తల్లి కుమార్తె మృతదేహాలకు గాంధీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించిన పోలీసులు అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసును బహదూర్‌పురా పోలీసుస్టేషన్ కు బదిలీ చేస్తామని లేక్‌పోలీసులు తెలియజేసారు. కుమార్తె మనుమరాలి మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# తెలంగాణలో ఘనంగా కార్తికపౌర్ణమి పూజలు

## శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు 5:** తెలంగాణలో కార్తీకపౌర్ణమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే అలయాలకు చేరుకుని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేశారు. పలువులు భక్తులు నదుల్లో వద్ద పుణ్య స్నానాలు ఆచరించి ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. కార్తిక మాసంలో అత్యంత పవిత్రమైన పౌర్ణమి పర్వదినాన్ని భక్తులు పురస్కరించుకుని రాష్ట్రంలోని శివాలయాలన్నీ భక్త జన సందోహంతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. కార్తిక పౌర్ణమి రోజున శివాలయాల్లో దీపం వెలిగించడం వల్ల పుణ్యం వస్తుందని భక్తులకు ప్రగాఢ విశ్వాసం. ఈ నేపథ్యంలో భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు వచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలు ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించి, 365 వత్తులతో కూడిన దీపాలను సమర్పించారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో



భక్తుల రద్దీ కొనసాగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తిక పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీశైలంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరించారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. శేరిలింగంపల్లి, మదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లోని ప్రధాన శివాలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీలు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా భక్తులందరికీ సకాలంలో దర్శనం లభించేలా క్యూలైన్లను ఏర్పాటు చేశారు. శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు, భక్తులు వెలిగించిన దీపాల కాంతులతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకొంది. సుప్రసిద్ధ శైవ క్షేత్రం కీసరగుట్టలో భక్తుల సందడి నెలకొంది. శ్రీరామలింగేశ్వరస్వామిని దర్శించుకు నేందుకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. దర్శన అనంతరం భక్తులు ఆలయానికి ఎదురుగా ఉన్న శివ లింగాలకు పంచామృత అభిషేకాలు చేశారు. అలాగే ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలు వెలిగించారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. మరోవైపు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో కార్తిక పౌర్ణమి సందడి నెలకొంది. ఆలయంలోని వ్రత మండపంలో భక్తులు సత్యదేవుడికి పూజలు నిర్వహించారు. కార్తిక దీపారాధన మండపంలో దీపాలు వెలిగించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోని ఆలయ మాఢ వీధులు కార్తిక పూజలు నిర్వహించే భక్తులతో సందడిగా మారాయి. కార్తీక పూజలు జరిపించుకోవ డానికి రాష్ట్ర నలుమూలల నుంచిభక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యనారాయణ స్వామి వ్రతాలు, బిల్వార్చన, నిజాభిషేకం, కార్తిక దీపాలు వెలిగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో శివాలయం, వ్రత మండపాలు, కార్తిక దీపా రాధన ప్రదేశాలు భక్తులతో కిటకిటలాడాయి.

# గడ్డిమందు తాగి నవవధువు ఆత్మహత్య

## అత్తింటి వేధింపులే కారణం!



వనం వసంత(ఫైల్)

**గజ్వేల్, నవంబరు 5 ప్రభాతవార్త:** పెళ్లి అయ్యి మూడు నెలలు కాకముందే అత్త, మామ, భర్త వేధింపులు తాళలేక ఓ నవ వధువు గడ్డి మందు తాగి ఆత్మ హత్య చేసుకున్న సంఘటన ఇది. గజ్వేల్ పట్టణానికి చెందిన వనం సుగు ణమ్మ, నర్సింలు దంపతుల పెద్ద కుమార్తె వనం వసంత (22)నుపట్టణంలోని కండెల దుర్గమ్మ, గంగయ్యల కుమారుడు కండెల రోహిత్‌కు ఆగస్టు 10వ తేదీన 18తులాల బంగారం, రూ.10 లక్షల నగదు ఇచ్చి ఘనంగా వివాహం జరిపించారు. ఈనెల 1వ తేదీన సాయంత్రం 4 గంటలకు సుగుణమ్మ ఆమె కూతురు వసంతకు ఫోన్‌చేసి బాగున్నావా అని అడగడంతో కడుపునొప్పి వస్తుందని, వాంతులు అవుతున్నా యని, తలతిరిగినట్లుగా ఉందని చెప్పడంతో తల్లి సుగుణమ్మ ఏమైంది నీకు అని మందలించి అడగడంతో గడ్డిమందు తాగినట్లు చెప్పడంతో సుగుణమ్మ వెంటనే తన కుమారుడు సింహాద్రికి ఫోన్ చేసి అక్క ఫోన్‌లో ఏదోలా మాట్లాడుతుందని నీవు వెంటనే అక్క వద్దకు వెళ్ళమని చెప్పడంతో అక్కడికి వెళ్ళే సరికి వసంత అపస్మారక స్థితిలో ఉండడం చూసి కంగుతిన్న సింహాద్రి వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆర్‌విఎం ఆసుపత్రికి, అక్కడి నుండి నిమ్స్‌కు తరలించారు.

గత నాలుగురోజుల నుండి చికిత్స పొందు తున్న వసంత బుధవారం ఉదయం మృతిచెందడంతో పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికితీసుకువచ్చారు. వసంత తల్లిదండ్రులు సుగుణమ్మ, నర్సింలు మీడియాతో మాట్లాడుతూ తమ అల్లుడు రోహిత్ ప్రతినిత్యం అద నపు కట్నం తీసుకురావాలని వేధించేవాడని, ఎవరి తోనైనా మాట్లాడితే అక్రమ సంబంధం అంటగట్టేవారని, వసంత ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, అత్త, మామ, భర్త కలిసి హత్యచేశారని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. గజ్వేల్ ఏసిపి నరసింహులు వసంత మృతదేహాన్ని పరిశీలించగా డిప్యూటీ తహసీల్దార్ పంచనామా చేశారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గజ్వేల్ సిఐ రవికుమార్ కేసు నమోదు చేసుకొని అత్త, మామ, భర్తలను విచారిస్తున్నట్లు తెలిపారు.

# బాలికపై లైంగిక దాడి

## మద్యం తాగించి పలుమార్లు అత్యాచారం

### సహకరించిన తల్లి, ప్రియుడికి 180 యేళ్లు చొప్పున కఠిన జైలు రూ.11.75 లక్షలు జరిమానా విధించిన కేరళ పోక్సో కోర్టు

**కోజికోడ్, నవంబరు 5:** కేరళలోని కోజికోడ్‌లో జరిగిన దారుణ ఉదంతంపై కేరళ పోక్సోకోర్టు తీవ్రస్థాయిలో స్పందించింది. 12 ఏళ్ల మైనర్ బాలికపై పదేపదే అత్యాచారంచేసి హింసించి నందుకుగాను మహిళ, ఆమె బాగస్వామికి 180 ఏళ్లచొప్పున కఠిన కారాగార శిక్ష విధిం చింది. పోక్సోకోర్టు న్యాయమూర్తి అష్రాఫ్ ఎఎం బుధవారం తన తీర్పును వెలువరించారు. పోక్సో చట్టంలోని అనేక సెక్షన్లకింద వీరిపై కేసునమోదుచేసారు. ప్రతిసెక్షన్‌పరిధిలో 40 ఏళ్లచొప్పున కఠిన కారాగారశిక్ష ఉంటుందని, అలాగే 11.75 లక్షల రూపాయలు జరిమానా కూడా విధిం చారు. ఈ మొత్తాన్ని బాలికకు చెల్లించాలని ఆదేశించారు. జరిమానా చెల్లించనిపక్షంలో మరో 20 నెలలపాటు జైలుశిక్ష అనుభవిం చాల్సి ఉంటుందని వెల్లడించారు. పోక్సోకేసులో ఒకమహిళకు ఇంత భారీ ఎత్తునజైలుశిక్ష జరిమానా విధించడం బహుశా దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అవుతుందని స్పెషల్‌పబ్లిక్‌ప్రాసి క్యూటర్ సోమశేఖరన్ అన్నారు. తన భర్త కుమార్తెతో తిరువనంత పురంలో జీవిస్తూనే ఈ నిందితురాలు మరొకరితో లేచిపోయిందని, వెళుతూ తన కుమార్తెను కూడా తీసుకు వెళ్లినట్లు పోలీసులు ఛార్జిషీటులో వెల్లడించారు. పాలక్కడ్, మాలాప్పురం ప్రాంతాల్లో అద్దెఇళ్లలో నివసిం చినట్లు తేలింది. 2019 డిసెంబరునుంచి 2021 అక్టోబరుమధ్యకాలంలో వీరంతా అద్దెఇళ్లలో నివసిస్తూ తరచూ మకాం మార్చే వారని ప్రాసిక్యూషన్ అభియోగంమోసింది. ఈ కాలంలోనే మహిళ ప్రియుడు పదేపదే 12 ఏళ్లమైనర్ బాలికపై అత్యాచారంచేసాడని, అందుకు బాలిక తల్లికూడా సహ కరించి బాలికను బెదిరించి లైంగిక దాడికి మద్దతిచ్చిందని ప్రాసిక్యూషన్ అభియోగాలు నమో దుచేసింది. వ్యతిరేకిస్తే బాలిక మెదడులో చిప్ ఒకటి పెట్టామని, ఈ సంఘటన ఎవరికి చెప్పినా మాకు తెలిసిపోతుందని బెదిరిం చేందని ఆ బాలిక వాంగ్మూలం కూడా ఇచ్చిం ది. అంతేకాకుండా అత్యాచారానికి ముందు బాలికచేత బలవంతంగా మద్యం తాగించే వారని కూడా విచారణలో రుజువయింది. కేసును విచారించిన పోక్సోకోర్టు జరిమానా బాలికకు చెల్లించాలని, జిల్లా న్యాయసేవల అథారిటీ కూడా ఆమెకు అదనపు సాయం అందించాలని, బాదితురాలి సహాయ పథకం కింద మంజూరుచేయాలని ఆదేశాలిచ్చింది. ఈకేసులో పోక్సోచట్టంలోని సెక్షన్లు, జువనైల్ జస్టిస్ చట్టం, ఐపిసి కింద



విభిన్న అభియో గాలు నమోదుచేసి విచారణ చేసారు. ప్రియు డితో లేచిపోయిన ఈ మహిళ ఆతడితోకలిసి మైనర్‌బాలికసమక్షంలోనే లైంగికకార్యకలా పాలు చేసేవారని విచారణలో తేలింది. కోర్టు కు జరిమానా చెల్లిస్తే బాలికకు అందచేయాలని కోర్టు న్యాయ మూర్తి ఆదేశించారు. శిక్ష అను భవించేందుకుగాను ఇద్దరు దోషులను తవనూర్ జైలుకు తరలించారు.

# హైకోర్టు ఆదేశాలతో టివి5 మూర్తి, గౌతమి చౌదరిపై కేసు నమోదు

**కెపిహెచ్‌బి కాలనీ, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రముఖ వ్యాపారవేత్త కాకాని ధర్మ సత్యసాయి శ్రీనివాస మహేష్‌పై అక్రమంగా బ్లాక్మెయిల్, ఫోన్ టాపింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణల కేసులో తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి పోలీసులు రంగంలోకి దిగారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రముఖ టీవీ ఛానల్ టీవీ5 సీఈఓ మూర్తితో పాటు చిరుమామిళ్ల గౌతం చౌదరిలపై పోలీసులు అధికారికంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

గతంలో తన వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే విధంగా ఫోన్ కాల్స్ ట్యాప్ చేసి టెలికాస్ట్ చేశారని అలాగే 10 కోట్ల రూపాయలు అక్రమ డబ్బు వసూలుకు ప్రయత్నించారని మహేష్ ఆరోపించారు. ఈ వ్యవ హారంపై ఆయన హైకోర్టు న్యాయవాది నాగూర్ బాబు తరపున హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం ఫిర్యాదుపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులను ఆదేశించింది.

ఈ ఆదేశాల తనంతరం కూకట్‌పల్లి పోలీసులు తుది నిర్ణయానికి వచ్చి తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టిన పోలీసులు టీవీ5 మూర్తి, గౌతమి చేతులపై కొత్తనేర న్యాయ విధానం అయిన భారతీయ న్యాయ సంహిత బి.ఎన్.ఎస్ సెక్షన్ 308(3) అక్రమ బెదిరింపులు వసూళ్లకు ప్రయత్నం, అలాగే ఐటీ చట్టం 72వ సెక్షన్ వ్యక్తిగత గోపీతకు భంగం కలిగించడం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు. నిందితులు అక్రమంగా టాప్ చేసిన ఆడియో రికార్డింగ్‌లు ప్రైవేట్ దృశ్యాలు ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను స్వాధీనం చేసుకునే ప్రక్రియపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలిసింది.

# నడిరోడ్డుపై హత్య: యువకుని కత్తితో పొడిచిన రౌడీషీటర్

## హైదరాబాద్ శివార్లలో దారుణం

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), నవంబరు 5, ప్రభాతవార్త:** నగర శివార్లలోని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు రౌడీషీటర్ ఓ యువకుడిపై కత్తితో దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన బాధిత యువకుడిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్థానికులు, జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం జగదిరిగుట్ట సమీపంలోని రంగారెడ్డి నగరకు చెందిన రోషన్ సింగ్ (24), అతని స్నేహితుడు బుధవారం సాయంత్రం



సుమారు నాలుగు గంటల సమయంలో జగద్గిరిగుట్ట బస్టాండ్ సమీపంలో ఉన్నారు. ఇద్దరు వ్యక్తులతో ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకు వచ్చిన స్థానిక రౌడీషీటర్ బాల శివారెడ్డి (34) అక్కడే ఉన్న రోషన్ సింగ్ వద్దకు వెళ్లి ఏదో విషయమై గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో తీవ్ర ఉన్మాదంతో రెచ్చిపోయిన బాల శివారెడ్డి తాను తెచ్చుకున్న కత్తితో రోషన్ సింగ్‌ను కడుపులో, వీపు భాగంలో ఎనిమిది సార్లు పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. సంఘటన జరుగుతున్న సమయంలో బాధితుడు రోషన్ సింగ్‌ను కదలకుండా నిందితుడు బాల శివరెడ్డితో కలిసి వచ్చిన అతని స్నేహితుడు మహమ్మద్ ఒడిసి పట్టుకో వడంతో బాలశివరెడ్డి కత్తితో పదేపదే రోషన్ సింగ్‌పై పలుమార్లు కత్తితో దాడి చేశాడు. అకస్మాత్తుగా ఓ రౌడీ షీటర్ యువకుడిపై కత్తితో దాడి చేయడం చూసిన స్థానికులు భయంతో అక్కడి నుండి పారిపోయారు. తీవ్ర గాయాలు పాలైన రోషన్ సింగ్ కడుపునుండి తీవ్ర రక్తస్రావం జరిగింది. బాలశివరెడ్డి రోషన్ సింగ్‌పై దాడి చేస్తున్న సమయంలో మహమ్మద్ రోషన్ సింగ్ చేతులు పట్టుకొని కదలకుండా చేసి బాలశివరెడ్డికి దాడి చేయడానికి సహకరించాడు. అనంతరం దాడి పూర్తి అయిన తర్వాత మహమ్మద్‌తో కలిసి పారిపోవడానికి ఆదిల్ అనే స్నేహితుడు తన ద్విచక్ర వాహనం సిద్ధంగా ఉండడంతో దానిపై ముగ్గురు పారిపోయారు. తీవ్ర గాయాల పాలైన రోషన్ సింగ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. అయితే జరిగిన దాడి విషయమై స్థానికంగా పలు కథనాలు ప్రచారంలో ఉన్న వాస్తవ పరిస్థితులు వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

# అటు కార్తిక మాస పౌర్ణమి, ఇటు కనువిందు చేసిన సూపర్ మూన్

## దుబాయ్ సహా గల్ఫ్ దేశాలలో ప్రకాశవంతంగా కనిపించిన చంద్రుడు

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** ఖగోళంలో బుధవారం మరో అద్భుతం ఆవిష్కృతమయ్యింది. కార్తిక పౌర్ణమి రోజున ఓవైపు వైష్ణవ, శివాలయాలలో పూజలు జరుగుతుండడంతో పాటు లక్షల సంఖ్యలో భక్తులు నదుల్లో స్నానాలు చేసి, జపాలు చేస్తున్న తరుణంలో బీవర్ సూపర్ మూన్‌గా చంద్రుడు పెద్దదిగానూ ప్రకాశవంతంగానూ కనిపించాడు. బీవర్ సూపర్ మూన్ దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలలోనే బాగా కనిపించగా



భారత్‌లో ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాలలో సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో చీకటి పడిన తరువాత పౌర్ణమి చంద్రుడు తరహాలో పరిపూర్ణంగా కనువిందు చేశాడు. తెలుగు రాష్ట్రాలలో కొన్నిచోట్ల మాత్రమే చంద్రుడు కని పించగా ఆకాశంలో మబ్బులు పట్టడంతో చాలాచోట్ల కనిపించలేదు. బీవర్ సూపర్ మూన్ ప్రభావంతో సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే ఎనిమిది శాతం పెద్దగా 16 శాతం అధిక కాంతితో చంద్రుడు ప్రకాశవంతంగా కనువిందు చేయడం గమనార్హం. ఈ ఏడాది అత్యంత ప్రకాశవంతమైన సూపర్ మూన్‌గా బీవర్ సూపర్ మూన్ నిలిచిందని శాస్త్రవేత్తలు తెలిపారు. బీవర్ సూపర్ మూన్ సమయంలో చంద్రుడు భూమికి సాధారణ సమయంలో కంటే 30 వేల కిలోమీటర్ల తక్కువ దూరంలో అంటే సుమారు మూ డు లక్షల 56 వేల కిలోమీటర్ల దూరంలో వుంటాడని శాస్త్రవేత్తలు తెలిపారు. కాగా బీవర్ సూపర్ మూన్‌ను దుబాయ్ సహా గల్ఫ్ దేశాల ప్రజలు వీక్షించారు. అక్కడ ఆకాశం నిర్మలంగా వున్నట్లు దుబాయ్‌లో బీవర్ సూపర్ మూన్‌ను వీక్షించిన ప్రజలు చెప్పడం గమనార్హం. ఇందుకోసం దుబాయ్‌లో ని అస్ట్రానమి గ్రూప్ ఆపరేషన్స్ భారీగా ఏర్పాట్లు చేశారు.

# మణిపూర్‌లో లోక్‌తక్ సరస్సును సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

## తేలియాడు సరస్సు పర్యాటక అభివృద్ధిపై ఆరా తీసిన కేంద్ర మంత్రి

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** మణిపూర్ పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రపంచంలోనే తేలియాడే జాతీయ ఉద్యానవనంగా పేరొందిన లోక్ తక్ సరస్సును సందర్శించారు. ఈ సరస్సు ఆద్యంతం పరిశీలించారు. జిల్లా కలెక్టర్, ఎస్పితో కలిసి బోట్ ఎక్కి అరగంటపాటు తిరిగారు. ఈ సరస్సు విశేషాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్ కు 48 కి.మీల దూరంలోనున్న బిష్ణుపూర్ జిల్లాలో ఈ లోక్ తక్ సరస్సు ఉంది. భారతదేశంలోనే అతిపెద్ద మంచి నీటి సరస్సు ఇది. 250 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. ఫుందిస్ అని పిలువబడే తేలియాడే దీవులవల్ల ఈ లోక్ తక్ సరస్సు ప్రసిద్ధి చెందింది. ఇవి వృక్షజాలం, నేల, సేంద్రియ పదార్థాలతో ఏర్పడినవి. ప్రపం చంలోనే ఏకైక తేలియాడే జాతీయ ఉద్యానవనం ఇదే కావడం విశేషం. అట్లాగే మణిపూర్ రాష్ట్ర జంతువు సంగై జింకకు ఈ లోక్ తక్ సరస్సు నివాస స్థలం సైతం ఇది. ఈ సరస్సులో 100 కంటే ఎక్కువ రకాల పక్షులు, 200 కంటే ఎక్కువ రకాల జల వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. స్థానిక ప్రజలకు ఈమంచినీటి సరస్సు జీవనాధారం. నీటిపారుదల, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తి కోసం ఈ సరస్సును ఉపయోగిస్తారు. వేలాది మంది మత్స్యకా రులు, రైతులుఈ సరస్సుపైనే ఆధారప డుతున్నారు. లోక్తక్ హైడ్రోఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ (105 మెగావాట్లు) ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరుగు తున్నది. వాస్తానికి వేగంగా అభివృద్ధి చెందుతున్న పర్యావరణ పర్యాటక కేంద్రమని, మణిపూంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం పర్యాటకుల సంఖ్య గణనీయంగా తగ్గిందని అధి కారులు కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ సరస్సు అభివృద్ధికిసంబంధించి ప్రతిపాదనలను పంపాలని కేంద్రంతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

అనంతరం చుర్ చాంద్ పూర్ జిల్లా అభివృద్ధి, స్థానిక సమస్యలపై స్థానిక జిల్లా కలెక్టర్, వివిధ శాఖల ఉన్నతాధి కారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. గ్రామాల నుండి జిల్లా కేంద్రం, రాజధాని వరకు రవాణా సౌకర్యం లేదని, ప్రధానంగా దీనిపై దృష్టిసారించాలని అధికారులు కోరారు.

# వాట్సాప్ హ్యాకింగ్ కేసులపై టిజిసిఎస్‌బి హెచ్చరిక

## స్మార్ట్, ఐఫోన్లు వాడుతున్న వారు జాగ్రత్తగా ఉండాలని వినతి

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు వినియోగదారుల వాట్సాప్‌లను హ్యాకింగ్ చేస్తూ స్మార్ట్ ఫోన్‌లు, ఐ ఫోన్లు వాడేవారి డాటాలు చోరీ చేస్తూ బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఉదంతాలపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) హెచ్చ రికలు చేసింది. ఈ మేరకు టిజిసిఎస్‌బి డైరక్టర్ శిఖా గోయల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ఎపికె ఫైళ్లను ఆర్‌టిఎ చలాన్లు, బ్యాంకు కెవైసి, కొరి యర్ నోటీస్, ఇన్వాయిస్ చెల్లింపులు, వీడియో, ఫోటో షేరింగ్ యాప్ పేరిట స్మార్ట్ ఫోన్‌లను వాడే వారికి పంపిస్తున్నారని ఆమె తెలిపారు. వీటిని ఇన్‌స్టాల్ చేస్తే వినియోగదారుల ఎస్‌ఎం ఎస్, ఓటిపి, కాం ట్రాక్ట్స్, వాట్సాప్‌పై సైబర్ నేరగాళ్లు పూర్తిగా నియంత్రణలోకి తీసుకుం టారని, దీంతో పాటు ఐ ఫోన్ వాడకందారులను కాల్, ఎస్‌ఎంఎస్, ఫార్వార్డింగ్ ట్రిక్ ద్వారా టార్గెట్‌చేస్తున్నారని ఆమె తెలిపారు. వాట్సాప్‌లో వచ్చిందని తెలియ గానే ఏయాప్‌ను వెనుకా ముందు చూడకుండా ఎవరూ ఇన్‌స్టాల్ చేయకూ డదని శిఖాగోయల్ కోరారు. ఈ విషయ మై వెంటనే 1930 లేదా 8712672222కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

వాట్సాప్ ఎలా హ్యాక్ అవుతుందనే దాని గురించి శిఖాగోయల్ వివరిస్తూ నేరగాళ్లు మొదట ఒక లింక్ లేదా ఎపికె పంపుతారని, వీటిని ఎవరైనా ఇన్‌స్టాల్ చేస్తే యాప్‌కు వచ్చే ఎస్‌ఎంఎస్, ఓటిపిలు ఇతరులు చదివే అవకాశం వుంటుందని ఆమె తెలిపారు. వీటిని సైబర్ నేరగాళ్లు తమ ఫోన్‌లో రిజిస్టర్ చేసుకుని, బాధి తుల ఫోన్‌లను తమ నియంత్రణలోకి తీసుకుం టారని శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరగాళ్లు 21 సంఖ్య లాంటి నంబర్ దయల్ చేయమని కోరతారని, వాస్తవానికి ఇది కాల్ ఫార్వార్డింగ్ కోడ్ అని, బాధితులు నేరగాళ్లు చెప్పినట్లు చేస్తే ఓటిపి వెరిఫికేషన్ కాల్స్ అన్నీ నేరగాళ్ల ఫోన్లకు వెళతాయని, దీని తరువాత బాధితుల ఫోన్‌లోని అన్ని వివరాలు





తీసుకుని బ్యాంకు ఖాతాలను ఖాళీచేస్తారని ఆమె తెలిపారు. ఫోన్ హ్యాక్ అయిందని అనుమానం వస్తే కాల్ ఫార్వార్డింగ్‌ను సెట్టింగ్స్‌లో వెళ్లి డిసేబుల్ చేయాలని, ముఖ్య మైన ఫోటోలను, ఫైళ్లను బ్యాకప్ చేసుకోవాలని, అనుమానాస్పద యాప్‌లను వెంటనే తొలగిం చాలని టిజిసిఎస్‌బి డైరక్టర్ తెలిపారు. వెంటనే పోలీసులను సంప్రదించి వారి సహాయం తీసుకోవాలని ఆమె కోరారు.


ఈశాన్య రైల్వే

నవరణ

టెండర్ నం. 28250139, 03.12.2025న గడువు గంది మరియు టెండర్ ప్రకటన నం. 43 తేది: 31.10.2025 (ఐటమ్ నం.01)కు సంబంధించిన దానికి అనుబంధంగా దిగువ గుర్తించబడిన సవరణ చేయబడుతోంది. ఐటమ్ నం.:- 01, ఐటమ్ వివరణ:- టెండర్ తెరచు తేదీ-సమయంతో, ప్రస్తుతం ఉన్న ఎంట్రీ:- 03.12.2025 ఉ.11.30 గం. సవరింపు ఈ విధంగా చేయబడుతుంది:- 20.11.2025 ఉ.11.30 గం. మిగిలిన ఇతర అన్ని నియమాలు మరియు నిబంధన ఎటువంటి మార్పు లేకుండా ఉంటాయి. గమనిక: పై సమాచారాన్ని N.E. రైల్వే వెబ్‌సైట్ www. ner.indianrailways. gov.in మరియు భారత ప్రభుత్వం యొక్క వెబ్‌సైట్ www. tenders.gov.in పై చూడవచ్చును.

SMM/II, ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్, గోరఖ్‌పూర్

CPRO/S-56

రైలులో బీడీ/సిగరెట్ కాల్చవద్దు



BEFORE DEBTS RECOVERY TRIBUNAL- II
Ist FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-1
O.A. NO. 662 OF 2025

Between:
ICICI BANK LTD
And
Y. SAI PRAVEEN KUMAR

To,
Y. SAI PRAVEEN KUMAR
S/O. Y. KONDAIAH
12/138-B1, NANDI KOTKURU,
OPP: BASI REDDY COMPLEX,
NANDYALA ROAD, KURNOOL
DIST, ANDRA PRADESH- 518401

SUMMONS BY WAY OF PAPER PUBLICATION

Please take the summons in the above OA No.662 of 2025 filed by the Applicant for recovery of debts of Rs.2500466/- (Rs.Twenty Five Lakhs Four Hundred Sixty Six only) against You. The Honble Tribunal Ordered Summons to you by way of Paper Publication in "Vaartha Telugu News Paper" and the posted the matter to 21.11.2025.

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:

i) To show cause within thirty days of the serve of summons as to why relief prayed for should not be granted.

ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.

iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets ad properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties.

iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;

v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are hereby required to show cause on 21.11.2025 at 10:30 AM at Debts Recovery Tribunal -II, 1st floor, Triveni Complex, Abids, Hyderabad-500001, in person or by an advocate duly instructed as to why the relief prayed for should not be granted.

Take notice that in case of default the Application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the 31/10/2025.

REGISTRAR,
Debts Recovery Tribunal- II
Ist Floor, Triveni Complex, Abids, Hyderabad

వార్త

కోపంగా ఉన్నప్పుడు నీవు ఏ పని చేయొద్దు. అప్పుడు అన్నీ పొరపాట్లే చేస్తావు.

-బల్తజాన్

# ట్రంప్ జాతకం తలకిందులు!

అమెరికాలో రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లో ట్రంప్ పార్టీ రిపబ్లికన్ అభ్యర్థులు కట్టకట్టుకొనిఓటమి పాలయ్యారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థులు గెలిచి విజయకేతనం ఎగురవేశారు. ఆనాడు ట్రంప్ శ్వేతసౌధంలో అడుగుపెట్టిన నాటి నుంచి తీసుకున్న నిర్ణయాలు చాలా సందర్భాల్లో ఎదురొచ్చాయి. చాలా నిర్ణయాలను అమెరికన్లే వ్యతిరేకించారు. కళ్లకు కనపడిన వారందరినీ హెచ్చరికలు చేసి భయభ్రాంతులను చేయడం, విచక్షణ లేని వాగాడంబరం ఆయన్ని పరాజయం అంచున నిలబెట్టింది. మంచి నిర్ణయాలు తీసుకున్నారని జనం భావిస్తే వాటికి తుది ఆమోదముద్రగా ముందున్న ఎన్నికల్లో ప్రజలు అభినందన పూర్వకంగా ఓట్లిచ్చి ఆయా పార్టీల అభ్యర్థులను ఆదరించేవారు. లేకంటే తిరస్కరించడం మామూలే. గవర్నర్, మేయర్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ బంధువు ఒకరు సిన్సినాటి మేయర్ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. వివిధ రాష్ట్రాల్లో ట్రంప్ వ్యతిరేకులపైనే జనం మొగ్గు చూపారని అర్థమౌతోంది. అమెరికాలో ఎన్నికల్లో ఎదురుపడేవి రెండే రెండు పార్టీలు. ఒకరు ఓడితే మరొకరు నెగ్గినట్లే. ఎప్పుడూ ఇవే అంచనాలు ప్రాతిపదికగా జనంలో అభిప్రాయాలు ఏర్పడుతాయి. ఈసారి ఎన్నికల్లో మాత్రం ట్రంప్ పార్టీ అభ్యర్థులకు అపజయం తప్పదనే విషయం మీడియ ముందుగానే అంచనావేసింది. అందుకే వీలుగానే విశ్లేషణలను వెలువరించింది. కాగా బ్యాలెట్ పేపర్లపై తన పేరు లేకపోవడం వల్లనే రిపబ్లికన్ అభ్యర్థులంతా ఓటమి పాలయ్యారని ట్రంప్ చెప్పుకోవడం విడ్డూరంగా ఉంది. ఎన్నికల్లో గెలుపోటములు ఎలా ఉంటాయో చెప్పలేకపోయినా వాటి పర్యవసానాలు ఏమి సూచిస్తున్నాయో విశ్లేషించడం తేలిక. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలపై కక్షకార్పణ్యాలున్నట్లు ఈర్ష్యాసూయలతో ట్రంప్ వరుసగా ఒక పద్ధతి లేకుండా సుంకాలు విధిస్తూ లొంగి వచ్చిన వారికి సుంకాలు తగ్గిస్తూ, రాని వారికి రాలేని వారికి సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలు విమర్శలకు గురయ్యారు. ఏదో మిశ్రమ స్పందన అయి ఉంటే కొన్నిసీట్లైనా రిపబ్లికన్ పార్టీ గెలిచి ఉండేది. కానీ ఒక్కటంటే ఒక చోట కూడా గెలిచిన సందర్భం లేదు. ప్రధానంగా అమెరికా అధ్యక్షుడి హోదాలో భారత దేశం మీద కాలుదువ్వడం అక్కడున్న భారతీయులెవరికీ రుచించలేదు. పైగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ఆంక్షలు, ట్రేడ్ డీల్ కుదరకపోతే ఇక చూస్కో! అనే గంతులు భారతీయేతరులకు కూడా నచ్చలేదు. కేవలం యేడాది పాలనలోనే ట్రంప్‌పై తీవ్ర వ్యతిరేకతలు ఉండబట్టే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులకు తగినన్ని ఓట్లు పడలేదు. ఒకసారి గెలిపించి అత్యున్నత స్థానానికి పంపిన వారు, తమకు, తమ మనుగడకు ఏమాత్రం ఇబ్బంది అవుతోందన్నా వేచి చూసి అనంతర ఎన్నికల్లో ఓటర్లు చాచికొడతారన్న ఎన్నికలతత్వం ట్రంప్‌కుబోధపడినట్లు లేదు. ప్రధానంగా ఈ ఎన్నికల్లో న్యూయార్క్ ఎన్నికలలో భారీ ఓటింగ్ నమోదైంది. సుమారు రెండు మిలియన్లకుపైగా నగర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. న్యూయార్క్ నగర తొలి ముస్లిం మేయర్‌గా భారతీయ మూలాలున్న జోహ్రాన్ మమ్దానీ (34) చారిత్రక విజయం సాధించారు. ఆయన బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ మీరానాయర్ కుమారుడు. వామపక్ష అభిలాషలున్న వ్యక్తి. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్య వంటి భరోసా ఇవ్వడం వలనే గెలిచి ఉండొచ్చునని విశ్లేషకుల అంచనా. టారిఫ్‌లపై ఫెడరల్ చట్టాల్ని ఉల్లంఘించారన్న ఆరోపణలతో ట్రంప్ నిర్ణయాలపైదాదాపు 50 కేసులు నమోదయ్యాయి. పైగా షట్‌డౌన్ కూడా ట్రంప్ అనుకూల అభ్యర్థుల ఓటమికి కారణం. ఈ విషయాన్ని ట్రంప్ కూడా అంగీకరించారు. నిజానికి అమెరికా చట్టసభ సభ్యులు మధ్య కీలక బిల్లులపై సయోధ్య కుదరకపోవడంతో 36 రోజులుగా 'షట్‌డౌన్' కొనసాగుతోంది. ఇదికూడా అమెరికా రాజకీయాల్లోనేకాదు ప్రజల్లో కూడా చర్చనీయాంశమైంది. ఇలాంటి షట్‌డౌన్ కారణంగా అమెరికా వ్యవస్థ బలహీనమైందనే ఆరోపణలు ప్రజల్నించి వినవస్తున్నాయి. గతంలో ట్రంప్ రాజ్యమేలినప్పుడు కూడా 35 రోజుల పాటు సుదీర్ఘ షట్‌డౌన్ కన్నా ఈసారి మరికొన్ని రోజులు కొనసాగే అవకాశాలు కనపడుతున్నాయి. రేపెపుడో ట్రంప్ దిగివచ్చినా జరిగిన నష్టాన్ని కూడగట్టడం సాధ్యం కాదు. ఇంతవరకు జరిగిన షట్‌డౌన్ కాలంలో 90వేల కోట్ల రూపాయల ఆర్థిక నష్టం జరిగిందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీసు లెక్క తేల్చింది. హైదరాబాద్ మూలాలున్న భారతీయ సంతతి నేత గజాలా హాష్మీ వర్జీనీయా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. అమెరికాలో షట్‌డౌన్ కారణంగా ఆహార సంక్షోభం తలెత్తింది. ఫెడరల్ ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆహార సహాయంఅందడం లేదు. ఇంత జరుగుతున్నా ట్రంప్ కిమ్మన్నాస్తిగా ఉండిపోయారు. ప్రధానంగా వాణిజ్య రాజధానిగా చెప్పబడే న్యూయార్క్‌పై తీవ్ర ప్రభావం పడడంతో ఆ రాష్ట్రం స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీగా ప్రకటించుకుంది. అమెరికాలో కోట్లాది మంది అల్పాదాయ కుటుంబాలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఇలాంటి ఆహార సంక్షోభాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ట్రంప్‌దే. కానీ ఆయనలో చిత్తశుద్ధి లేకనే రోజుల తరబడి ఆహార సదుపాయాలు నిలిచిపోయినా జోక్యం చేసుకోవడం లేదని విపక్షాలు తమ ఎన్నికల ప్రచార ప్రస్తావనలతో ప్రజల్ని ఆకట్టుకోగలగడమే ట్రంప్ అభ్యర్థులకు ఓటమి తెచ్చిపెట్టాయి. అంతర్గత సమస్యలు పరిష్కరించుకునే తరుణంలో ఇతర దేశాల కింద కయ్యానికి కాలు దువ్వుతున్న ట్రంప్‌కు ఈ ఎన్నికల ఫలితాలు గుణపాఠం కాగలదు. విజ్ఞతతో వ్యవహరిస్తే ఆయనకే మేలు.



నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికి, ఆశలకూ అతీతమైనదే అసలైన సంతోషం.

-ఎమర్సన్



అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

-మహాత్మా గాంధీ

# ప్రజావాక్కు



### ప్రణాళిక అవసరం

దేవాలయాలు, యాత్రలు, ఉత్సవాలు ఇవి మనసును పవిత్రం చేసి, శాంతి నింపాల్సిన ప్రదేశాలు. కానీ ఇటీవలి రోజుల్లో రద్దీ, నిర్వాహణలో నిర్లక్ష్యం, భక్తుల్లోని ఆతురత కలిసి అవే ప్రదేశాలు విషాదానికి వేదికలవుతున్నాయి. కాశిబుగ్గ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం మనను ఆలోచింపజేయాలి. ఈఏడాదిలోనే దేశవ్యాప్తంగా రద్దీ కారణంగా 100కి పైగా మంది మరణించడం అనేది కేవలం సంఖ్య కాదు. ప్రతి సంఖ్య ఒక కుటుంబ రోదన. ఈపరిస్థితిని మార్చడం ప్రభుత్వాలు, దేవాలయ నిర్వాహకులు, భక్తులు అందరి బాధ్యత. పుణ్యక్షేత్రాల్లో రద్దీని నియంత్రించేందుకు శాశ్వత భద్రతా బలగాలు, శిక్షణ పొందిన వాలంటీర్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళిక కావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం జిల్లా

### ఉపాధ్యాయ వృత్తికే అవమానం

పిల్లలకు పాఠాలుచెప్పాల్సిన పంతులమ్మ వారిచేత చాకిరీ చేయించుతూతానుఏంచేసినా అడిగేవారులేరని విర్రవీగిన టీచర్ దారుణంగా ప్రవర్తించారు. శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టి మండలం బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయురాలుసెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థినులతో కాళ్లు నొక్కించుకుంటున్న ఘటన అమానుషం. విద్యార్థులపై జులుం ప్రదర్శించిన టీచర్ బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన టీచర్ దర్జాగాకుర్చీలో కూర్చొని సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని దెబ్బ తీశారు.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### రాయితీ ఇవ్వాలి

సాధారణంగా సీనియర్ సిటిజన్ అన్న భావం కేవలం వయస్సు మాత్రమే60 దాటినవారే మాత్రంకాదు, ఉద్యోగం లేక కుటుంబ జీవితంలో ఎన్నో అవాంతరాలు, సమస్యలు ఎదుర్కొని నిలబడినవారు. వారికి మిగిలిన పౌరులతో పాటు ఏదైనా ప్రజా వ్యవహారాల్లో రాయితీ ఇవ్వడం ప్రభుత్వంవారికిచ్చే గౌరవం, ఉన్నతత్వం. గానీ మన రైల్వే సేఖ కోవిడ్ తర్వాత దాన్ని ఇచ్చేందుకు ఆర్థిక భారాన్ని చూపి నిరాకరించింది.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావం

మన దేశఆర్థికవ్యవస్థలో వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో వాతావరణ మార్పులు ఈ రంగంపై తీవ్రప్రభావాన్నిచూపుతున్నాయి. వర్షపాతం విధానం అస్థిరంగా మారడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు ఏర్పడటం, వరదలు రావడం వంటి అంశాలు రైతులకు పెద్ద సవాలుగా మారాయి. వర్షాలు సమయానికి పడకపోవడం వలన పంటలు ఎండిపోతున్నాయి. మరోవైపు అధిక వర్షాలు పడి నీట మునిగే పరిస్థితులు ఏర్పడి పంటలు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితులు పంటదిగుబడిని తగ్గించడమే కాకుండా రైతుల ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తున్నాయి. మట్టి నాణ్యత తగ్గడం, కొత్త తెగుళ్ల వ్యాపించడం కూడా వాతావరణ మార్పుల ఫలితమే. ఈ సమస్యను ఎదుర్కొనడానికి ప్రభుత్వం, శాస్త్రవేత్తలు, రైతులు కలిసిపనిచేయాలి. నీటిసంరక్షణ, సేంద్రీయవ్యవసాయం, తక్కువ నీరు అవసరమయ్యే పంటలసాగు, వంటిచర్యలు తీసుకోవాలి.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### బీహార్ కుల రాజకీయాలు

బీహార్ అనగానే కుల రాజకీయాలు వలస కార్మికులు మాత్రమే గుర్తొస్తారు. మరికులం, వలసలు మాత్రమే తమ బిడ్డలకు అన్నం పెట్టవని అక్కడ ప్రజలు గుర్తించాలి. బీహార్ అభివృద్ధికి కావాల్సిన వనరులు అన్ని ఉన్న అల్లుని నోట్లో శని అన్న చందంగా అక్కడి పరిస్థితి తయారు అయ్యింది. అక్కడ కావాల్సింది యువతకు ఉపాధి ఉద్యోగాలు కావాలె. కానీ ఇప్పటి వరకు అక్కడి పరిపాలకులు ఎవరైనా సరే కులం ఆధారంగా , వలస కార్మికులు ఆధారంగామాత్రమే రాజకీయాలు చేశారు కానీ వాళ్లకు ఒక అభివృద్ధి ప్రణాళికను ముందు ఉంచడంలో విఫలం అయ్యారు. అంటే ప్రణాళిక రహితమైన పరిపాలన ద్వారా మాత్రమే ఈ దుర్గతి ఆ రాష్ట్రానికి సంభవించింది.

-భారత అవినాష్, జనగామ

### విషాద సంఘటనలు

ఈమధ్య రహదారి ప్రమాదాలు, వాటి కారణంగా అనేక అమాయక ప్రాణాలు హరించుకుపోతున్నాయి. రోడ్లు నిర్మించకపోతే గతకులు గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయని గోలగోల చేస్తారు. అద్దంలాంటి రోడ్లువేస్తే హద్దులేని వేగంతో ప్రమాదాలను సృష్టిస్తారు. ప్రమాదాలను సూచించే హెచ్చరికల బోర్డులుంటాయి. వాటినిపట్టించుకోరు. ఈ రెండు మూడురోజులలో రోడ్డు ప్రమాదాలలో పదుల సంఖ్యలో ప్రజలు మృతి చెందారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సమాజాన్ని సంస్కరించే విద్యా వ్యవస్థ రావాలి

*తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేవలం ఉద్యోగాలు చేసే యంత్రాలుగా కరెన్సీ నోట్లకు ప్రతిరూపాలుగా చూడడం వలనే సమాజం అధోగతి పాలైపోతున్నది. ఒకరితో ఒకరికి సంబంధాలుండడం లేదు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనన్న నానుడి నిక్కమైకూర్చున్నది. మితిమీరిన ధనాపేక్ష, యుక్తాయుక్త విచక్షణ మరచిన అహంకారతత్వం కలుపుగోలుతనాన్ని, సంఘటితంగా మెసలేతత్వాన్ని మంటగల పడం బాధాకరం. అష్టవంకరలతో అడ్డదిడ్డంగా మారినసామాజికవ్యవస్థను సరిచేసే బాధ్యత ఉపాధ్యాయుల భుజస్కంధాలపైఉంది. అందుకు తగిన మార్పులను ప్రభుత్వాలు నేటి విద్యావ్యవస్థలో తీసుకురావాలి. సంస్కారాన్ని, వినయాన్ని, వివేకాన్ని, సామాజిక స్పృహను కలిగించే రీతిలో పాఠ్యాంశాలలో మార్పులు రావాలి. 'ధనమే పరమావధి' అనే ధోరణి మారాలి. విలువల ఆధారంగా సమాజం నడవాలంటే విద్యావ్యవస్థపై తీవ్రమైన మేథోమథనం జరగాలి. దిగజారిపోతున్న విలువలను చదువులతో సంస్కరించాలి.*



సుంకవల్లి సత్తిరాజు

సాంకేతిక వ్యవస్థ ప్రపంచాన్ని శాసిస్తున్న వర్తమానంలో ఇక నుంచి చదువులకు కూడాఅర్థం మారిపోయే అవకాశముంది. ఇప్పటికే చదువులకు, చేస్తున్న ఉద్యోగాలకు పొంతన లేకుండా పోయింది. ఉపాధికి పనికి రాని చదువులెందుకనే అభిప్రాయం నేటి యువతలో ప్రబలింది. విద్యాధికుల కంటే అరకొర చదువులతో లోక జ్ఞానం సంపాదించుకుని, తాము చేస్తున్న వృత్తిలో నైపుణ్యం సంపాదించుకుని, సంపాదనలో ముందంజలో దూసుకుపోతున్న వారిని చూసి ఆశ్చర్యపడక తప్పదు. ఆస్తులమ్ముకుని చాలీచాలని జీతాలతో జీవితాలను భారంగా నెట్టుకొస్తున్న వారికష్టాలను చూస్తుంటే నేటి విద్యావ్యవస్థను సంస్కరించవలసిన తరుణం తరుముకొచ్చిందనే భావించాలి. మానసిక వికాసాన్ని, జ్ఞానాన్ని అందించిన విద్యల సేద్యంలో సమూల మార్పులు రావాలి. నేటి విద్యార్థుల్లో చేతి వ్రాత కనుమరుగైపోతున్నది. అక్షరాలు సరిగా వ్రాయలేకపోతున్నారు. ఉచ్చారణలో స్పష్టత గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. సాంకేతిక పరిజ్ఞానం మానవ మేథస్సును మింగేస్తున్నది. సాంఘిక మాధ్యమాలు సంస్కారాన్ని పాతి పెడుతున్నాయి. చరవాణి పుణ్యమా అని చిన్న వయసునుండే అశ్లీల దృశ్యాలను చూసే సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. చదువు సంస్కారాన్ని ప్రసాదించాలి కాని దుర్గుణాలను పెంపొందించకూడదు. దురదృష్టవశాత్తూ నేడు జరుగుతున్నది అదే. ఈ పరిస్థితులు మారాలి. వర్తమానంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు సమాజాన్ని అధోగతి పాలు చేస్తున్నాయి. ఆధునిక మానవుడు ఆటవిక ప్రవృత్తిని సంతరించుకుని, ఆటవిక ప్రస్థానం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైపోతున్నది. పెళ్లిళ్ళు పెటాకులైపోతున్నాయి వివాహవ్యవస్థ ఇక గతంలా మిగిలే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆత్మీయబంధాలు అటకెక్కుతున్నాయి. బంధాలు, బంధుత్వాలు తెగిపోతున్నాయి. రక్తసంబంధాల మధ్య కార్చిచ్చు రగులుతున్నది. పెరటి చెట్టు వైద్యానికి పనికి రాదన్నట్లుగా కుటుంబ సభ్యులు పగవారిగా మారుతున్నారు. పరాయివారు ఆత్మీయులుగా మారుతున్నారు. 'ఎవరికి వారే యమునా తీరే' అనే రీతిలో ఒకరి పొడ మరొకరికి గిట్టడంలేదు. సంస్కారం అడుగంటి, వినయం నశించి, సద్గుణాలు లోపించి సమాజం ఒక విష సంస్కృతిలోకి నెట్టబడుతున్నది. ఇలాంటి అస్తవ్యస్త పరిస్థితులకు మూల కారణం నేటి మన విద్యావ్యవస్థఅని చెప్పక తప్పదు. పాఠ్యపుస్తకాలు కేవలం బట్టీ పట్టడానికి, పరీక్షల్లో మార్కులు సంపాదించడానికే ఉపకరిస్తున్నాయి. చదువులంటే కేవలం సంపాదన కోసమేనన్న దురభిప్రాయంఏర్పడింది. నైతిక ప్రవర్తనకు సంబంధించిన అంశాలు పాఠ్యపుస్తకాల్లో లోపించడం, విలువల గురించి బోధించకుండా కేవలం మార్కుల వైపే దృష్టి సారించడం వంటి ఆధునిక వ్యాపార దృక్పథం వలన సమాజం వికృత పరివర్తన దిశగా సాగుతున్నది. ఇప్పటికైనా మేల్కొనకపోతే మానవ ప్రపంచంలో మనిషి లక్షణాలనేవి మిగలవు. ఇప్పటికే నైతిక విలువలు అడుగంటి పోయాయి. స్వార్థం, అరాచకం, అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయాయి. పసి పిల్లలపై కూడా అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల జరుగుతున్న కొన్ని సంఘటనలు క్రూరమృగాల వేటను తలపిస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలి. మంచి చెడుల విచక్షణ నేర్పించాలి. సాంకేతిక నైపుణ్యాన్ని నవసమాజ నిర్మాణానికి వినియోగించాలి. విద్యను స్వీయ ప్రయోజనాల కోసం, పరపీడన కోసం వినియోగించడం వలన విద్యకున్న ప్రాశస్త్యం నశిస్తుంది. విద్యావంతుల శాతం పెరుగుతున్నా, సమాజంలో సరైన మార్పు రావడం లేదు. అరాచకాలు, హత్యలు విశృంఖలంగా కొనసాగుతున్నాయి. పూర్వకాలం నాటి చదువుల్లో ఉండే విలువలు నేటి చదువుల్లో లేవు.



మనిషిని మనిషిగా గౌరవించే రోజులు పోయాయి. ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణం మంచి చెడుల గురించి చెప్పే వారు లేకపోవడమే. నేటి విద్యార్థులకు పుస్తకాలు బరువైనాయి. నేటి పుస్తకాల్లో నైతిక విలువలను బోధించే పాఠ్యాంశాలు కరువైనాయి. చదువుకు అందం సంస్కారం. వినయానికి విలువలు ఆభరణాలు. సకల సద్గుణాలకు ఆయువు పట్టు విద్య. అలాంటి చదువులను పుస్తకాల ద్వారా విద్యార్థుల మస్తకాల్లో ప్రేరేపించాలి. విద్యావ్యవస్థలో కాలానుగుణంగా అనేకమైన మార్పులు చోటు చేసుకుంటున్న మాట వాస్తవం. రాబోయే రోజుల్లో వీటి ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి. విద్యావ్యవస్థ సరిగా లేకపోవడమే సమాజం సరైన దిశలో నడవలేకపోవడానికి కారణమన్న వాదన అక్షరసత్యం. చదువు సమాజానికి ఉపయోగపడడం లేదు. స్వార్థానికి, ధనదాహానికి, ఇతరులను అణగద్రొక్కే నైజానికి నేటి విద్య జీవం పోస్తున్నదనడంలో సందేహం లేదు. నేటి సమాజంలో విద్యావంతులు పెరుగుతున్నారు. అయినా విద్యావంతులను గౌరవించే పరిస్థితి కూడా నేటి సంఘంలో కొరవడింది. కారణం విద్యావంతులలో కూడా సంస్కారం, వినయం కొరవడడమే. విద్యావంతుల కంటే విద్యావిహీనులే నయం అన్నభావన ఒక్కోసారి కలగకమానదు. ఇది చాలా దురదృష్టకరం. ధనానికి దాసోహమయ్యే పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కూడా మార్పు వచ్చి వివేకానికి, సంస్కారానికి విలువ పెరిగితేనే సమాజవికాసం 'మూడు పువ్వులు ఆరుకాయలు' అన్నట్టుగా వర్ధిల్లుతుంది. ఈ మార్పు రావాలంటే విద్యావ్యవస్థ మెరుగుపడాలి. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం వలన ప్రపంచమంతా వేగంగా పరుగెడుతున్నది. విదేశీ సంస్కృతి స్వదేశీ విలువలను ధ్వంసం చేస్తున్నది. ఇతర దేశాల సంస్కృతిలోని మంచిని గ్రహించి, మన దేశ సంస్కృతిని కాపాడుకోవాలి. మన చదువుల్లో విలువలకు ప్రాధాన్యత పెరగాలి. పాతకాలం నాటి నైతిక విలువలతో కూడిన విద్యతో ఆధునిక విద్యావ్యవస్థ సమ్మిళితమై వెలుగొందాలి. "విద్యాదదాతి వినయం వినయాద్వాతి పాత్రతాం' అన్నాడు భర్తృహరి. విద్య వలన వినయం, వినయం వలన పాత్రత సిద్ధిస్తుంది. అయితే నేటి విద్యావ్యవస్థ కేవలం ధనార్జనకు, ఉద్యోగ సంపాదనకే అధిక ప్రాధాన్యత నివ్వడం వలన వినయమనే విశిష్టమైన ఆభరణం సమాజమనే కిరీటంలో చేరలేక పోతున్నది. సంస్కారం స్థానంలో కృత్రిమమైన నటనా వైదుష్యంతో కూడిన కుసంస్కారం వ్రేళ్ళూనుతున్నది. మంచికి వంచన జరుగుతున్నది. నిజమైన సంస్కారానికి, వినయానికి చోటు మృగ్యమైపోతున్నది. స్వకార్యాలను చక్కబెట్టుకోవడానికే చదువు ఉత్ప్రేరకంగా ఉపయోగపడుతుంది కాని సమాజ సేవకు కొరగావడం లేదు. కొద్దో గొప్పో సమాజంపై అవగాహన ఉన్నవారు ఆదిలోనే హంసపాదులా నేటివ్యవస్థలో పేరుకుపోయిన అహంకార జాఢ్యమనే మనో వికారాలతో అణగద్రొక్క బడుతున్నారు. 'చిన్నినా పొట్టకు శ్రీరామరక్ష' అనుకుంటూ మనం బ్రతికితే సంఘం బ్రతికినట్టే, మనకెందుకులే అనే ధోరణి ప్రబలిపోయింది. సచ్చరిత్ర గల ఎవరూ సమాజంలో ఇమడలేక నలిగిపోతున్నారు. ఆత్మాభిమానం చంపుకోలేక, అవకాశవాదానికి తలొగ్గడం ఇష్టంలేక మౌనముద్ర వహిస్తున్నారు. అరాచకాలు, అత్యాచారాలు, అసాంఘిక కార్యకలాపాలు నేటి వ్యవస్థలో పెచ్చుమీరిపోతున్నాయి. ధనం, అధికారం, అహంకారం ముందు మంచితనం వీగిపోతున్నది. దిగజారిపోతున్న విలువలు అణగారిపోతున్న మానవ సంబంధాల నేపథ్యంలో 'త్వంశుంఠ..త్వశుంఠ" అనుకుంటూ వారినీ వీరినీ తిట్టుకోవడం పరిపాటిగా మారిపోయింది. యాంత్రికమైన చదువుల వల్ల విలువలు పడిపోతున్నాయి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేవలం ఉద్యోగాలు చేసే యంత్రాలుగా కరెన్సీ నోట్లకు ప్రతిరూపాలుగా చూడడం వలనే సమాజం అధోగతి పాలైపోతున్నది. ఒకరితో ఒకరికి సంబంధాలుండడం లేదు. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనన్న నానుడి నిక్కమై కూర్చున్నది. మితిమీరిన ధనాపేక్ష, యుక్తాయుక్త విచక్షణ మరచిన అహంకారతత్వం కలుపుగోలుతనాన్ని, సంఘటితంగా మెసలేతత్వాన్ని మంటగలపడం బాధాకరం. అష్టవంకరలతో అడ్డదిడ్డంగా మారినసామాజికవ్యవస్థను సరిచేసే బాధ్యత ఉపాధ్యాయుల భుజస్కంధాలపైఉంది. అందుకు తగిన మార్పులను ప్రభుత్వాలు నేటి విద్యావ్యవస్థలో తీసుకురావాలి. సంస్కారాన్ని, వినయాన్ని, వివేకాన్ని, సామాజిక స్పృహను కలిగించే రీతిలో పాఠ్యాంశాలలో మార్పులు రావాలి. 'ధనమే పరమావధి' అనే ధోరణి మారాలి. విలువల ఆధారంగా సమాజం నడవాలంటే విద్యావ్యవస్థపై తీవ్రమైన మేథోమథనం జరగాలి. దిగజారిపోతున్న విలువలను చదువులతో సంస్కరించాలి.

# అతి అన్ని విషయాల్లో అనర్థదాయకం!

ఐ.ప్రసాదరావు

కాశీబుగ్గలో జరిగిన దర్శన తోపులాటలో పలువురు ప్రాణాలు కోల్పోవడం మన అందరి హృదయాలను కలచివేసింది. ఇది ముమ్మాటికీ మానవ తప్పిదమే అని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మన దేశంలో ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం 'క్రమశిక్షణ' పాటించకపోవడం. బస్సు ఎక్కాలన్నా, రైలు ఎక్కాలన్నా, చివరికి విమానం ఎక్కే సమయంలో కూడా చివరికి చదువుకున్న వారు కూడా ఒకరిని ఒకరు తోసుకుంటూ విమానం ఎక్కుతున్న పరిస్థితి. ఇక ఇటీవల కాలంలో దేవాలయాల్లో దర్శనాలు సందర్భంగా, నదుల్లో పుణ్య స్నానాలు చేసే సమయంలో అనేక మంది అకాల మరణం చెందడానికి ప్రధాన కారణం క్రమశిక్షణ పాటించకపోవడం. ఆత్రుతతో తోపులాటలు జరగడం వల్ల అనేకమంది భక్తుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ముఖ్యంగా ప్రజలు, యువత, భక్తులు, ప్రయాణికులు ప్రతీ సందర్భంలోనూ ఓర్పు ,సహనం, క్రమశిక్షణ పాటిస్తేనే, ఇటువంటి అకాల మరణాలు నివారించగలం అని గ్రహించాలి. కొంతమేరకు విజ్ఞతతో వ్యవహరించాలి. మూఢ నమ్మకాలు, మూఢ విశ్వాసాల విసర్జించాలి. పూర్వ కాలంలోనూ, అంతగా చదువులేని కాలంలో ప్రజలు సంయమనంతో దర్శనాలు చేసుకునే వారు, సురక్షితంగా ఇంటికి చేరుకునే పరిస్థితి ఉండేది. నేడు అనేక మంది విద్యావంతులు, అనేక విషయాలపై అవగాహన ఉన్న వారు కూడా ప్రమాదాల్లో చిక్కుకోవడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది.. దీని అంతటికీ కారణం'అత్యుత్సాహం' మాత్రమే. ఇకప్రభుత్వాలు, వివిధ ఆధ్యాత్మికసంస్థలు, బాబాలు, స్వాములు ఇటీవల కాలంలో ప్రజల్లో మత పరమైన కార్యక్రమాలు ఎక్కువగా చొప్పించడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే 'భక్తిని పూర్తిగా వ్యాపారమయం చేయడం' జరుగుతుంది. దీనికితోడు సామాజిక మాధ్యమాల్లో, యూ ట్యూబ్‌లు, వివిధ ఛానెల్స్ మతపరమైన భావజాలం విచ్చలవిడిగా ప్రచారం చేస్తూ, ప్రజలను దైవ కార్యక్రమాల్లో మితిమీరి ముంచితేల్చడం జరుగుతుంది. ప్రభుత్వాలు సామాజిక మాధ్యమాలు ప్రజలను, యువతను సమాజంలో విజ్ఞానవంతులుగా, వివేకవంతులుగా, ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించే విధంగా, నైపుణ్యాలు నేర్చుకునే విధంగా, అప్పుల ఊబిలో కూరుకుపోకుండా స్వయం సమృద్ధి సాధించే విధంగా మన రాష్ట్రాన్ని, దేశాన్ని అతి త్వరలో" వికసిత భారత్'గా తీర్చిదిద్దే విధంగా దిశానిర్దేశం చేయాలిగాని, మితిమీరిన భక్తిలో మునిగి తేలేటట్లు చివరికి ప్రాణాలు కోల్పోయే విధంగా ప్రోత్సహించడం ఏమాత్రం శ్రేయోష్కరం కాదు. ఇక మనదేశంలో ప్రాచీన కాలం నుండి ప్రాచుర్యం పొందిన అనేక పురాతన దేవాలయాలు ఉన్నాయి. అయితే, ఇటీవల కాలంలో భూస్వాములు, సంపన్నులు, కార్పొరేట్ వర్గాలు, బాబాలు, స్వాములు, ధనికులు 'పేరు' కోసం, రకరకాల కొత్త దేవాలయాలు, ఆశ్రమాలు నిర్మిస్తూ ప్రజలను ఆకర్షించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే, 'ప్రైవేటు దేవాలయాలు, ఆశ్రమాలు' ఎక్కడబడితే అక్కడ నిర్మిస్తున్నారు. ప్రతీరోజూ, ప్రతీఘడియ రకరకాల పండుగలు, పర్వదినాలు అనేక పేర్లతో ప్రజలను మత భావోద్వేగానికి గురయ్యేటట్లు చేస్తున్నారు. ప్రజలు కూడా ఆ ప్రభావంలో పడిపోవడం శోచనీయం. ఇకనైనా ప్రజలు భగవంతుడు అన్ని చోట్లా ఉన్నాడు అని, మనసు మంచిదైతే అంతా మంచి జరుగుతుంది అని ఆలోచన చేయాలి. సెక్యులర్ భావంతో పనిచేయవలసిన ప్రభుత్వాలే మత క్రతువులు ప్రోత్సహించడం, కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా ప్రభుత్వాధినేతలే మత క్రతువుల్లో పాల్గొనడం వల్ల, ప్రజలు కూడా ఉద్వేగభరితంగా పాల్గొన్నడం జరుగుతుంది. దీంతో కొన్ని చోట్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. ప్రజలు ప్రభుత్వాల పనితీరును ప్రశ్నించకుండా ఉండటానికి కూడా ఈమత క్రతువులు ఉపయోగపడుతున్నాయి. 'అధిక ధరలు, ప్రైవేటీకరణ, నిరుద్యోగం' వంటి పలు సమస్యలు ప్రజలు ప్రభుత్వాలను నిలదీయకుండా ఉండటానికి మాత్రం ఈమత క్రతువులు ఉపయోగపడుతున్నాయి అనే విషయం వాస్తవమే.

# పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత

రామ కిష్టయ్య సంగన భట్ల

అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అనేది ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక లాభం కోసం సహజ వనరులను దోచుకోవడం, దుర్వినియోగం చేయడం. ఇది ప్రధానంగా అడవుల నరికివేత, ఖనిజ సంపదను పెద్ద స్థాయిలో తవ్వుకోవడం, నీటి వనరులను అతిగా వినియోగించడం వంటి రూపాలలో ఉంటుంది. ఈ దోపిడీవల్ల స్థానిక జీవజాలం, స్థానికజనాభా తీవ్రంగా ప్రభావితం అవుతుంది. తక్కువ అభివృద్ధి చెందిన దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు, తమ పర్యావరణం, వనరులను పరిరక్షించడానికి తగినవిధానాలను అనుసరించలేకపోతున్నాయి. ఇది ఆ దేశాల పర్యావరణాన్ని తీవ్ర స్థాయిలో నాశనం చేస్తోంది. ప్రపంచం మొత్తం పర్యావరణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, నీటి ప్రదూషణ, జీవవైవిధ్యం నష్టం వంటి అనేక సమస్యలు మన జీవన విధానాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న పర్యావరణ దోపిడీ. ఒక దేశం లేదా సంస్థ తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఇతర దేశాల సహజ వనరులను దోపిడీ చేయడం, తద్వారా స్థానికప్రజల జీవన విధానాలపై ప్రతికూల ప్రభావం చూపడం, పర్యావరణ దోపిడీకి ఉదాహరణలుగా చెప్పవచ్చు. ఈ సమస్యను అరికట్టేందుకు, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టదినాన్ని పాటిస్తారు. ఈ సందర్భంలో అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ అంటే ఏమిటి, దాని ప్రభావాలు, నివారణ చర్యలు, మన బాధ్యతలు వంటి అంశాలను పరిశీలించడం అవసరం. అడవుల నరికివేత, భారీ పరిశ్రమల నెలకొల్పటం, రసాయనాల వాడకం వంటివి అనేక జంతువుల, వృక్షజాలం నివాసాలను ధ్వంసం చేస్తాయి. వీటి వల్ల అనేక జీవజాతులు అంతరించిపోతాయి. జీవవైవిధ్యం కనుమరుగవడం వల్ల పర్యావరణ సమతుల్యతలో గణనీయమైన మార్పులు వస్తాయి. పరిశ్రమల నుంచి ఉద్గారాలు, వ్యవసాయ రసాయనాలు, ఇతర వ్యర్థ పదార్థాలు నదులు, సముద్రాలు, వాయు మండలాన్ని కలుషితం చేస్తాయి. ఇది పర్యావరణానికి మాత్రమేకాకుండా, మన ఆరోగ్యానికీ ప్రమాదకరం. దీనివలన వాయుకాలుష్యం, నీటి కాలుష్యం, భూసమర్థవంతత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వనరులను అతిగా వినియోగించడం, చెట్లను నరికివేయడం, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలను పెంచడం వలన వాతావరణంలో వేడి పెరుగుతోంది. దీని కారణంగా గ్లోబల్ వార్మింగ్ అనే సమస్య పెరిగి వాతావరణంలో అతివృష్టి, కరవు వంటి ప్రతికూల మార్పులు చోటు




చేసుకుంటున్నాయి. వాతావరణ మార్పు వల్ల వరదలు, కరువులు, అగ్ని ప్రమాదాలు వంటి సహజ వైపరీత్యాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఈ ప్రక్రియలతో పర్యావరణ నాశనం తక్షణమే కనిపించకపోయినా, దీర్ఘకాలం లో వీటి ప్రతికూల ప్రభావం పెద్దస్థాయిలో ఉంటుంది. కాలుష్యంవల్ల మన ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఏర్పడతాయి. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోశ వ్యాధులు, నీటికాలుష్యం వల్ల నీటి ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ప్రబలు తున్నాయి. శరీరంలో విష పదార్థాలు చేరటంవల్ల కేన్సర్, జన్యువ్యాధులు వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా ఉత్పన్నం అవుతున్నాయి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీని అరికట్టడానికి ప్రయత్నాలు జరిగాయి. పర్యావరణ పరిరక్షణ కోసం పలు అంతర్జాతీయ ఒప్పందాలు కుదిరాయి. టోక్యో ప్రోటోకాల్, పారిస్ ఒప్పందం వంటి ఒప్పందాల ద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు దేశాలు ఒక ప్రణాళికను అనుసరిస్తున్నాయి. ఈ ఒప్పందాలు పర్యావరణ పరిరక్షణకుదేశాల మధ్య సహకారాన్నిపెంపొందిస్తున్నాయి. ప్రతి దేశం పర్యావరణ పరిరక్షణ కోసం సొంత చట్టాలను రూపొంది స్తోంది. వనరులను అధికంగా వినియోగించే సంస్థలపై నియంత్రణ విధించేలా చట్టాలు అమలుచేస్తున్నాయి. కాలుష్యనియంత్రణ, వనరుల పరిరక్షణ, రక్షణాత్మక చర్యలు తీసుకునేలా ప్రభుత్వాలు చట్టాలను రూపొందిస్తున్నాయి పర్యావరణ పరిరక్షణపై ప్రజలలో అవగాహన పెంచేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలు జాగృతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. పర్యావరణ సమస్యలను ప్రజలకు వివరించడం, అవగాహన కల్పించడంవల్ల ప్రజలు తమ జీవనశైలినిసవరించుకోవడానికి ఆసక్తి చూపిస్తారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా సౌరశక్తి, పవనశక్తి వంటి పునరుత్పాదక ఇంధనాలను వినియోగించడాన్నిప్రోత్సహిస్తున్నారు. ఈ వనరులు పర్యావరణానికి హానికరమైన కర్బనఉద్గారాలను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రతి వ్యక్తి పర్యావరణ పరిరక్షణలో తనవంతు బాధ్యతను నిర్వర్తించాలి. వాహనాలను తక్కువగా వినియోగించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, నీటి వనరులను ఆదా చేయడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చు. పర్యావరణానికి మేలుచేసే మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం ద్వారా వాయుకాలుష్యం తగ్గించవచ్చు. పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తులను ఎంచుకోవడం, ప్లాస్టిక్ వంటి పదార్థాల వాడకాన్ని తగ్గించడం, మన పరిసరాల్లోని వారికి పర్యావరణ పరిరక్షణప్రాముఖ్యతను వివరించడం చేపట్టాలి. అంతర్జాతీయ పర్యావరణ దోపిడీ ఒక తీవ్రమైన సమస్యగా మనముందుంది. దీనిని అరికట్టడానికి ప్రభుత్వాలు, సంస్థలు, ప్రజలు కలిసి కృషి చేయాలి. పర్యావరణాన్ని కాపాడడంలో ప్రతి ఒక్కరి బాధ్యత అత్యంత కీలకం. మనం పర్యావరణా న్ని కాపాడుకుంటేనే భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన జీవనం అందించగలుగుతాం.

టివికె పార్టీ

# ఒంటరి పోటీ

## సిఎం అభ్యర్థిగా పార్టీ చీఫ్ విజయ్

## పార్టీ సమావేశంలో ఏకగ్రీవ నిర్ణయం



**చెన్నై, నవంబరు 5:** తమిళనాడు రాజకీయాల్లో గత కొన్ని వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ 2026 అసెంబ్లీ ఎన్నికల బరిలో ఒంటరిగానే దిగనున్నట్లు బుధవారం అధికారికంగా ప్రకటించింది. పార్టీ వ్యవస్థాపకుడైన విజయ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహాబలిపురంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విజయ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ప్రత్యేక జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,000 మందికి పైగా జనరల్ కౌన్సిల్ సభ్యులు, జిల్లా కార్యదర్శులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు. సెప్టెంబర్ 27న కరూర్ ర్యాలీలో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 41 మందికి నివాళిగా రెండు నిమిషాల మౌనం పాటించి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ విషాద ఘటన తమకు ఒక బాధాకరమైన గుణపాఠం అని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు తీసుకుంటామని పార్టీ పేర్కొంది. ఈ సమావేశంలో రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పార్టీ రాజకీయ, విధానపరమైన వైఖరిని స్పష్టం చేస్తూ మొత్తం 12 తీర్మానాలను ఆమోదించారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియ వల్ల అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని ఆరోపించారు. శ్రీలంక నౌకాదళం పదేపదే తమిళ మత్స్యకారులను అరెస్ట్ చేస్తున్నా, రాష్ట్రంలోని డీఎంకే ప్రభుత్వం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళుల ప్రయోజనాలను కాపాడడంలో పూర్తిగా విఫలమయ్యాయని టీవీకే విమర్శించింది. తమిళనాడులో శాంతిభద్రతలు దారుణంగా క్షీణించాయని ఆరోపిస్తూ, కోయంబత్తూరు కళాశాల విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి ఘటనను ఉదాహరణగా చూపింది. మహిళల భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడింది. ధాన్యం సేకరణలో జాప్యం కారణంగా డెల్టా రైతులు పడుతున్న ఇబ్బందులపై, పంట పొలాల్లోనే మొలకెత్తుతున్న ధాన్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. చిత్తడి నేలల ఆక్రమణలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించింది. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులు, ఉద్యోగ కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఎన్నికల పొత్తులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్నా ఆ అధికారం కేవలం విజయ్‌కు మాత్రమే ఉంటుందని, 2026 ఎన్నికల్లో తమ పార్టీ సొంత కూటమికి నాయకత్వం వహిస్తుందని తీర్మానాల్లో స్పష్టం చేశారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా వేదిక వద్ద ఏర్పాటు చేసిన పార్టీ బ్యానర్లు, జెండాలను పోలీసులు తొలగించారు.

# జెడియు సీనియర్‌నేత లలన్‌సింగ్‌పై కేసు నమోదు



**పాట్నా, నవంబరు 5:** బీహార్‌లో తొలిదశ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు కేంద్ర మంత్రి, జేడీయూ సీనియర్ నేత రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఎన్నికల ప్రచారంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. మొకామా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో లాలన్ సింగ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో ఒకటి వైరల్ అయింది. "పోలింగ్ రోజు కొందరు నాయకులను ఇళ్ల నుంచి బయటకు రాకుండా చూడాలి. ఒకవేళ వాళ్లు మరీ బతిమాలితే, మీతోపాటే తీసుకెళ్లి ఓటు వేయించి, తిరిగి ఇంటికి తీసుకొచ్చి పడుకోబెట్టండి. వాళ్లను ఇంట్లోనే ప్యాక్ చేయాలి. సమయం లేదు, ఇప్పుడే బాధ్యతలు తీసుకోండని ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై ప్రధాన ప్రతిపక్షమైన రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్జేడీ) తీవ్రంగా పరిగణించి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. లలన్ సింగ్ ఎన్నికల సంఘం చాతీపై బుల్డోజర్ నడుపుతున్నారు. నేతలను ఇంట్లో బంధించి, బ్రతిమాలితే ఓటుకు తీసుకెళ్లమని చెబుతున్నారు. ఈసీ ఎక్కడుంది అని ఆర్జేడీ తీవ్రంగా విమర్శించింది. ఆర్జేడీ ఫిర్యాదుతో స్పందించిన ఈసీ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో భారతీయ న్యాయ సంహిత, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని పలు సెక్షన్ల కింద పోలీసులు ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## సిఎం కుర్చీ కోసం నేతల 'మ్యూజికల్‌చైర్'!




**బెంగళూరు, నవంబరు 5:** కర్ణాటక ప్రభుత్వంలో 'నవంబర్ విప్లవం' చోటుచేసుకోనుందని, దీనికోసం ఇప్పటికే కౌంట్ డౌన్ ప్రారంభమైందని బీజేపీ వ్యంగ్యంగా ట్వీట్ చేసింది. ముఖ్యమంత్రి కుర్చీ కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు 'మ్యూజికల్ చెయిర్' ఆట ఆడుతున్నారని ఎద్దేవా చేసింది. ఈ నెలతో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏర్పాటులో తీవ్ర తాత్సారం చేసిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి పీఠం కోసం సీనియర్ నేతలు సిద్దరామయ్య, డీకే శివకుమార్ లు పట్టుబట్టడం వల్లే ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యమైందని అప్పట్లో ప్రచారం జరిగింది. దీంతో హైకమాండ్ మధ్యేమార్గంగా చెరో రెండున్నర సంవత్సరాలు సీఎం సీటును పంచుకోవాలంటూ ఇరువురు నేతలకు రాజీ కుదర్చినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. తాజాగా రెండున్నర సంవత్సరాలు పూర్తికావొస్తుండడంతో ఈ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి మార్పు జరగనుందని తాజాగా వార్తలు వెలువడుతున్నాయి. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి పదవిని డీకే శివకుమార్ కు అప్పగిస్తారని కర్ణాటకకు చెందిన కొంతమంది నేతలు అభిప్రాయపడుతున్నారు. అయితే, సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్దరామయ్య అంగీకరించడంలేదని, పూర్తికాలం తానే పదవిలో కొనసాగుతానని పేచీ పెడుతున్నారని సమాచారం. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో తప్పుకోవాల్సి వస్తే తాను సూచించిన వ్యక్తికే సీఎం కుర్చీ అప్పగించాలని హైకమాండ్ ఎదుట డిమాండ్ పెట్టినట్లు సమాచారం. ఈ వార్తలపై బీజేపీ వ్యంగ్యంగా స్పందించింది. కర్ణాటకలో ప్రభుత్వ పెద్దలు ప్రజల సమస్యలను పక్కన పెట్టి కుర్చీ కోసం కొట్లాడుతున్నారని తీవ్ర విమర్శలు చేసింది. ముఖ్యమంత్రి పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు మ్యూజికల్ చెయిర్ ఆట ఆడుతున్నారని ఆరోపించింది. ఏఐ సాయంతో ఓ వీడియో తయారు చేసి పార్టీ అధికారిక ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# రాత్రికి రాత్రే రూ.11 కోట్ల జాక్‌పాట్



**అమృత్‌సర్, నవంబరు 5:** రాత్రికిరాత్రే లాటరీతో ఒక చిరువ్యాపారి కరోడ్‌పతి అయ్యాడు. తోపుడు బండిపై కూరగాయలు అమ్ముకుని జీవనం సాగించే ఓ పేద వ్యాపారి తలరాతను లాటరీ టికెట్ మార్చేసింది. స్నేహితుడి దగ్గర అప్పు చేసి కొన్న టికెట్‌కు ఏకంగా రూ.11 కోట్ల జాక్‌పాట్ తగిలింది. పంజాబ్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లా కోట్‌పుట్లికి చెందిన అమిత్ సెహ్రా బతుకుదెరువు కోసం తోపుడు బండిపై కూరగాయలు అమ్ముతుంటాడు. ఇటీవల పంజాబ్ పర్యటనకు వెళ్లిన ఆయన, భటిండాలోని ఓ దుకాణంలో పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే "దీపావళి బంపర్ 2025" లాటరీ టికెట్‌ను చూశాడు. దానిని కొనడానికి తన వద్ద డబ్బు లేకపోవడంతో, తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకుని కొనుగోలు చేశాడు. అక్టోబర్ 31న లాటరీ డ్రా ఫలితాలు వెలువడగా అమిత్ కొన్న టికెట్‌కే మొదటి బహుమతి అయిన రూ.11 కోట్లు దక్కింది. ఈ విషయం తెలుసుకున్న అమిత్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన సంతోషాన్ని పంచుకుంటూ, "లాటరీ బహుమతి అందుకోవడానికి చండీగఢ్ వెళ్లేందుకు కూడా నా దగ్గర డబ్బుల్లేని పరిస్థితి. దేవుడే కరుణించి చప్పర్ ఫాడ్ కే (ఊహించని విధంగా భారీ బహుమతి) ఇచ్చాడు అంటూ భావోద్వేగానికి గురయ్యాడు.

లాటరీలో గెలిచిన ఈ డబ్బును తన ఇద్దరు పిల్లల చదువుల కోసం వినియోగిస్తానని అమిత్ తెలిపాడు. అంతేకాకుండా,

కష్టకాలంలో లాటరీ టికెట్ కొనడానికి డబ్బులిచ్చి ఆదుకున్న తన స్నేహితుడు ముఖేశ్‌కు రూ.1 కోటి ఇస్తానని ప్రకటించి తన గొప్ప మనసును చాటుకున్నాడు. అదృష్టం, స్నేహితుడి సాయం తన జీవితాన్నే మార్చేశాయని సంతోషం వ్యక్తం చేశాడు.

# న్యూయార్కు మేయర్‌గా తొలి ముస్లిం డెమొక్రాట్!

## స్థానిక ఎన్నికల్లో ట్రంప్‌కు ఎదురు దెబ్బ



**న్యూయార్కు, నవంబరు 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్థానిక ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీ పలు కీలక రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ట్రంప్ ఏడాది పాలనపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత ఈ ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. మరోవైపు, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థులు సంచలన విజయాలు నమోదు చేశారు. ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షించిన విజయం న్యూయార్క్ మేయర్ ఎన్నిక. ఇక్కడ భారత సంతతికి చెందిన ముస్లిం అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ (34) చారిత్రక విజయం సాధించారు. న్యూయార్క్ నగరానికి తొలి ముస్లిం మేయర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. అంతేకాకుండా, గడిచిన శతాబ్ద కాలంలో ఇంత పిన్న వయసులో మేయర్‌గా ఎన్నికైన వ్యక్తిగా కూడా ఆయన చరిత్రకెక్కారు. మమ్దానీ వచ్చే ఏడాది జనవరి ఒకటవ తేదీ నగర మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కాగా, న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం భారీగా నమోదైనట్లు నగర ఎన్నికల బోర్డు వెల్లడించింది. సుమారు 2 మిలియన్లకు పైగా నగరవాసులు తమ ఓటు హక్కును వినియెాగించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ ఫలితాలు రిపబ్లికన్ పార్టీకి, ట్రంప్ ప్రభుత్వానికి పెద్ద షాక్‌గా మారాయి. విజయం అనంతరం తన మద్దతుదారులను ఉద్దేశించి జొహ్రాన్ ప్రసంగించారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రక ప్రసంగం ట్రిస్ట్ విత్ డెస్టినీ లోని వాక్యాలను గుర్తుచేసుకున్నారు. "ఒక శకం ముగిసి, నవశకం వైపు అడుగు వేస్తున్నప్పుడు చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి. సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి గళం వినిపించిన సమయం ఇది" అని తన గెలుపును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా డొనాల్డ్ ట్రంప్‌ను నేరుగా హెచ్చరించడం చర్చనీయాంశమైంది. ట్రంప్, మీరు ఇదంతా చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నా దగ్గర నాలుగు మాటలున్నాయి. మీరు మాలో ఎవరినైనా చేరుకోవాలంటే, మా అందరినీ దాటి రావాలని సవాల్ విసిరారు.

సోషలిస్టు భావజాలం కలిగిన జొహ్రాన్, ఉగాండా జాతీయుడైన మహమూద్ మమ్దానీ, ప్రఖ్యాత భారతీయ సినీ దర్శకురాలు మీరా నాయర్‌ల కుమారుడు. తన ప్రసంగంలో తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుతూ, "నన్ను తీర్చిదిద్దింది మీరే. మీ కుమారుడినైనందుకు గర్వంగా ఉందని అన్నారు.

## వర్జీనియా గవర్నర్‌గా తెలంగాణ మూలాలున్న డెమొక్రాట్



**వర్జీనియా, నవంబరు 5:** అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన, అందులోనూ హైదరాబాద్ మూలాలున్న మరో మహిళ సత్తా చాటారు. డెమొక్రాట్ పార్టీకి చెందిన గజాలా హష్మి వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. హోరాహోరీగా సాగిన పోరులో ఆమె రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై గెలుపొందారు. ఈ విజయంతో గజాలా గతంలో ప్రాతినిధ్యం వహించిన 15వ సెనెటోరియల్ డిస్ట్రిక్ట్ స్థానానికి ఇప్పుడు ప్రత్యేక ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. 2019లో రాజకీయాల్లోకి ప్రవేశించిన గజాలా హష్మి, అనూహ్య రీతిలో రిపబ్లికన్ల అధీనంలో ఉన్న స్టేట్ సెనెట్ సీటును గెలుచుకుని సంచలనం సృష్టించారు. వర్జీనియా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. ఐదేళ్ల తర్వాత, 2024లో ఆమె సెనేట్ ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ కమిటీకి ఛైర్‌గా నియమితులయ్యారు. ఇప్పుడు లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికై మరో ఉన్నత స్థాయికి చేరుకున్నారు. గజాలా హష్మి 1964లో హైదరాబాద్‌లోని మలక్‌పేటలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు జియా హష్మి, తన్వీర్ హష్మి. తన నాలుగో ఏట తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని జార్జియాకు ఆమె వలస వెళ్లారు. ఆమె తండ్రి ప్రొఫెసర్ జియా హష్మి అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి కాగా, తల్లి తన్వీర్ హష్మి కోఠిలోని ఉస్మానియా యూనివర్సిటీ మహిళా కళాశాలలో చదువుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు గజాలా సుమారు 30 ఏళ్ల పాటు ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఎమోరీ యూనివర్సిటీ నుంచి అమెరికన్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పట్టా పొందారు.

# ఢిల్లీలో కాలుష్యనివారణకు సాయం చేస్తాం!

## భారత్‌లో చైనా ఎంబసి ప్రతినిధి వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబరు 5:** ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయిన నేపథ్యంలో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని చైనా ప్రకటించింది. ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాలు తీవ్రమైన వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాల ప్రకారం చాలా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచి 400 మార్కును దాటింది. గాలి నాణ్యతను మెరుగుపరచడంలో చైనా గణనీయమైన విజయాలు సాధించిందని, ఈ విషయంలో భారత్‌కు సహకరించడానికి తాము సిద్ధంగా ఉన్నామని భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ సోషల్‌మీడియాలో తెలిపారు. ఒకప్పుడు తమ దేశం కూడా తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడిందని, అలాంటి సమస్యలను ఎదుర్కొంటున్న వారితో తమ అనుభవాలను పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని యూజింగ్ పేర్కొన్నారు. భారత్ త్వరలోనే ఈ పరిస్థితి నుంచి బయటపడుతుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. గతంలో పొగమంచుతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న చైనా, గాలి నాణ్యతను మెరుగుపరుచుకోవడంలో అద్భుతమైన ఫలితాలు సాధించింది. ఒకప్పుడు బీజింగ్‌తో పాటు పలు చైనా నగరాలు, పారిశ్రామిక కేంద్రాల్లో కాలుష్యం తీవ్రంగా ఉండేది. దీనిని గుర్తించినా చైనా ప్రభుత్వం కఠినమైన నియంత్రణ చర్యలు చేపట్టింది. గాలి నాణ్యత ప్రమాణాలను నిర్దేశించి వాటిని తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినమైన జరిమానాలు విధించడంతో పాటు శిక్షలు కూడా అమలు చేసింది. ఫలితంగా గాలి నాణ్యత గణనీయంగా మెరుగుపడింది. కాలుష్యాన్ని తగ్గించే క్రమంలో చైనా వేగంగా పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లింది. విద్యుత్ వాహనాలు, పవన, సౌర విద్యుత్ ఉత్పత్తిపై భారీగా పెట్టుబడులు పెట్టింది. వాయు కాలుష్యం తీవ్రంగా ఉన్న సమయాల్లో కాలుష్య కారక కర్మాగారాలను తాత్కాలికంగా మూసివేయడంతో పాటు కొన్ని కర్మాగారాలను పట్టణాలు, నగరాలకు దూరంగా తరలించింది. ఈ చర్యల ద్వారా పట్టణ ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగుపడింది. ఢిల్లీతో సహా భారత్‌లోని నగరాల్లో కూడా చైనా తరహా కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

# మంచుదుప్పటి కప్పకున్న గుల్మార్గ్

## భూతల స్వర్గంగా హిమాలయ ప్రాంతం



**శ్రీనగర్, నవంబరు 5:** భూతల స్వర్గం జమ్ము కశ్మీర్ లో గత రెండు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాలు కనుచూపు మేర శ్వేతవర్ణాన్ని సంతరించు కున్నాయి. కశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం గుల్మార్గ్ పూర్తిగా మంచుతో కప్పుకు పోయింది. నిరంతరం మంచు వర్షం కురుస్తోంది. దీంతో రోడ్లు, ఇళ్లను మంచు కప్పేసింది. స్కీయింగ్ సిటీ ఎటు చూసినా శ్వేత వర్ణం సంతరించుకుని పర్యాటకులను ఆహ్వానిస్తోంది. స్థానికులు, పర్యాటకులు శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. గుల్మార్గ్‌తోపాటూ ప్రముఖ పర్యాటక ప్రాంతాలు సోనామార్గ్, జోజిలా, గగాంగిర్, కుప్వారాలో కూడా మంచు పడుతోంది. శ్రీనగర్ వాతావరణ కేంద్రం ప్రకారం.. గడిచిన 24 గంటల్లో గుల్మార్గ్‌లో 7.6 సెంటీమీటర్ల మేర మంచు పడింది. దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో కూడా గత 24 గంటల్లో 2.1 సెంటీమీటర్ల మంచు, 16.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సమ్మర్ క్యాపిటల్ శ్రీనగర్‌లో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం, మంచు కారణంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

# రాజకీయాల్లోకి ఆర్మీని లాగొద్దు

## - సైన్యానికి కుల, మతాలు లేవు : రాహుల్ వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ ఫైర్

**జముయి(బీహార్), నవంబరు 5:** సైన్యానికి కుల, మతాలుండవు, ఆర్మీని రాజకీయాల్లోకి లాగొద్దని రాహుల్‌గాంధీకి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హితవు పలికారు. దేశం సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా, సైనికులు ధైర్యం, శౌర్యం ప్రదర్శించి భారత్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. భారత సైన్యం అగ్రవర్ణాల గుప్పిట్లో ఉందని రాహుల్ వ్యాఖ్యలను రక్షణమంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. బీహార్‌లోని జముయిలో నిర్వహించిన ఎన్నికల సభలో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... సాయుధ దళాల్లో రిజర్వేషన్లు డిమాండ్ చేయడం ద్వారా దేశంలో అరాచకత్వాన్ని సృష్టించడానికి రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. పహల్గాంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడికి పాల్పడితే ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ప్రధాన ఉగ్రవాద స్థావరాలను తుదముట్టించామన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కాస్త విరామం ఇచ్చామన్నారు. భారత్ వైపు కన్నెత్తి చూస్తే, వారి అంతుచూస్తామని పాక్‌కు పరోక్షంగా హెచ్చరికలు చేశారు.

## జకీర్‌నాయక్‌కు బంగ్లాదేశ్‌లో అనుమతి నిరాకరణ



**ఢాకా, నవంబరు 5:** భారత్‌కు మోస్ట్ వాంటెడ్, వివాదాస్పద ఇస్లాం మత ప్రచారకుడు జకీర్ నాయక్‌కు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. ఆయన దేశంలోకి ప్రవేశించేందుకు అనుమతి నిరాకరించింది. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 20 వరకు జకీర్ నాయక్ బంగ్లాదేశ్‌లో పర్యటించనున్నారని అక్టోబర్ చివరిలో వార్తలు వచ్చాయి. అయితే, కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఈ పర్యటనను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. 2016లో బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని హోలీ ఆర్టిజన్ కేఫ్‌పై జరిగిన ఉగ్రదాడిలో 29 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులు జకీర్ నాయక్ ప్రసంగాల ద్వారానే ప్రేరణ పొందారని దర్యాప్తులో తేలింది. దీంతో అప్పటి షేక్ హసీనా ప్రభుత్వం ఆయనకు చెందిన పీస్ టీవీ ఛానల్‌ను నిషేధించడంతో పాటు, జకీర్ నాయక్ బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టకుండా నిషేధం విధించింది. ఇప్పుడు తాత్కాలిక ప్రభుత్వం కూడా పాత నిషేధాన్ని కొనసాగిస్తూ ఆయన పర్యటనకు అనుమతి నిరాకరించడం చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో రెచ్చగొట్టే ప్రసంగాలు, ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, మనీ లాండరింగ్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న జకీర్ నాయక్ 2016లో దేశం విడిచి పారిపోయాడు. అప్పటి నుంచి ఆయన మలేషియాలో ఆశ్రయం పొందుతున్నాడు. ఆయనపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయాలని భారత్ ఇంటర్‌పోల్‌ను ఆశ్రయించినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ ఆ అభ్యర్థన తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే.

# సంక్షిప్తంగా..

## ఆధ్యాత్మికవేత్త రవిశంకర్‌కు 'వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డు!



**బోస్టన్, నవంబర్ 5:** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ '2025 వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డును అందుకున్నారు. బోస్టన్ గ్లోబల్ ఫోరం, ఎఐ వరల్డ్ సొసైటీ ఆధ్వర్యంలో అమెరికాలోని బోస్టన్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. భారత్‌తో పాటు ప్రపంచంలో శాంతి, పరిరక్షణ, నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికి గాను ఈ పురస్కారంతో గౌరవించారు. వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ అవార్డు పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2025 సంవత్సరానికిగాను గురుదేవ్‌ను ఎంపిక చేశారు. ఈ అవార్డును ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచ శాంతికి సంబంధించి నైతిక, వ్యూహాత్మక మూలాలను బలోపేతం చేసిన అసాధారణ వ్యక్తులను సన్మానిస్తున్నారు.

## నడిరోడ్డుపై దేశాధ్యక్షురాలికి లైంగిక వేధింపులు!



**మెక్సికో, నవంబర్ 5:** మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. ఏకంగా దేశాధ్యక్షురాలే నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. మెక్సికో దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మంగళవారం ఓ బహిరంగ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ ఆమె ప్రజలతో మాట్లాడుతుండగా వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి అధ్యక్షురాలిపై చేయి వేస్తూ ఆమెను ముద్దుపెట్టుకోబోయాడు. వెంటనే అధ్యక్షురాలి భద్రతా సిబ్బంది అతడిని పక్కకు నెట్టారు. అయినప్పటికీ అతడు క్లాడియాను అయినప్పటికీ అతడు క్లాడియాను అసభ్యంగా తాకుతుండటంతో ఆమె ఇబ్బంది పడుతూ అతడి చేతిని పక్కకు నెట్టిన దృశ్యాలు వీడియోలో కనిపిస్తున్నాయి. దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశాధ్యక్షు రాలికే భద్రత లేకపోతే సాధారణ మహిళల పరిస్థితేంటంటున్నారు.

## టేకాఫ్ సమయంలోనే కుప్పకూలిన రవాణా విమానం

**లూయిస్ విల్లే, నవంబరు 5:** అమెరికాలో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. లూయిస్‌విల్లే నగరంలో టేకాఫ్ తీసుకుంటున్న సమయంలో ఓ కార్గో విమానం కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఎఎ) అధికారికంగా ధ్రువీకరించింది. యూపీఎస్‌కు చెందిన ఫ్లైట్ నంబర్ 2976 కార్గో విమానం లూయిస్‌విల్లే నుంచి హోనులులుకు బయలుదేరింది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:15 గంటలకు టేకాఫ్ అవుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గాల్లోకి ఎగురుతున్న సమయంలో విమానంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి, అదుపుతప్పి కిందకు పడిపోయింది. మెక్‌డోనెల్ డగ్లస్ ఎండీ11 రకానికి చెందిన ఈ విమానం పూర్తిగా దగ్ధమైంది.

## ఉపాధిలేక నిట్టూరిస్తున్న పాక్ యువత!




**ఇస్లామాబాద్, నవంబరు 5:** పొరుగు దేశం పాకిస్థాన్‌లో నిరుద్యోగం తాండవిస్తోంది. దేశంలోని మూడింట ఒక వంతు యువత 15–35 ఏళ్ల మధ్యవయసు వారు ఎలాంటి ఉపాధి లేకుండా ఉన్నట్లు తాజా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. దేశంలో తొలిసారిగా నిర్వహించిన డిజిటల్ జనాభా లెక్కల ప్రకారం, నిరుద్యోగ రేటు 7.8 శాతంగా నమోదైంది.

అంటే, మొత్తం 24.15 కోట్ల జనాభాలో దాదాపు 1.87 కోట్ల మందికి పని లేదని అర్థం. ఈ సంక్షోభం కనిపించే దానికంటే చాలా లోతుగా ఉంది. చదువు, ఉద్యోగం లేదా శిక్షణ వంటివి ఏవీ లేకుండా ఖాళీగా ఉన్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. వీరికి తోడు, మహిళల్లో ఉద్యోగ భాగస్వామ్యం ఈ ప్రాంతంలోనే అత్యంత తక్కువగా ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తోంది. దేశ ఆర్థిక వ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో అక్కడి విద్యావ్యవస్థ విఫలమవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# పంట నష్టపరిహారాన్ని పెంచాలి

## తేమ, రంగుతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బిజెఎల్పీ నేతల ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



బుధవారం బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వరరెడ్డి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** మొంథా తుపాను వల్ల జరిగిన పంటనష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పరిహారం మొత్తాన్ని పెంచాలని, తడిసిన ధాన్యం, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలను తేమశాతంతో సంబంధం లేకుండా, రుంగుమారినప్పటికీ సంబంధిత సంస్థలు కొనుగోలు చేయాలని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాని డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను ఏలేటి మహేశ్వర్ రెడ్డి విడుదల చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాల్వాయి హారీష్, కిసాన్ మోర్చ రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం లక్ష్మీ నర్సయ్యతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనలో తెలంగాణ రాష్ట్రం చేరేలా చర్యలు తీసుకోవడం లేదంటే రాష్ట్ర ప్రభుత్వమే పటిష్టమైన పంటలబీమా పథకాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మన తెలంగాణ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన మొంథా తుపాను వల్ల జరిగిన పంట నష్టాన్ని రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లాకు వెళ్లి అధికారులతో కలిసి పరిశీలించి, పరిస్థితులను సమీక్షించారని, మొంథా తుపానువల్ల జరిగిన పంట నష్టానికి పరిహారంగా ఎకరానికి రూ.10వేలు ఇస్తామని ప్రకటించడం రైతాంగాన్ని తీవ్రంగా నిరాశ పరిచిందన్నారు. ఇది కొండంత నష్టానికి గోరంత సాయం మాత్రమే అని రైతు సంఘాలంటున్నాయి. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండగా, కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నపుడు టిపిసిసి అధ్యక్షుడిగా మీరు ఇలాగే ప్రకృతి వైపరీత్యాలకు జరిగిన పంట నష్టానికి పరిహారంగా ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. మరి ఇపుడు మీరే ముఖ్యమంత్రి అయ్యాక గతంలో మీరు డిమాండ్ చేసిన మేరకైనా ఎకరానికి రూ.20వేల చొప్పున పంట నష్టపరిహారం ప్రకటించక పోవడం అన్యాయం అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రూ.20వేల పరిహారం కూడా ఏ మాత్రం సరిపోదు. వరి పంట ఎకరానికి పెట్టుబడి వ్యయం రూ.30వేల వరకు అవుతుందని రైతులంటున్నారు. అందుకే ఎకరానికి రూ.30వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వడమనేది న్యాయం. అందుకే వరితోపాటు ఇతర పంటలకు కూడా ఎకరానికి నష్టపరిహారం రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో వివిధ కారణాలతో పంట నష్టపోతే తక్షణం నష్టపరిహారం అందేలా పటిష్టమైన పంటల బీమా పథకం తెస్తామని రైతులకు హామీ ఇచ్చారు. మరి మీరు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 23నెలలవుతున్నా ఇప్పటికీ పంటలబీమా పథకాన్ని రూపొందించకపోవడం అన్నదాతలను మోసం చేయడం కాదా అన్నారు. గత ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలకు కూడా సుమారు రెండున్నర లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. అంతకు ముందు ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలకు సుమారు 55 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. అప్పటి ఆర్థిక సహాయం ఇప్పటి వరకు అందలేదన్నారు. మొంథా తుపాను వల్ల రాష్ట్రంలో ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని, రెండు లక్షల 80 వేల మంది రైతులకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ ప్రాథమిక సమాచారం. పది లక్షలకు పైగా ఎకరాల్లో పంటలకు నష్టంవాటిల్లిందని రైతు సంఘాలంటున్నాయి. తేమశాతం సమస్య వరితోపాటు పత్తి,మొక్కజొన్న పంటల విక్ర యానికి అడ్డంకిగా మారింది. అందుకే ప్రభుత్వం ఈ తేమ శాతం విషయంలో ప్రస్తుత నిబంధనలను సడలించాలన్న రైతులడిమాండును పరిగణలోకి తీసుకోవాలని సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.



బుధవారం వెంకటగిరి ప్రాంతంలో ప్రచారంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## విజయం మనదే:కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), నవంబరు 5, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళుతూ బీజేపీ చేపట్టిన, చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. కిషన్‌రెడ్డికి చాలా చోట్ల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి హారుతులిచ్చి మరీ ఆహ్వానించారు. బీజేపీకి ఓటు ఎందుకు వేయాలో ఆయన ఓటర్లకు వివరించారు. వెంకటగిరి, హైలం కాలనీ తదితర ప్రాంతాల్లో సాగిన ఈ పాదయాత్రకు విశేష స్పందన లభించింది. మరోవైపు ఏపీ బీజేపీ ఛీఫ్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ సైతం నియోజకవర్గంలో ఇంటింటికి తిరుగుతూ బీజేపీ కరపత్రాలను పంచారు. ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరిని కలిసి ఓటు అభ్యర్థించారు. కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ దేశాభివృద్ధి జరగాలంటే బీజేపికి ఓటు వేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న విషయాన్ని వారు వివరించారు. కార్యక్రమంలో ఏపీ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, ఎన్టీఆర్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.



బుధవారం విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## కమిటీ పేరుతో కాలయాపన

### అఖిలపక్షం ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 5 ప్రభాతవార్త:** ఫీజుల రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో వేలాది కళాశాలలు మూతపడ్డాయని, లక్షలాది మంది విద్యార్థులు రోడ్డున పడ్డా ప్రభుత్వం సిగ్గులేకుండా, ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రపన్నుతున్నదని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ధ్వజమెత్తారు. తప్పు చేసిన వారిని శిక్షించాలని, కాని కమిటీల పేరుతో కాలయాపన చేసి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయరాదని ఆయన హెచ్చరించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫీజుల రియింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని గత 3రోజులుగా నిరవధి కంగా సమ్మె చేస్తున్న కళాశాలల సమ్మెకు ఆయన మద్దతు ప్రకటిస్తూనే సమస్య పరిష్కారించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని, తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల కళాశాలలు నిరవధికంగా మూసివేసి సమ్మె చేస్తుంటే ప్రభుత్వానికి చీమకుట్టి నట్లుగా కూడా లేదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న దని, కేవలం 6వేల కోట్లు ఫీజులు చెల్లించడానికి మనసు ఒప్పుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పన్నులు,ఇతర ఆదాయాల రూపంలో 5లక్షల కోట్లు వచ్చాయని, కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తున్నదని, కాని విద్యార్థుల భవిష్య త్తుకు ఫీజుల రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు, విద్యార్థినాయకులు సి.రాజేందర్, మణికంఠ, రాజ్‌కుమార్, అనంతయ్య, వీరవల్లి లింగయ్య, నిఖిల్‌పటేల్, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలు సంతోషంగా ఉంటే బిఆర్ఎస్ ఓర్వడం లేదు

### టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** పేద ప్రజల ఇండ్లలోకి నీళ్ళు రాకుండా సంతోషంగా ఉంటే బిఆర్ఎస్ ఓర్వలేకపోతుందని టిపిసిసి మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.గుళ్లను, మసీదులను కూలగొట్టిన కెటిఆర్‌ను నిలదీయా లన్నారు. పదేండ్లలో జూబ్లీహిల్స్ కోసం బిఆర్ఎస్ చేసింది ఏమిటని ప్రశ్నించారు. బిఆర్ఎస్ చేసిందేమీ లేకనే కెటిఆర్ బుల్డోజర్ అంటూ కొత్త నాటకం ఆడుతున్నారన్నారు. కాళేశ్వరంప్రాజెక్టును కూలగొట్టిన బుల్డోజర్ ఎవరిది కెటిఆర్ సమాధానం చెప్పాలన్నారు. ముస్లింలపై మొసలి కన్నీరు కారుస్తున్న కెటిఆర్ వారి హయాంలో సచివాలయంలో మసీదు ఎందుకు కూలగొట్టారో చెప్పాలన్నారు. 400 ఏండ్ల చరిత్ర కలిగి కుతుబ్ షాహీ మసీదును , సచివాలయంలో నల్ల పోచమ్మ గుడిని కూలగొట్టిన బుల్డోజర్ ఓనర్ కెటిఆర్ అన్నారు.కెసిఆర్‌హయాంలో అడ్డగోలుకబ్జాలతో హైదరాబాద్ నగరం మునిగిపోయే ప్రమాదాన్ని ఎదుర్కొంది. హైడ్రాతో కబ్జాలనీ అడ్డుకోవడం వల్లే హైదరాబాద్లో వరదలు తగ్గాయని అన్నారు.

## తమ డిమాండ్లను పరిష్కరించే వరకు బంద్ కొనసాగిస్తాం

### ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య చీఫ్ రమేష్

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య చీఫ్ రమేష్ ప్రభుత్వాన్ని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేందుకు బంద్ కొనసాగిస్తామని,గత నాలుగు రోజులుగా బంద్ చేస్తున్నామని చెప్పారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇక కళాశాలల బంద్ తప్ప, వేరే మార్గమే లేవన్నాడు. గత నాలుగు రోజుల నుంచి అన్ని కాలేజీలు బంద్ పాటిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న రూ.10 వేల కోట్ల బకాయిల్లో 50శాతం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఫీజు రీయింబర్సమెంట్ బకాయిలపై పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కళాశాలల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వ సమస్యలు కావా? అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం ఇంతవరకు స్పందించడం లేదని, అధ్యాపకులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ నెల 8న ఎల్‌బి స్టేడియంలో కళాశాలల సాంత్వన సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అధ్యాపకులు వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ట్రస్ట్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచన చేశామన్నారు. ట్రస్ట్ బ్యాంక్ ఏర్పాటుకు ప్రభుత్వం ఒప్పుకుందని, కానీ మూడునెలలు కాకుండా ఒక నెలలోపు నివేదిక పూర్తి చేయాలని, విజిలెన్స్ విచారణ ఉపసంహరించు కోవాలన్నారు. మా డిమాండ్లు నెరవేరేవరకు నిరవధిక బంద్ కొనసాగుతుం దన్నారు. 11 తేదిన గానీ, 12వ తేదిన గానీ పది లక్షల మంది విద్యార్థులతో సభ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం నుండి చర్చలకు పిలిచినప్పటికీ బకాయిలపై క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. విద్యాశాఖ కార్యదర్శి దేవసేన మమల్ని ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కళాశాలల పట్ల బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. కళాశాలల పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కాలేజీలను యూజ్ లెస్ కాలేజీలు అని కామెంట్ చేసిందన్నారు. ప్రభుత్వం వేసిన కమిటీలో అనర్హత కలిగిన వ్యక్తులను తొలగించాలని, గవర్నర్ బ్యాంకింగ్ నిష్ణాతులను వేయాలని, నాలెడ్జ్ లేని వ్యక్తులను వేశారని వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరంపై కాంగ్రెస్ హడావుడి తప్ప ఏమీలేదు

### బిజెపి ఎంపి రఘునందన్‌రావు




బుధవారం బిజెపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బిజెపి ఎంపి రఘునందన్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** దొంగనే దొంగ,దొంగ అని అరిచినట్లుగా, కాళేశ్వరం కేసులో కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న హడావుడి చూస్తుంటే అలానే అనిపిస్తుందని కాంగ్రెస్ ఎంపి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకల కేసులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, రెండు నెలలలోపే విచారణ చేసి, కాజేసిన లక్ష కోట్ల సొమ్మును కక్కిస్తాం అని ప్రగల్భాలు పలికింద న్నారు. కానీ అధికారంలోకి వచ్చిన 23 నెలల తర్వాత, బిజెపి ఎందుకు బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేయడం లేదు? సిఎం రేవంత్‌రెడ్డి అడగడం విడ్డూరంగా ఉందన్నారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కూడా... గతంలో గానీ, భవిష్యత్తులో గానీ ఏ వ్యవస్థల్నీ తన సొంత ప్రయోజనాల కోసం వాడుకోలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు, సిబిఐని తన కక్షపూరిత రాజకీయాల కోసం వాడుకున్న సంగతి దేశానికి తెలిసిందే అన్నారు. అప్పట్లోనే ప్రతిపక్ష నేతలంతా సిబిఐని కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అని పిలిచారని, అది రేవంత్ రెడ్డి మర్చిపోయినట్టు కనిపిస్తుందన్నారు. బిజెపి న్యాయవ్యవస్థకు సంపూర్ణ గౌరవం ఇస్తుందని, ఆ సంస్థలు స్వతంత్రంగా పనిచేసేలా పూర్తి స్వేచ్ఛను కల్పిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిఓ 104 ఇచ్చినప్పుడు దాంట్లో ఏమని పేర్కొంది? కాంగ్రెస్ ప్రభుత్వం, అక్టోబర్ 23, 2023న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికను ఆధారంగా, అక్టోబర్ 24న మూడు బ్యారేజీలపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ నివేదిక ఆధారంగా, మీరు పిసి ఘోష్ అనే కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారు? ఆ నివేదిక వచ్చిన సమయానికి, అంటే అక్టోబర్ 23, 2023, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోనే ఉంది. ఆ నివేదిక ఆధారంగా, కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 2023 తర్వాత రెండు-మూడు నెలల్లోనే, కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి కెసిఆర్, హరీష్ రావు, కెటిఆర్ వంటి వ్యక్తులను ఎందుకు అరెస్ట్ చేయలేకపోయారు?రెండు సంవత్సరాలు గడిచి పోయాయి. టైమ్ పాస్ చేస్తూ, కమిషన్ గడువును మూడు నెలలు, ఆరు నెలలు పెంచుతూ కాలయాపన చేస్తూ వచ్చారన్నారు. అక్టోబర్ 25న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం పెట్టి, సబిఐకి విచారణ అప్పగిస్తున్నామంటూ తీర్మానం చేశారు. దీని వెనుక ఆంతర్యమేంటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. ఈ 20 నెలల కాలంలో బిఆర్ఎస్ నాయకులు, ఢిల్లీలోని రాహుల్ గాంధీ, ఏఐసిసి నాయకత్వం మధ్య ఏదో ఒప్పందం కుదిరింది. కెసిఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను అరెస్ట్ చేస్తే కాంగ్రెస్ పార్టీకి బద్నాం వస్తుందని భావించి, ఇది కేంద్ర పరిధిలోకి వస్తుంది, కాబట్టి సిబిఐకి అప్పగిస్తే కాంగ్రెస్ పార్టీ తప్పించుకో వచ్చన్న సూచన మేరకే ఈ తీర్మానం చేసినట్లు అనిపిస్తుందన్నారు. టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో మూడు నెలలుగా రోజుకో సీరియల్ నడిపి ప్రభా కర్ రావును ఇవాళ అరెస్ట్ చేస్తాం, రేపు తీసుకు వచ్చి విచారిస్తాం, ఎల్లుండి కెసిఆర్‌ను సైతం అరెస్ట్ చేస్తాం అంటూ చేసిన ప్రకటనలు ప్రగల్భాలేనా? అంటూ ప్రశ్నించారు.

## ఓట్లను మతం ఆధారంగా విభజించే యత్నం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సంతుష్టీకరణ రాజకీయాలకు నిండైన ఉదాహరణ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఈమేరకు బుధవారం మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ విభజనాత్మక, తుష్టీకరణ రాజకీయాల అసలు ముఖాన్ని బట్టబయలు చేస్తున్నాయని అన్నారు. ముస్లింలు ఉన్నారా అంటే అది కాంగ్రెస్ వల్లే, ముస్లింలకు గౌరవం ఉందా అంటే అది కాంగ్రెస్ వల్లే, కాంగ్రెస్ లేకుంటే ముస్లింలకు దిక్కులేదు అనే వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ మతాధారిత ఓటు బ్యాంక్ రాజకీయాలు మాత్రమే నమ్ముతుందని మరోసారి స్పష్టమైందన్నారు. అభివృద్ధి, పాలన, ప్రజాసేవపై చర్చ చేయడానికి బదులుగా, సమాజాన్ని మతం పేరుతో విభజించి రాజకీయ లాభం పొందే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజనాత్మక, సంతుష్టీకరణ రాజకీయాల అసలు ముఖాన్ని మరోసారి బట్టబయలు చేస్తున్నాయన్నారు. అంతేకాకుండా సామాజిక విభేదాలను రాజకీయ లాభం కోసం రెచ్చగొట్టే ప్రమాదకర ప్రయత్నం అని స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. కేవలం 20శాతం ముస్లింల ఓట్ల కోసం, 80 శాతం హిందువుల భావాలను నిర్లక్ష్యం చేయడం, దీనిని సెక్యులరిజం అని చెప్పడం ఇది ప్రజలను మోసం చేయడమే అన్నారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తే, పాలనతో, పనితీరుతో కాదు సమాజాన్ని మతం ఆధారంగా విభజించి అధికారాన్ని కాపాడుకోవ డమే కాంగ్రెస్ లక్ష్యం అని స్పష్టమవుతుం దన్నారు. కాంగ్రెస్ మాత్రం వారిని కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసింది.సమాజాన్ని ఐకమత్యంతో ముందుకు తీసుకెళ్లాల్సిన సమ యంలో, విభజించి రాజకీయ లాభం పొందే ధోరణి కాంగ్రెస్‌కి సర్వసాధారణమైందన్నారు. తెలంగాణలో 80శాతం హిందూ జనాభా మీ వ్యాఖ్యలను గమనిస్తుందని, జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలలో ప్రజలు ఈ అహంకారానికి, సంతు ష్టీకరణ రాజకీయాలకు తగిన బుద్ధి చెబుతారన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిజెపిదే విజయం అన్నారు. కాళేశ్వరం కేసును యేడాదిన్నర పాటు సాగదీసి కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా వ్యవహరించిన రేవంత్ సర్కారు అసలు ఉద్దేశ్యం ఏమిటి?అధికారంలోకి రాకముందు అన్ని అవినీతి ఆధారాలు నా దగ్గర ఉన్నాయి, కెసిఆర్ జైలుకెళ్తాడు అని పెద్ద గోల చేసిన రేవంత్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాత్రం చేతులు దులుపుకుని, కేవలం రెండు బ్యారేజీలపైనే సిబిఐ విచారణ జరపాలనడం వెనుక ఉన్న రహస్యం ప్రజలు బాగా అర్థం చేసుకుంటున్నారు. ఇది బిఆర్ఎస్ అవినీతి నాయకులను కాపాడే ప్రయత్నమే. ఆనాడు ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని కాపాడినట్లే ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో బిఆర్ఎస్‌ను అనేక కేసుల నుంచి తప్పిస్తుందన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి బిజెపిని బద్నాం చేయాలనే కుట్రలు ఇక సాగవని, ఫోన్ ట్యాపింగ్ కేసు ఫార్ములా రేస్ అవినీతి కేసు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిశ్శబ్దం ఎందుకు? అంటూ ప్రశ్నించారు.

## బాలికపై లైంగిక వేధింపులు

### ఫోక్స్ కేసు నమోదు, నిందితుని అరెస్ట్

**మోత్కూర్, నవంబరు 5 ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై వేధింపులు ఘటనపై బుధవారం నిందితుని రిమాండ్ తరలించారు. మోత్కూర్ సిఐ సి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మోత్కూర్ మున్సిపాలిటీకి చెందిన 15 ఏళ్ల బాలికపై గాంధీనగర్ ప్రాంతానికి చెందిన రాంపాక మహేందర్ అనే వ్యక్తి గత కొంతకాలంగా లైంగిక వేధింపులు చేస్తూ వచ్చాడని బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు వలిగొండ రోడ్డులో చికెన్ షాప్‌లో పనిచేస్తున్నాడు. వరుసకు చెల్లెలు అయిన మైనర్ బాలికను పదేపదే వేధిస్తునాడు. ఆ వేధింపులు భరించలేక బాలిక తల్లికి వివరించడంతో, బాధితురాలి తల్లి మంగళవారం మోత్కూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసింది.ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బాలికను భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉమెన్ ఆఫీసర్ సమక్షంలో బాధితురాలి స్టేట్మెంట్ రికార్డు చేశారు.నిందితుడు రాంపాక మహేందర్‌ను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకొని, రిమాండ్ కోసం చౌటుప్పల్ కోర్టుకు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఇన్స్పెక్టర్ సీ. వెంకటేశ్వర్లు తెలిపారు.

## యాదాద్రిలో కార్తిక పౌర్ణమి శోభ



**యాదగిరిగుట్ట, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భం గా కొండపైన సందడి నెలకొంది. బుధవారం సెలవు దినం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల సందడితో స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ధర్మ దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. కొండపైన అనుబంధ ఆలయమైన శివాలయంలో ప్రర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు.అనుబంధ ఆలయమైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం కూడా భక్తులతో కిట్టకిట్ట లాడింది. కొండ కింద కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని వ్రతమండపాలు,కార్తీక దీపారాధన ప్రదేశాలు రద్దీగామారాయి. పౌర్ణమి సందర్భంగా ఉదయం 5 నుంచి 7 గంటల వరకు వ్రతాలు నిర్వహించారు. బుధవారం సత్యనారాయణ స్వామి వ్రతాల్లో భక్త లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఆదాయంలో భాగంగా బుధ వారం రూ.50,02,889లు వచ్చినట్టు ఆలయ అధికారులు తెలిపారు.

## 25 నుంచి హైటెక్స్‌లో 'పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్'

**హైదరాబాద్ నవంబరు 5,ప్రభాతవార్త:** దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్ ను నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్‌లో నిర్వహి స్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు సోమాజిగూడ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ వికసిత్ భారత్ దిశగా, స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తుకు దారితీస్తూ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను వన్ నేషన్ వన్ ఎక్స్పో అనే దూరదృష్టి ఉన్న థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25న నోవోటెల్ లో నాలెడ్జ్ డే తో ఈ ఈవెంట్ ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో 1,500కి పైగా ప్రతి నిధులు, 7కు పైగా అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటారని సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానం బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉంది అని అన్నారు. మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8నుంచి 10 వృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.1.35 లక్షల కోట్లకు పైగా తోడ్పడుతూ, పోషకాహారం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగావకాశాల పెరుగుదలకు కీలకంగా ఉందని అన్నారు. వికసిత్ భారత్ దిశగా, భారత పౌల్ట్రీ రంగం గొప్పతనాన్ని ప్రపంచానికి ప్రదర్శించాలనే సంకల్పంతో ఐపీఇఎంఏ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ కు 50దేశాల నుంచి 500కిపైగా ఎగ్జిబిటర్స్, 40,000కుపైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. 35,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఆధునిక ఎగ్జిబిషన్ స్పేస్‌లో బ్రీడింగ్, హాచరీ ఆటోమేషన్, ఫీడ్ మిల్లింగ్, వెటర్నరీ ప్రొడక్ట్స్, హౌసింగ్, సస్టైనబుల్ ప్రాక్టీసెస్ వంటి తాజా ఆవిష్కరణలు ప్రద ర్శించబడతాయని పేర్కొన్నారు.

## తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

### కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, అక్టోబరు 5 ప్రభాతవార్త:** తెలంగాణలో విద్యా రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర సాయిలో స్పందించారు. రాష్ట్రచరిత్రలో ఇదే మొదటిసారి అని అన్నారు. రాష్ట్రంలో 2,500కు పెగా విద్యాసంస్థలు మూతపడటం దురదృష్టకరమని, ఈ పరిస్థితిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి స్పందన చూపకపోవడం ఆందోళన కలిగిస్తోందని ఆయన విమర్శించారు. బకాయిల చెలింపుల కోసం ప్రైవేట్ కాలేజీలు మూడు రోజులుగా బంద్ కొనసాగిస్తున్నాయని గురుచేశారు. ఎక్స్ వేదికగా బండి సంజయ్ మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో ఉన్న రెండు సంవత్సరాల బకాయిలు, ప్రసుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని రెండు సంవత్సరాల బకాయిలు కలిపి మొత్తం నాలుగు విద్యా సంవత్సరాలుగా విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రూ.10,500 కోట్ల బకాయిలలో కనీసం సగం మొత్తాన్ని విడుదల చేయమని కాలేజీలు కోరుతున్నప్పటికీ, ప్రభుత్వం దానిని పరిష్కరించకుండా కాంగ్రెస్ అనుకూలులతో కమిటీ ఏర్పాటు చేయడం రాజకీయ నాటకమని ఆయన విమర్శించారు. దసరాకి రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు నిలిపేశారు? అంటూ ప్రశ్నించారు. రూ.1,200 కోట్ల బిల్లులకు టోకెన్లు ఇచ్చి చెల్లింపులు ఎందుకు ఆపేశారు? అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నిరక్ష్యంగా నడపడం, విద్యా రంగాన్ని దెబ్బతీయడం కాంగ్రెస్ పాలన లక్షణమైందని ఆరోపిస్తూ, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ప్రయోజనార్థం కనీసం సగం బకాయి లను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## నేడు ప్రొబేషనరీ డిఎస్‌పిల శిక్షణను ప్రారంభించనున్న డిజిపి

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండవ విడతగా గ్రూప్ వన్ అధికారులుగా ఎంపికై డిఎస్‌పిలుగా నియమించబడ్డ 130 మంది అధికారుల ప్రొబేషనరీ శిక్షణ గురువారంప్రారంభం కానుంది. హిమాయత్‌సాగర్‌లోని రాష్ట్ర పోలీసు అకాడమిలో వీరి శిక్షణ మొదలుకానుంది, డిజిపి శివధర్ రెడ్డి ఉదయం పది గంటలకు వీరి శిక్షణను ప్రారంభించనున్నారు. ఉమ్మడి ఎపి హయాంలో కూడా డి ఎస్‌పిలుగా ఇంత మంది అధికారులు ఎంపిక కాక పోవడం గమనార్హం. వీరి శిక్షణ ఏడాది పాటు జరగనుంది. ఈ కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ అభిలాష్ బిస్త్ సహా, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులు పాల్గొనున్నారు.

## వ్యవసాయానికి రూ.2,273 కోట్లతో ప్రతిపాదనలు

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** కేంద్ర వ్యవసాయ, సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.2,273 కోట్ల మేర రాబట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా కేంద్రం నుండి వీలైనన్ని ఎక్కువ నిధులు రాబట్టడంపై రాష్ట్ర సర్కార్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధపెట్టిన వ్యవసాయ శాఖ ఇందుకు 2,273 కోట్ల రూపాయలతో రూపొందించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. కాగా రాష్ట్రాలు తమ స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికలు రూపొందించటానికి కేంద్ర ప్రభుత్వం సౌలభ్యం కల్పిస్తోంది. రాష్ట్రాలు తయారు చేసిన సంబంధిత ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసి 60:40 నిష్పత్తిలో నిధులు మంజూరు చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు అతంత మాత్రంగా ఉండటంతో తెలంగాణలో ఈ పథకం అమలు నిలిచిపోయింది. 2015-16 నుండి ఈ పథకం యొక్క నిధుల సరళిని కేంద్రం మరియు రాష్ట్రాల మధ్య 60:40 నిష్పత్తిలో మార్చారు. ఈశాన్య రాష్ట్రాలు మరియు హిమాలయ రాష్ట్రాలకు 90:10 నిష్పత్తిలో నిధులు కేటాయిస్తారు. అదే కేంద్రపాలిత ప్రాంతాలకు 100 కేంద్ర గ్రాంట్ కేటాయిస్తారు.

## పాల డెయిరీలపై నిఘా

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** పాల ఉత్పత్తులను భర్తీ చేయడానికి ఉపయోగించే పాలేతర ప్రత్యామ్నాయాలు నాణ్యతపై ఆందోళనల నేపథ్యంలో వాటి వినియోగం పెరిగే అవకాశం ఉన్నందున, ఆహార నియంతణ సంస్థలు అటువంటి ఉత్పత్తులపై నిఘాను ముమ్మరం చేస్తున్నాయి. ప్రధానంగా పండుగల సమయంలో పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, ఆహార కల్తీ మరియు తప్పుడు లేబులింగ్‌ను నివారించడానికి పర్యవేక్షణను పెంచాలని అన్ని రాష్ట్రాలలోని నియంత్రణ అధికారులకు కేంద్రం తాజాగా ఆదేశాలు ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. సోయా పాలు, బాదం పాలు, అనలాగ్ పనీర్, సోయా, బాదం మరియు కొబ్బరితో తయారు చేసిన వేగన్ పెరుగు ప్రత్యామ్నాయాలు, వేగన్ చీజ్ మరియు కొబ్బరి పాలపై నిఘా పెంచాలని అన్ని రాష్ట్రాలలోని నియంత్రణ అధికారులను ఆదేశించారు. పండుగల సమయంలో ఆహార కల్తీ మరియు తప్పుడు లేబులింగ్‌ను నిరోధించడమే దీని లక్ష్యమని స్పష్టం చేసింది. "పండుగ సీజన్‌లో పెరిగిన పాల ఉత్పత్తుల వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని, కొనసాగుతున్న నిఘా ఈ నెలలో డైరీ అనలాగ్‌పై దృష్టి సారిస్తుంది" అని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తన ఆదేశాలలో పేర్కొంది.


## తడిసిన పత్తితో రైతులకు నష్టం లేదు

### వ్యవసాయ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** భారీ వర్షం కారణంగా రాష్ట్రంలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి బస్తాలు తడిచిన ఘటనపై రైతులకు ఎటువంటి నష్టం వాటిల్ల లేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు దీనికి సంబంధించి మంత్రి కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పత్తి బస్తాలు తడిసిన సంఘటనపై మంత్రి విచారణకు ఆదేశించినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ భాయి సూచనలతో రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. ఈ విచారణలో 7,329 బస్తాల పత్తిలో 59 బస్తాలు మాత్రమే తడిసినట్లు తేలినట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది. తడిసిన పత్తిని సిబ్బంది సహాయంతో ఆరబెట్టి అదే రోజున కొనుగోలు సైతం చేసినట్లు ఈ విచారణలో తేలిందని తెలియచేసింది.. ఈ విచారణ నివేదిక ప్రకారం రైతులకు ఎటువంటి ఆర్థిక నష్టం జరగలేదని మంత్రి కార్యాలయం స్పష్టం చేసింది.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

## సిఎం రేవంత్‌రెడ్డికి కెటిఆర్ సవాల్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబరు 5:** బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిపై, కాంగ్రెస్ అభివృద్ధికి చర్చకు సిద్ధమా ? జూబ్లీహిల్స్ ప్యాలెస్, కమాండ్ కంట్రోల్ సెంటర్, అసెంబ్లీ, గాంధీభవన్ ఎక్కడికి రమ్మన్నా వస్తానని చర్చకు సిద్ధమా ? అంటూముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రగతి నివేదికను కెటిఆర్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఓటమి భయంతో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధిపై చర్చకు రేవంత్ సిద్ధమా? అంటూ ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలో ఫ్లై ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు. రేవంత్ ప్రభుత్వం కొత్తగా ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టిందని.. రేవంత్ ప్రభుత్వం కనీసం రోడ్లపై పడిన గుంతలనైనా పూడ్చిందా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చేదెవరో ప్రజలందరికీ తెలుసునని, కాంగ్రెస్ హయాంలో మంచినీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో 3వేల నుంచి 7.5 వేల మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరిగిందని.. కేసీఆర్ ప్రభుత్వ పదేళ్లలో హైదరాబాద్‌ను క్లీన్ సిటీగా మార్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను మురికికూపంగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో పవర్ హాలీడేలు విధించేవారని, కేసీఆర్ పాలనలో 24గంటలు నాణ్యమైన కరెంట్ అందించామన్నారు. కేసీఆర్ హయాంలో విద్యుత్ వెలుగులు నిండాయని, గ్రీన్ సిటీ అవార్డ్ ఆఫ్ ది వరల్డ్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. 16వేల నర్సరీలను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. హెచ్‌సియూలో జీవవైవిధ్యాన్ని నాశనం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిదన్నారు. రేవంత్ బెదిరింపులకు ఎన్నో పరిశ్రమలు తరలిపోతున్నాయని, రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వాన్నంగా మారాయని విమర్శించారు. మహారాష్ట్ర పోలీసులు వచ్చి ఇక్కడ డ్రగ్స్ దందాను పట్టుకున్నారని, రూ.12వేల డ్రగ్స్ దొరికితే పట్టింపులేదా? తెలం గాణ ముఖ్యమంత్రి, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి రిపోర్ట్‌ను ఇంటింటికీ పంపిస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.5,328 కోట్లు ఖర్చు చేశామని.. మెట్రోపై రూ.1,722 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్‌డీపీ కింద రూ.333కోట్లతో షేక్‌పేట ఫ్లై ఓవర్‌ను నిర్మించామని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశామన్నారు. ఎర్రగడ్డలో రూ.900 కోట్లతో, వెయ్యి పడకలతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మించింది వాస్తవం కాదా? అంటూ ప్రశ్నించారు. కోవిడ్‌లో రూ.14 కోట్లతో వ్యాక్సిన్లు వేశామని, బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేసి పేదలకు వైద్యాన్ని చేరువ చేశామన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష డబుల్ బెడ్‌రూంలు కట్టామని, రెహ్మత్‌నగర్‌లో కట్టిన 3600 డబుల్ బెడ్‌రూంలను పంపిణీ చేశామన్నారు. ప్రైవేట్ వాళ్లు కడితే ఒక్కో డబుల్ బెడ్‌రూంకు రూ.కోటి ఛార్జ్ చేసేవారన్నారు. ఆసరా పెన్షన్, కల్యాణలక్ష్మి కింద దాదాపు రూ.600 కోట్లు అందించామన్నారు. 106 మందికి దళితబంధు అందించామన్నారు. పండుగల కోసం 14కోట్లు అందించామని, అన్నపూర్ణ భోజనాల కోసం రూ.2కోట్లు చెల్లించినట్లు వివరించారు. మైనారిటీల కోసం 204 గురుకులాలను ఏర్పాటు చేశామని, రూ.51కోట్లతో గురుకులాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బోరబండలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.87కోట్లు ఖర్చు చేశామని, రూ.17కోట్లతో ఫంక్షన్ హాలు నిర్మించినట్లు తెలిపారు. రూ.455 కోట్లతో పది సబ్‌స్టేషన్లను కట్టామని, జూబ్లీ హిల్స్‌లో విద్యుత్ నిర్వహణ కోసం రూ.505 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ తాగునీరు ఇచ్చేందుకు రూ.30కోట్లు ఖర్చు చేశామన్నారు కేటీఆర్.. రూ.180కోట్లు మంచినీటి కోసం ఖర్చు చేసినట్లు చెప్పుకొచ్చారు. పార్కుల నిర్వహణకు రూ.20 కోట్లు, డీఆర్ఎఫ్ పెట్టి ప్రజలకు సహాయక చర్యలు అందించామన్నారు.

# ఉమ్మడి వరంగల్, కరీంనగర్‌ను వణికిస్తున్న టోర్నడోలు

**యేడాది క్రితం తాడ్వాయిలో అడవుల ధ్వంసం**


**తాజాగా భూపాలపల్లిలో భారీ వృక్షాలు, పంటలు నాశనం**

**కాళేశ్వరంలో మూడుసార్లు టోర్నడోలు నీటిని పైకి లాగేసిన వైనం**

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** టోర్నడోల (సుడి గాలులు) గురించి భారత్ కంటే అమెరికా వాసులకు బాగా తెలుసు. ఇంకా బాగా చెప్పాలంటే అమెరికా దేశంలో అనేక ప్రాంతాలను వేసవి కాలంలో వణికిస్తుంటాయి. వీటి దెబ్బకు చెట్లతో పాటు వాహనాలు, రేకుల ఇళ్లు గాలిలో అమా ంతం వందల అడుగుల ఎత్తుకు ఎగిరిపోతుంటాయి. అక్కడ టోర్నాడోల ధాటికి పలు ప్రాంతాలలో చెరువులు, నదులలో నీరు అమాంతం కూల్ డ్రింక్ సీసాలో స్ట్రా వుంచి తాగినట్లు పైకి ఎగబాకిన ఉదంతాలు అనేకం వున్నాయి. అమెరికా అంతలా కాకున్నా తెలంగాణలోని ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాలను కొన్నేళ్లుగా ఓ మోస్తరు టోర్నాడోలు హడలెత్తిస్తూ బీభత్సం సృష్టిస్తున్న తీరు పర్యావరణానికి తీరని నష్టానికి కలిగేస్తున్నాయి. గ త ఏడాది ఆగస్టు 31వ తేదీన ములుగు జిల్లా తాడ్వాయి, గోవిందరావుపేట, ఏటూరు నాగారం మండలాలల్లో సాయంత్రం ఐదు గంటల నుంచి రా త్రి ఏడు గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పాటు బలమైన గాలులు వీచాయి. ఈ గాలులు టోర్నాడో ప్రభావం కారణంగా వీచినవని అధికారులు తేల్చారు. దీని కారణంగా 330 హెక్టార్లకు పైగా అడవి నాశనం అయిన తీరు అటవీ శాఖ అధికారులను సైతం ఆశ్చర్యపరిచింది. సుమా రు 90 వేల వరకు చెట్లు టోర్నాడో ధాటికి వేళ్లతో సహా నేల కూలాయి. కేవలం రెండు గంటల వ్యవధిలో టోర్నాడో తీవ్ర విధ్వంసం సృష్టించి ఎన్నో ఏళ్లుగా వున్న వృక్షాలను వేళ్లతో సహా నేలకూల్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇలాంటి టోర్నాడోలు రావడంచ అడవులు నాశనం కావడం ఇ దే తొలిసారి కావడంతో జాతీయ అటవీ విభాగం అధికారులు, కేంద్ర పర్యావరణ శాఖ అధికారులు రాష్ట్ర అధికారులతో కలిసి తాడ్వాయి అడవుల్లో వారం రోజులకు పైగా పర్యటించి ఇలా ఎందుకు జరిగిందనే దానిపై విస్తృతంగా పరిశోధన చేశారు. చివరకు బలమైన గాలుల వల్లే ఇలా జరిగిందని తేల్చారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో చెట్ల వేళ్లు భూమి లోపలికి చాలా దూరంలో వెళ్లక పోవడం వల్ల టోర్నాడో ధాటికి చెట్లన్నీ నేల కూలాయని వృక్ష శాస్త్ర విభాగం అధికారులు తేల్చారు. అయితే ఇంత విధ్వంసం జరిగినా అక్కడి జంతువులు, పక్షులు ఈ ప్రమాదాన్ని ముందుగానే పసిగట్టినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇక తాజా విషయానికి వస్తే బుధవారం నాడు భూపాలపల్లిలో ఇలాంటి టోర్నడో వణికించింది. పులిమెల మండలం లెంకలగడ్డ అటవీ ప్రాంతంలో టోర్నాడో ధాటికి వీచిన బలమైన గాలుల వల్ల భారీగా చెట్లు నేలకొరగగా పత్తి, మిరప పంట తీవ్రంగా దెబ్బతిన్నా యి. గత ఏడాది తాడ్వాయి ప్రాంతంలో వచ్చిన టోర్నాడో తరహాలోనే తాజాగా భూపాలపల్లిలో వచ్చిందని అధికారులు చెబుతున్నారు. కాగా భూ పాలపల్లిలో ఏర్పడ్డ టోర్నాడోపై వాతావరణ శాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులతో వారు సంప్రదింపు లు జరుపుతున్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటని పైకి లాగేసిన టోర్నడోలు

ఇదిలావుండగా మూడేళ్ల క్రితం కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద టోర్నాడో కారణంగా ప్రాజెక్టులో వున్న నీరు ఒక్కసారిగా పైకి ఎగబాకిన వైనం అప్పట్లో స ంచలనం రేపింది. ఇలాంటి ఘటనలు కాళేశ్వరం ప్రాజెక్టులోనే మూడుసార్లు జరగడం గమనార్హం. ఇలాంటి ఘటన అమెరికాలోని చెరువులు, నదు ల్లో సర్వసాధారణం. ఎపిలోనూ పలుచోట్ల చెరువుల వద్ద ఇలాంటివి జరిగాయి. తెలంగాణలో మాత్రం కాళేశ్వరంలోనే జరిగాయి. టోర్నాటోల వల్ల ఇలాంటి అనూహ్య ఘటనలు జరుగాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల ఇలాంటివి సంభవి స్తుంగటాయని వారంటున్నారు.




## ఇండోనేసియాను రెండోసారి వణికించిన భూకంపం

**జకార్తా, నవంబరు 5:** ఇండోనేషియాని మరోసారి భారీ భూకంపం వణికించింది. సులవేసి ద్వీపంలో బుధవారం ఉదయం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 6.2గా నమోదైనట్లు ఇండోనేషియా జియోఫిజిక్స్ ఏజెన్సీ తెలిపింది.ఈ భూకంపం ధాటికి ఉత్తర తీరంలోని పలు ప్రాంతాల్లో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అయితే, ఈ విపత్తులో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని తెలిసింది. ప్రస్తుతానికి సునామీ హెచ్చరికలు లేవని అధికారులు తెలిపారు. మరోవైపు ఈ ప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. వారం రోజుల్లో ఇండోనేషియాలో భూమి కంపించడం ఇది రెండోసారి. గతవారం మలుకు దీవుల సమీపంలో భూమి కంపించిన విషయం తెలిసిందే. బండా సముద్రంలో దాదాపు 137 కిలోమీటర్ల లోతులో 6.6 తీవ్రతతో భూమి కంపించింది. తాజాగా బుధవారం కూడా మరోసారి అదే స్థాయిలో భూకంపం సంభవించింది. వరుస భూకంపాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

# ఎన్ఎస్ఎ కింద తప్పడుకేసు ఉత్తర్వులపై హైకోర్టు సీరియస్

**షాడోల్ జిల్లాకలెక్టర్‌పై ధిక్కార చర్యలకు ఆదేశం**

**రూ.2 లక్షలు నిందితుడికి పరిహారం చెల్లించాలని హైకోర్టు ఆదేశం**



**భోపాల్, నవంబరు 5:** జాతీయ భద్రతా చట్టం ఎన్ఎస్ఏ కింద ఒక యువకుడిపై తప్పుడు కేసు నమోదు చేసి ఏడాదికిపైగా జైలులో ఉంచిన కేసుపై విచారణ జరిపిన హైకోర్టు జిల్లా కలెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.2 లక్షల జరిమానా విధించింది. ఆ కలెక్టర్‌పై ధిక్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మధ్యప్రదేశ్‌లోని షాడోల్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2024 సెప్టెంబర్‌లో ఇసుక మాఫియా కేసులో నిందితుడైన నీరజ్‌కాంత్ ద్వివేదికి బదులుగా రైతు హిరామణి కుమారుడు సుశాంత్‌పై జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద చర్యలు తీసుకోవాలని షాడోల్ జిల్లా కలెక్టర్ కేదార్ సింగ్ తప్పుగా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ యువకుడ్ని అరెస్ట్ చేసి ఏడాదిపైగా జైలులో ఉంచారు. రైతు హిరామణి దీనిపై మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాడు. జస్టిస్ వివేక్ అగర్వాల్, జస్టిస్ ఏకే సింగ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. షాడోల్ కలెక్టర్ జారీ చేసిన ఎన్ఎస్ఏ ఉత్తర్వులో తీవ్రమైన విధానపరమైన లోపాలు ఉన్నాయని గుర్తించింది. విచారణ సందర్భంగా క్లరికల్ మిస్టేక్ జరిగిందని కలెక్టర్ కేదార్ సింగ్ అంగీకరించారు. దీంతో ఉత్తర్వులో ఏమున్నది అన్నది చూడకుండా అధికారులు నిర్లక్ష్యం వహించడం, గుడ్డిగా సంతకాలు చేయడంపై కోర్టు ఆగ్రహించింది. అలాగే ఎన్ఎస్ఏ చట్టం దుర్వినియోగంపై మండిపడింది. మరోవైపు చట్టవిరుద్ధంగా నిర్బంధించిన బాధితుడు సుశాంత్‌కు వ్యక్తిగతంగా రూ.2 లక్షలు పరిహారంగా చెల్లించాలని కలెక్టర్ కేదార్ సింగ్‌ను ధర్మాసనం ఆదేశించింది. కేసును తప్పుదారి పట్టించే విధంగా అఫిడవిట్ దాఖలు చేసినందుకు కలెక్టర్‌తో పాటు, ఆ ఉత్తర్వును తనిఖీ చేయకుండా అమలు చేసిన అదనపు ప్రధాన కార్యదర్శి (హోం) ఎస్ఎస్ శుక్లాకు ధిక్కార నోటీసు జారీ చేయాలని, వారిద్దరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించి విచారణను ఈనెల 25కు వాయిదా వేసింది.

# కిష్త్‌వార్‌జిల్లా ఛత్రులో ఉగ్రవాదులతో ఎదురుకాల్పులు

**శ్రీనగర్,నవంబరు 5:** జమ్ముకాశ్మీర్‌లోని కిష్త్‌వార్ జిల్లాలోని ఛత్రు ప్రాంతంలో ఉగ్రవాదులు భద్రతా బలగాలమధ్య ఎదురుకాల్పులుజరుగుతున్నాయి. కల్బాన్‌ప్రాంతంలని ఛత్రు అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు తెలియడంతో జమ్ముకాశ్మీర్ పోలీసులు, వైట్‌నైట్‌కార్ప్స్ సిబ్బందిసంయుక్తంగా గాలింపు చర్యలుచేపట్టారు. బుధవారం ఉదయం వీరికి ఉగ్రవాదులు తారసపడ్డారు. వెనువెంటనే వారు కాల్పులకు తెగబడటంతో భద్రతా బలగాలు ఎదురుకాల్పులు జరిపాయి. ఇప్పటికీ ఎన్‌కౌంటర్ కొనసాగుతూనే ఉందని వైట్‌నైట్‌కార్ప్స్ ట్వీట్‌చేసింది. కల్బాన్ దట్టమైన అటవీప్రాంతంలో గాలింపు చర్యలుచేపట్టామని, కిష్త్‌వార్‌జిల్లాలోని ఛత్రు ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు తెలియడంతో వారిని చుట్టుముట్టినట్లు సైనిక అధికారి ఒకరు తెలిపారు.



అటవీప్రాంతంలో నక్కి కాల్పులకు తెగబడటంతో రక్షణదళాలు కూడా కాల్పులు జరుపుతున్నట్లు తెలిపారు. డ్రోన్లు, మానవరహిత వాహికలతో అటవీప్రాంతం మొత్తం గాలింపుచేపట్టామని, నక్కి ఉన్న ఉగ్రవాదుల కదలికలు పసిగట్టి ఆప్రాంతానికి చేరుకునేసరికే కాల్పులుప్రారంభించారని ఆయన తెలిపారు. ఇటీవలి కాలంలో ఈప్రాంతంలోనే అనేక సార్లు ఎదురుకాల్పులు జరిగాయి. ఆపరేషన్ సిందూర్ తర్వాత సరిహద్దుల్లో మళ్లీ ఉగ్రవాదుల ఉనికి పెరగడంతో సరిహద్దుల్లోని మన సైన్యం ఇతర భద్రతా సిబ్బంది అప్రమత్తం అయ్యారు. బుధవారం జరిగిన సంఘటన ఈ కోవకు చెందినదే.

# పరకామణి ఆస్తులపై దర్యాప్తు మొదలు

**తిరుపతి, నవంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో జరి గిన అవినీతిఅక్రమాలపై హైకోర్టు ఆదేశాలతో సిఐడి బృందం 20మంది అధికారులతో విచారణ చేపట్టేందుకు రంగంలోకి దిగామని, పరకామణితో సంపాదించిన ఆస్తుల వివరాలు తెలిసిన వారెవరైనా సమాచారం ఇవ్వొచ్చని సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలు అందిం చిన వారి పేర్లు, ఇతరత్రా సమాచారం గోప్యంగా ఉంచుతామని అన్నారు. పరకామణి ఆస్తులకు సంబంధించి 9440700921 నంబర్‌కు వాట్సాప్ ద్వారా గానీ, మెయిల్‌ఐడి "సిడిజిసిఐడి అట్‌దిరేట్‌ఆఫ్ ఎపి.జిఒవి.ఇన్"కు సమాచారం తెలియజేయవచ్చని సూచించారు.

తిరుమల పరకామణిలో 2023లో జరిగిన 920 అమెరికన్ విదేశీడాలర్ల చోరీకేసుకు సంబంధించి ఇటీవల శ్రీనివాసులు అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయడం, విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తి తదుపరి పూర్తిస్థాయిలో సమగ్రదర్యాప్తుకు సిఐడి డిజిని ఆదేశించిన విషయం విదితమే. హైకోర్టు ధర్మాసనం ఆదేశాలతో ఇప్పటికే తొలిదఫా తిరుమలకు వచ్చిన సిఐడి డిజి రవిశం కర్ అయ్యన్నార్ తిరుమల పోలీసుల నుండి ఎఫ్ఐఆర్, సిడి డికార్డులు, సిసికెమెరాల పుటేజీలను స్వాధీనం చేసుకుని గత నెలలో హైకోర్టుకు సమర్పించారు. ఇంకా మరింత లోతుగా సమగ్రదర్యాప్తు చేపట్టి పరకామణిలో చోరీతో కూడగట్టిన ఆస్తుల వివరాలు సేకరించాలని, ఎక్కడెక్కడ ఎంత మేరకు ఉన్నాయనే ఆధారాలు,లోక్‌అదాలత్‌ద్వారా మధ్యవర్తిత్వం జరిపి లబ్ధిపొందిన వారి వివరాలు,వారికి సంబంధించిన ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ పేమెంట్స్ వివరాలను డిసెంబర్ 2వతేదీ హైకోర్టుకు సమర్పించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిఐడి ఎస్పీ గంగాధర్, లీగల్‌అడ్వయిజర్ లక్ష్మణరావు, ముగ్గురు డిఎస్పీలు, ఆరుమంది సిఐలు సిబ్బంది మొత్తం 20మంది బృందం తిరుపతికి చేరుకుంది.



వివరాలు తెలపాల్సిన నంబరును చూపుతున్న సిఐడి బృందం

- అక్రమ ఆస్తులపై సమాచారం ఇవ్వండి
- డిసెంబర్2లోగా హైకోర్టుకు సమగ్ర నివేదిక
- నిందితుడు రవికుమార్ హైదరాబాద్‌లో మకాం
- తిరుపతిలో సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్

మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు పలు కోణాల్లో సమాచారం రాబట్టారు.

ఈ వివరాలతో మరింతగా అక్రమా లపై, అవినీతిపై సమాచారం రావాలని బుధ వారం సాయంత్రం తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో మీడియాప్రతి నిధుల సమావేశంలో తెలిపారు.

**9440700921కు వాట్సాప్ చేయండి:** తిరుమల పరకామణిలో చోరీచేసి దానిద్వారా విలువైన ఆస్తులు కూడగట్టారని, కుటుంబసభ్యుల పేరున ఉంచారని, అయితే ఆ వివరాలు తెలిసిన వ్యక్తులు ఎవరైనా 9440700921 నంబర్‌కు వాట్సాప్ ద్వారా తెలియజేయాలని సిఐడి డిజి రవిశంకర్ అయ్యన్నార్ కోరారు.

సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసాని చ్చారు. ఇంకా మెయిల్ ఐడిని కూడా తెలి పారు. వివరాలు అందిస్తే మా విచారణ మరింత వేగవంతంచేస్తామని అన్నారు.

# సిఎం రేవంత్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

## ఇసికి ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నేతలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్5:** జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిగిలిన మూడు రోజులు పాల్గొనకుండా ఆయనపై నిషేధం విధించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో మాట్లాడుతూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆ రోజు బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషన్ అధికారిని కలవడానికి బి ఆర్ కె భవన్ వెళ్లారు.అధికారులు అందుబాటులో లేకపోవడంతో మెయిల్ ద్వారా ఫిర్యాదు పంపుతామని తెలిపారు. కేటిఆర్ పై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత దుషణకు పాల్పడ్తారన్నారు. ఇది మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నియమావళికి విరుద్ధమన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఆరోపించారు. అంతేకాకుండా ఇస్లాం మతం గురించి,ముస్లిం పై అవమానకరంగా మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింలకు ఎంతో కొంత పరువు ఉన్నదని, లేకుంటే లేదని,కాంగ్రెస్ పార్టీ లేకపోతే ముస్లింలే లేరని అహంకారపూరితంగా మాట్లాడారని మండి పడ్డారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఒక మతాన్ని ,మత విశ్వాసాలను అవమానించడం సరైంది కాదన్నారు. వ్యక్తులను కించపరిచేలా,మతాన్ని లేదా మత విశ్వాసాలను కించపరిచే వ్యాఖ్యలు ఎవరు చేసినా ఎన్నికల సంఘం ఉపేక్షించవద్దని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక మత విశ్వాసాలను విమర్శిస్తూ మాట్లాడటం తీవ్రమైన నేరం అయినందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై వెంటనే క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తుంగ బాలు,మాజీ బిసి కమిషన్ సభ్యులు కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఎల్ఎం అడ్మిషన్ల 2వ దశ సీట్ల కేటాయింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్5:** ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి రెండో విడత సీట్ల కేటాయింపును టీజీసెట్స్ అడ్మిషన్స్2025 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి విడుదల చేశారు. రెండో విడతలో 1823 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోగా, 277 మందికి సీట్లు కేటాయించారు. రెండో విడతలో కన్వీనర్ కోటా కింద 282 సీట్లు అందుబాటులో ఉన్నాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 7 లోగా తమకు కేటాయించన కాలేజీల్లో రిపోర్టింగ్ చేసుకోవాలని కన్వీనర్ సూచించారు. ఎల్ఎల్ఎం తరగతులు అక్టోబర్ 23 నుండి ప్రారంభమయ్యాయి.

## ఎంపీ నగేష్ ఇంటిని ముట్టడించిన బిఆర్ఎస్ నేతలు: ఆదిలాబాద్‌లో ఉద్రిక్తత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్5:** పత్తి కొనుగోళ్లలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) వైఖరిని నిరసిస్తూ బుధవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ ఎంపీ నగేష్ ఇంటి ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. మాజీ మంత్రి జోగు రామన్నతో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఎంపీ నగేశ్ ఇంటి ముందు బైఠాయించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఆందోళనకు దిగిన మాజీ మంత్రి తోపాటు బీఆర్ఎస్ నాయకులు పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. సీసీఐ తేమ పేరిట పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తూ రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. తేమతో సంబంధం లేకుండా సీసీఐ పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే వర్షాలకు కారణంగా రైతులు పత్తి పంటను నష్టపోగా సీసీఐ పరిమితులు విధించడం సరికాదని అన్నారు. ఎకరాకు 7 క్వింటాళ్ల కాకుండా 12 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న పత్తికి సుంకం తగ్గించి కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బిజెపికి తాకట్టు పెట్టారు

### క్రైస్తవ సంఘాల ప్రతినిధుల సమావేశంలో సిఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, నవంబర్5:** బీజేపీలో బీఆర్ఎస్ విలీనమయ్యే అవకాశం ఉందని, ఈ విషయాన్ని గతంలో కల్వకుంట్ల కవిత చెప్పారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ బీజేపీకి తాకట్టు పెట్టారని ఆయన విమర్శించారు. జూబ్లీహిల్స్ లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రిని కలిసి తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత్ జోడో యాత్ర ద్వారా దేశంలోని మైనారిటీలకు రాహుల్ గాంధీ భరోసా ఇచ్చారని అన్నారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి 3 నెలలైనా స్పందించలేదని విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ ఇంకా అనుమతి ఇవ్వలేదని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతించడంలేదని ప్రశ్నించారు. గత ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఆత్మహత్య చేసుకుని బిజెపికి అవయవదానం చేసిందని వ్యాఖ్యలు చేశారు. నరేంద్రమోడీకి మద్దతు ఇస్తున్న కెసిఆర్ ప్రమాదకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరపాటున కారు గుర్తుకే ఓటేస్తే అది కమలం గుర్తుకు వేసినట్లేనని పేర్కొన్నారు. మైనారిటీలను మభ్యపెట్టేందుకు పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం విచారణను కేంద్ర దర్యాప్తు సంస్థ సిబిఐకి అప్పగించి 3 నెలలు గడుస్తోందని అన్నారు. ఇక ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో కెటిఆర్ ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు లేఖ రాస్తే ఇప్పటివకు స్పందన లేదని చెప్పారు. బిజెపి,బిఆర్ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే కెటిఆర్‌పై విచారణకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదో చెప్పాని రెండు పార్టీలను ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా,రాహుల్‌ని ఈడీ విచారించిందని, కెసిఆర్,కెటిఆర్,హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్ ను ప్రయోగశాలగా చూస్తున్నారంటూ రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.

## రైతులకు రూ.2 వేల కోట్ల బోనస్

### ఆర్థిక శాఖ అంచనా

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త:** ప్రస్తుత వానాకాలం మార్కెటింగ్ సీజనుకు సంబంధించి రైతులు పండించిన సన్నాలకు చెందిన వరికి గాను బోనస్ కింద రూ.2 వేల కోట్ల రూపాయల వరకూ అవసరం అవుతాయని ఆర్థిక శాఖ అంచనా వేసింది.

ఇందుకు అవసరమైన నిధులను సమకూర్చేందుకు చర్యలు చేపట్టింది. దీంతో సర్కార్ సన్న రకం ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిం పునకు సిద్ధమవుతోంది. ఇదే సమయంలో యాసంగి బోనస్ బకాయిలు కూడా త్వరలో విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా వానాకాలం సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయిలో మొత్తం 65.96 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. తద్వారా సుమారు 158.85 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, ఇందులో 92.62 లక్షల టన్నులు సన్న రకం, 66.23 లక్షల టన్నులు దొడ్డు రకం ధాన్యం ఉన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మొత్తం 80లక్షల టన్నుల ధాన్యాన్నికొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టు కుంది. ఇందులో 40లక్షల టన్నులు సన్న రకమే కావడం విశేషం. ఈ అంచనా ప్రకారం సన్నాలు సాగు చేసిన రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ రూపంలో సుమారు రూ.2వేల కోట్ల భారీ ప్రయోజనం చేకూరనుంది.

## తాడిపత్రిలో బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

**తాడిపత్రిటౌన్, నవంబరు 5 ప్రభాతవార్త :** తాడిపత్రి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోగర్ తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరివేసు కొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం 11 గంటలైనా మేనేజర్ బ్యాంకుకు రాక పోవడంతో తోటి ఉద్యోగులు తన ఇంటి దగ్గరికి వెళ్లి చూడగా అక్కడ బ్యాంకు మేనేజర్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మేనేజర్ గోగర్ గత సంవత్సరంనుండి యూనియన్ బ్యాంకులో మేనే జర్‌గా పనిచేస్తున్నట్లు తోటి ఉద్యోగులు తెలి పారు. కుటుంబ కలహాలనేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.మృతుడి వద్ద సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతికి గల కారణాలపై పోలీ సులు దర్యాప్తు చేపట్టారు.

# జార్ఖండ్ వివాదాస్పద డిజిపి రాజీనామా!



**రాంచి, నవంబరు 5:** వివాదాల్లో చిక్కుకున్న జార్ఖండ్ డిజిపి అనురాగ్‌గుప్తా తన కొలువుకు రాజీనామాచేసారు. అయితే ఆయన రాజీనామాను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆయన నియామకం దగ్గరున్నంచి పనితీరులోను అన్నింటా వివాదాలే ఆయన్ను వెంటాడాయి. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత కూడా ఆయనే డిజిపిగా కొనసాగడంపై పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. హేమంత్‌సోరెన్ ప్రభుత్వంలోఆయన పదవీకాలం పొడిగించడంతో గుప్తాయే డిజిపిగా కొనసాగారు. ఆరునెలల గడిచిన తర్వాత వివాదాలు మరింత తీవ్రతరం కావడంతో ఆయన తన పదవినుంచి వైదొలుగుతూ రాజీనామాచేసారు. డిజిపి గుప్తా పదవీకాలాన్ని పెంచేందుకు కేంద్ర హోంశాఖ నిరాకరించింది. ఆయన రిటైర్‌మెంట్ తర్వాత ఆయనకు పొడిగింపు సాధ్యంకాదని స్పష్టంచేసింది. రిటైర్‌మెంట్ తేదీ తర్వాత ఆయన పదవీకాలాన్ని పొడిగిస్తూ లేఖరాయడం సాధ్యం కాదని స్పష్టంచేసింది. రాష్ట్రప్రభుత్వ నోటిఫికేషన్‌తో అనురాగ్‌గుప్తా డిజిపిగా ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ నియమితులయ్యారు. అంతకుముందు 2024 జులై 26న పూర్తికాలపు డిజిపిగా బాధ్యతలుస్వీకరించారు. ఆ తర్వాత ఈసీ ఆయన్ను అసెంబ్లీ ఎన్నికల సమయంలో తొలగించింది. ఎన్నికల తర్వాత ఆయన ఇన్‌ఛార్జి డిజిపిగా నియమితులయ్యారు. 2024 నవంబరు 28వ తేదీ మళీ బాధ్యతలు స్వీకరించారు. అయితేప్రతిపక్షనేత బాబూలాల్‌మరాండి గుప్తా నియామకం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు వ్యతిరేకమని చెపుతూ పిల్ దాఖలుచేసారు. ఎలాంటి చట్టసవరణ లేదా తీర్మానం కేబినెట్ ఆమోదం లేకుండా ఎలా ఆయన్ను నియమిస్తారని ప్రశ్నించారు.

యుపిఎస్‌సి నిబంధనలు కూడా ఉల్లంఘించిందని పట్టుబట్టారు. జార్ఖండ్ చీఫ్‌జస్టిస్‌కు తన పిటిషన్‌పై సుమోటోగా స్వీకరించి విచారణచేపట్టి సిబిఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. ఈ వివాదం మరింత తీవ్రం కావడంతో డిజిపి గుప్తా తన పదవికి రాజీనామాచేసారు.

# రాజన్న భీమన్న క్షేత్రంలో కార్తిక పౌర్ణమి సందడి

## - శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు - పోటెత్తిన భక్తులు - 365 వత్తులతో దీపాలు వెలిగించిన మహిళలు

**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర భీమేశ్వర క్షేత్రంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందడి నెలకొంది. శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. 365 వత్తులతో మహిళలు నేతి దీపాలు వెలిగించారు. పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. కార్తీక మాసంలో చేసే స్నానం, జపం, తపస్సు, దాన ధర్మాలు, ఉపవాసాలు, అనంత పుణ్య ఫలాలను ఇస్తాయని కార్తీక పురాణం చెబుతోంది. అందుకే ఈ ఏడాదంతా ఎలా ఉన్న, ఆ స్వామిని ప్రసన్నం చేసుకునేందుకు ఈ మాసమంతా ఆధ్యాత్మిక ఆనందమయ వాతావరణం, పూజలు, అన్నదానం, జపం, ఈ మాసంలో ఉపవాసాలు చేసిన వారికి పుణ్య ఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా దీపారాధన శ్రేష్టమని, దీన్ని నైవేద్యంగా పెట్టడం వల్ల సర్వ పాపాలు తొలిగిపోయి మోక్ష ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. కార్తీక పౌర్ణమి రోజున హరుడు త్రిపురాసుడిని సంహరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. దీనికి గుర్తుగా తులసి చెట్టు వద్ద మహిళలు 365 వత్తులను నేతితో వెలిగిస్తారు. చిన్నా పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లో తలంటు స్నానం చేసి, పూజలు చేసి, ఆయాలను సందర్శిస్తారు. శివుని ఆరాధించే భక్తులు ఉపవాస దీక్షలు చేసి ప్రదోష కాలంలో స్వామికి అభిషేకం చేసి, మారేడు దళాలతో పూజలు చేస్తారు.

**రాజన్న భీమన్న క్షేత్రంలో భక్తజన సందోహం**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర క్షేత్రం భక్తులతో జన సందోహంగా మారింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిసిపోయాయి. అశేష సంఖ్యలో హాజరైన భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి.

దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో భక్తులు వేచి ఉన్నారు. దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. తలనీలాలు, కోడె మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాలు జరుపుకున్నారు. బుధవారం ఒక్క రోజే 30వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

**కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు**

కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో బుధవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6గంటలకు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. షిఫ్ట్ పద్ధతిన భక్తులకు సత్యనారాయణ వ్రతాలు చేసుకునే విధంగా వీలు కల్పించారు.

భీమేశ్వర స్వామి ఆలయంలో మహాలింగార్చన గావించారు. రాత్రి 7గంటలకు ఆలయం ముందు జ్వాలాతోరణం నిర్వహించారు.

జ్వాలా తోరణం చూసేందుకు భక్తులు బారులు తీరారు. రాత్రి 9గంటలకు నిషి పూజ చేశారు. అనంతరం స్వామివారికి మహాపూజ జరిపించారు.

# కారు సహా 5 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

## - తమిళ స్మగ్లర్ అరెస్టు

**యర్రావారిపాలెం, నవంబర్ 5 ప్రభాతవార్త:** కారుతో సహా 5 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు చిత్తూరు జిల్లా భాకరాపేట రేంజ్ అటవీక్షేత్రాధికారి ఎన్. వెంకటరమణ తెలిపారు. ఎర్రచందనం కించ ప్రాంతం నుండి యల్లమంద మీదుగా వేలూరుకు ఎర్రచందనం అక్రమ రవాణా అవుతోందని అందిన రహస్య సమాచారం మేరకు భాకరాపేట రేంజ్ అటవీ సిబ్బందితో కలసి ఉస్తికాయల పెంట బీట్ పరిధిలోని యల్లమంద వద్ద అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. తీసుకొని అందులోని తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన అజిత్ కుమార్ మురళి అను స్మగ్లర్ ను అరెస్టు చేయడం జరిగిందన్నారు. కారు తో సహా 5 ఎర్రచందనం దుంగలు అదుపులోకి తీసుకోవడం జరిగింది అన్నారు. కారు ఎర్రచందనం తో సహా వాటి విలువ సుమారు 5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓ లు వై.రాజేష్ కుమార్, ఎం. సదాశివయ్య, సి. ప్రదీప్ చంద్, సి.రవి, జె.బి. నిఖిల్, డ్రైవర్ లు హెచ్. శంకర్, ఎన్. రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీతో సద్దుమణిగిన ట్రేడ్‌వార్!



**వాషింగ్టన్, నవంబర్ 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ కాస్త సద్దుమణిగింది. ఆ ఫలితంగా సుంకాల విషయంలో కీలక నిర్ణయాలు వెలువడుతున్నాయి. అమెరికా వస్తువులపై ఉన్న అదనపు 24 శాతం సుంకాల సస్పెన్షన్‌ను పొడిగిస్తున్నట్లు చైనా ప్రకటించింది. ఈ పొడిగింపు ఏడాది పాటు అమల్లో ఉండనుంది. పది శాతం టారిఫ్ మాత్రం కొనసాగనుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. గత నెల చివర్లో డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌ల భేటీ యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిన సంగతి తెలిసిందే. గతవారం దక్షిణ కొరియా వేదికగా వీరిద్దరూ సమావేశమయ్యారు. జిన్‌పింగ్‌తో భేటీ అద్భుతంగా జరిగింది. మా సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఫెంటనిల్ తయారీలో వాడే ముడి ఉత్పత్తుల రవాణాను కట్టడి చేసేందుకు జిన్‌పింగ్ తీవ్రంగా శ్రమిస్తారని నేను విశ్వసిస్తున్నా. అందుకే ఫెంటనిల్ పేరుతో చైనాపై విధించిన 20 శాతం సుంకాలను 10 శాతానికి తగ్గిస్తున్నా. దీంతో బీజింగ్‌పై మొత్తం టారిఫ్‌లు 57 శాతం నుంచి 47 శాతానికి దిగి రానున్నాయి. ఇక, అమెరికా సోయాబీన్ ఉత్పత్తుల కొనుగోళ్లను చైనా తక్షణమే పునరుద్ధరించేందుకు అంగీకారం కుదిరింది అని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అరుదైన ఖనిజాలకు సంబంధించిన సమస్య కూడా పరిష్కారమైందని అమెరికా అధ్యక్షుడు ఈ సందర్భంగా తెలిపారు. ఇకపై చైనా నుంచి అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదన్నారు. చైనాతో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కూడా కుదురనున్నట్లు సంకేతాలిచ్చారు.

# నేటి నుండి పత్తి కొనుగోళ్లు నిలిపివేత

## తెలంగాణ కాటన్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్

**జమ్మికుంటహూజురాబాద్, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఆరుగాలం కష్టించి లక్షలాది రూపాయల అప్పులు చేసి పత్తి పంటలకు పెట్టుబడిలు పెట్టిన అతివృష్టి, అనావృష్టిల వల్ల రైతన్నలు పత్తి పువ్వులాగా నేలరాలిపోతున్నారు. అప్పుల ఊబిలో కూరి మసకబారిపోతున్నార. చివరికి రైతులు బ్రతుకులు గుడ్డి పత్తిలా తయారయ్యాయి. ఒకపక్క అప్పుల వాళ్ల వేదింపులు, మరోపక్క కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) అధికారులు ఈయేడు రైతుల నుండి పత్తి కొనుగోళ్లకు వారు పెట్టిన నిబంధనలు రైతాంగానికి ఊరితాళ్లులాగా మారుతున్నాయని, జిన్నింగ్, ప్రిస్సింగ్ మిల్లులలో పనులు లేక కూలీలు రోడ్డున పడుతున్నారని రైతులపై పెట్టిన నిబంధనల సడలింపు కోసం డిమాండ్ చేస్తూ గురువారం 6వ తేది నుండి రాష్ట్ర వ్యాప్తంగా 322 మిల్లుల యాజామాన్యాలు ప్రైవేట్ రంగంలో పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు తెలంగాణ కాటన్ మిల్లర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి జమ్మికుంటలో విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండాయా అధికారులు జాబ్ వర్క్ టెండర్ ఫైనలేజేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్ర మొత్తానికి పిలువాయి రేటు 1440 రూపాయలుగా నిర్ణయించిందని, 322 కాటన్ జిన్నింగ్ పరిశ్రమలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నోటిపై చేయడం జరిగిందని, దీనిని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సమక్షంలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 విధానంలో వెసులు బాటు కల్పించి అన్ని మిల్లులను నడిపే విధంగా సరుకు అలాట్‌మెంట్ చేస్తామని మంత్రి ఇచ్చిన హామీ ఇప్పటి వరకు సిసిఐ అధికారులు అమలు చేయకపోవడం దురదృష్టకరమని రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ రెడ్డి వెల్లడించారు. దీని ఫలితంగా జాబ్ వర్క్ అలాట్‌మెంట్ కొన్ని మిల్లులకు జరిగి మిగితా చాలా మిల్లులకు అలాట్ మెంట్ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్రంలోని 33జిల్లాల పరిధిలోని కాటన్ మిల్లులకు అనేక ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కూలీలు ఇక్కడ మిల్లులు నడవక, పని లేక వెనుతిరిగి పోతున్నారని రవీందర్ రెడ్డి విచారం వ్యక్తం చేసారు. ఇప్పటికి అనేక మిల్లులు నడవలేని పరిస్థితులు ఎర్పడగా, మరికొన్ని మిల్లులు మూతపడే పరిస్థితులు దాపరించాయని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. మిల్లులను నడపాలని ప్రభుత్వం కాపస్ కిసాన్ యాప్ ద్వారా పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎదురువుతున్న ఇబ్బందులపై సిసిఐ అధికారులు రైతులు పండించిన పత్తి పంటను కొనడానికి ఎకరాకు 12క్వింటాళ్ల పరిమితిని ప్రస్తుతం ఎకరాకు 7 క్వింటాల్‌క తగ్గించడం వల్ల రైతులు మిల్లులకు వచ్చిన తర్వాత ఎదురవుతున్న నిబంధనల కఠినతరం వల్ల రైతులతో పాటు తెలంగాణ రాష్ట్ర కాటన్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం సిసిఐ దృష్టికి గత నెల 30న విన్నవించినప్పటికి ఈరోజు వరకు పరిష్కారం చూపించకపోవడం రైతులను, మిల్లర్లను ఇబ్బందులకు గురిచేసినట్లు కాదా..? అంటూ రవీందర్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ సమస్యలపై రాష్ట్ర కాటన్ అసోసియేషన్ ఈ నెల 2వ తేదిన మరో వినతి పత్రం ఇచ్చినప్పటికి సిసిఐ నుండి స్పందన లేకపోవడంతో ఆరోవ తేది గురువారం నుండి ప్రైవేట్, సిసిఐ పత్తి కొనుగోళ్ల నిరవధికంగా పత్తి కొనుగోళ్ల నిలిపివేయాలని రాష్ట్ర సంఘం తీర్మానించినట్లు రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మార్కెటింగ్ శాఖ అధికారులు తక్షణమే సమస్యలపై పరిష్కారం చూపాలని రైతాంగాన్ని ఆదుకోవాలని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్‌కు సమాచారం అందిచడం జరిగిందన్నారు. గురువారం నుండి ప్రైవేట్, సిసిఐ పత్తి కొనుగోళ్ల చేసే అధికారులు నిరవధికంగా కొనుగోళ్ల బంద్ చేయటకు నిర్ణయించడం జరిగిందని ఈ అనివార్యపరిస్థితులను రైతు సొదరలు దయచేసి వ్యవసాయ మార్కెట్‌లకు గానీ, కాటన్ జన్నింగ్ మిల్లులకు గానీ, పత్తిని తీసుకురావద్దని, వచ్చి ఇబ్బందులకు గురికావద్దని రాష్ట్ర కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి తన ప్రకటనలో వెల్లడించారు.

# పన్ను రేట్లు తగ్గినా తగ్గని జీఎస్టీ ఆదాయం

## అనూహ్యంగా పెరిగిన వసూళ్లు న- దేశంలోనే రెండో స్థానంలో తెలంగాణ

**హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త** జీఎస్టీ రేట్ల తగ్గింపుతో వస్తువుల ధరలు తగ్గినా, తెలంగాణలో పన్ను వసూళ్లు అనూహ్యంగా పెరిగాయి. అంచనాలను మించి 10 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీంతో పన్నుల వసూళ్లలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఈ సానుకూల వృద్ధి కేంద్ర బడ్జెట్ అంచనాలను మించే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇక సవరించిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల కారణంగా వస్తువుల ధరలు దిగివచ్చాయి. కొన్ని వస్తువులపై జీఎస్టీని పూర్తిగా తొలగించగా, మరికొన్నింటి శ్లాబులు తగ్గించారు. అయితే దీనివల్ల రాష్ట్రాలకు పన్నులు తగ్గుతాయని, ఫలితంగా నష్టాలు కూడా వచ్చే అవకాశం ఉందని తెలంగాణ సర్కార్‌తో సహా పలు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. వీటిలో వాస్తవాలు లేవని, జీఎస్టీ పన్ను రేట్లు తగ్గినా వసూళ్లు మాత్రం తగ్గట్లేదని తాజా గణాంకాలు వెల్లడించారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ వల్ల లబ్ధి పొందిన అతిపెద్ద రాష్ట్రాలలో తెలంగాణ ఒకటిగా నిలిచింది. తాజా నివేదిక ప్రకారం జీఎస్టీ వసూళ్లలో తెలంగాణ అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. జీఎస్టీ రేట్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఆదాయంలో 7 శాతం నష్టాన్ని అంచనా వేసిన తెలంగాణ రాష్ట్రం, దానికి భిన్నంగా 10 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత అక్టోబర్ నెలలో తెలంగాణ జీఎస్టీ ద్వారా రూ.5,726 కోట్లు వసూలు చేసింది. ఇది అంతకుముందు సంవత్సరం (2024 అక్టోబర్) వసూలు చేసిన రూ.5,211 కోట్లతో పోలిస్తే 10శాతం అధికం. జీఎస్టీ హేతుబద్ధీకరణతో రాష్ట్రం అంచనా వేసిన నెలవారీ రూ.583 కోట్ల నష్టానికి బదులు ఏకంగా రూ.783 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఈ లెక్కన ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ 8 నుండి 9 శాతం వార్షిక జీఎస్టీ వృద్ధి రేటును నమోదు చేసే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అంచనా వేసింది. కాగా పన్నుల ఆదాయంలో టాప్ రాష్ట్రాల జాబితాలో కర్ణాటక 10 శాతం వృద్ధితో అగ్రస్థానంలో నిలవగా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా తెలంగాణకు సమానంగా 8-9శాతం వృద్ధిని సాధిస్తుందని అంచనా. కర్ణాటక రాష్ట్రం నెలవారీ రూ.7,083 కోట్ల నష్టాన్ని అంచనా వేసినా అది కూడా 10శాతం వృద్ధిని చూసింది. పంజాబ్ 4 శాతం వృద్ధిని నమోదు చేసింది. పశ్చిమ బెంగాల్‌లో స్వల్పంగా 1 శాతం క్షీణత కనిపించగా, కేరళలో జీఎస్టీ ఆదాయం 2 శాతం తగ్గింది. కాగా జీఎస్టీ కౌన్సిల్ డేటా ప్రకారం ధరల సవరణల తర్వాత చాలా రాష్ట్రాలు సానుకూల వృద్ధిని కనబరిచాయి. దేశీయ జీఎస్టీ వసూళ్ల అంచనాల ఆధారంగా చూస్తే రాష్ట్రాలు గత నెల అక్టోబర్ లో చూపిన వృద్ధిని ఇలాగే కొనసాగిస్తే 2025-26 ఆర్థిక సంవత్సరానికి మొత్తం జీఎస్టీ ఆదాయాలు కేంద్ర బడ్జెట్‌లో అంచనా వేసిన ప్రొజెక్షన్లను మించిపోయే అవకాశం ఉందని నివేదిక స్పష్టంగా పేర్కొంది. గతంలో 2018 జూలై,

2019 అక్టోబర్ నెలల్లో జీఎస్టీ రేట్ల మార్పుల తర్వాత కూడా స్వల్ప సర్దుబాటు దశ అనంతరంఆదాయాలు నెలవారీ 56శాతం వృద్ధి చెందాయని నివేదిక గుర్తు చేసింది. ప్రస్తుత రేట్ల తగ్గింపు వల్ల స్వల్పకాలంలో 3-4 శాతం క్షీణత ఉన్నప్పటికీ మొత్తం జీఎస్టీ పన్ను పరిధిని బలోపేతం చేసిందని, భవిష్యత్తులో రాష్ట్రాల స్థిరమైన వృద్ధికి ఇది మార్గం సుగమం చేస్తుందని నివేదిక వెల్లడించింది.

# కార్తికపౌర్ణమి వేళ కపిలేశ్వరునికి అన్నాభిషేకం



**తిరుమల,నవంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతిలోని శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేళ కపిలేశ్వరునికి అన్నాభిషేకం జరిగింది. ఉదయం 2గంటలకు సుప్రభాతంతో మేల్కొలిపి అనంతరం అభిషేకం, అర్చన నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం 12గంటల నుండి 4గంటల వరకు ఏకాంతంగా అన్నాభిషేకం, దీపారాధన చేపట్టారు. సాయంత్రం భక్తులకు అన్నలింగ దర్శనం కల్పించారు. మళ్లీ సాయంత్రం ఏకాంతంగా అన్నలింగ ఉద్వాసన చేశారు. రాత్రి 7.30గంటల నుండి 8.30గంటల వరకు సుగందద్రవ్య అభిషేకం ఏకాంతంగా నిర్వహించడంతో కార్తీకపౌర్ణమి ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

# రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ'

**తిరుమల,నవంబర్ 5 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలోగానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు 7వతేదీ శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరగనుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

# గరుడసేవతో భక్తుల పులకింత



**తిరుమల,నవంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన కార్తీకమాసంలో కార్తీకపౌర్ణమి రోజు గరుద్మంతునిపై గరుడాద్రివాసుడు ఆలయ మాఢవీదుల్లో ఊరేగిభక్తులను కటాక్షించాడు. బుధవారం రాత్రి అత్యంత విశిష్టమైన, పౌర్ణమి సందర్భంగా గరుడసేవ జరిగింది. ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి సాయంత్రం నిత్యకైంకర్యాలు అనంతరం వాహనంమండపం వద్దకు వేంచేపుచేశారు. స్వామివారు లక్ష్మీకాసులహారం, పచ్చలహారం, మరిన్ని అమూల్యమైన ఆభరణాలు ధరించారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి వాహనాన్ని బయలుదేరించారు. గరుడునిపై మలయప్ప ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. 108 వైష్ణవ దివ్యదేశాలలో గరుడసేవకు ఎంతో ప్రాధాన్యత ఉంది. తిరుమలలో జరిగే గరుడసేవరోజు భక్తులు ఇష్టదైవాన్ని దర్శించుకుంటే తమ పాపాలు నశిస్తాయని, కష్టాలు తోలగిపోతాయని ప్రశస్తి.ఈ వాహనసేవలో టిటిడి ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ, ఆలయ పారుపత్తేదార్ హిమత్‌గిరి ,అర్చకులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు :ముఖేష్ కుమార్ మీనా

**విజయవాడ నవంబరు 5, ప్రభాతవార్తప్రతినిధి:** విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే వారిపై కఠిన చర్యలకు వెనుకాడబోమని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (సాధారణ పరిపాలన రాజకీయం, అబ్కారీ, గనులు ) ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. మంగళగిరి ఆబ్కారీ కమీషనర్ కార్యాలయంలో బుధవారం ఆయా జిల్లాల ఆబ్కారీ అధికారులు, అసిస్టెంట్, డిప్యూటీ కమిషనర్ల తో రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ములకల చెరువు వంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. నేరం జరిగిన సందర్భంలో పాటించాల్సిన సాధారణ ప్రోటోకాల్ ను అనుసరించక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపై రాష్ట్ర స్థాయిలో అబ్కారీ కమీషనర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ లు 15 రోజులకు ఒకసారి, ముఖ్య కార్యదర్శిగా తాను నెలకు ఒకసారి అన్ని విషయాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆబ్కారీ శాఖలో వ్యవస్థీకృత అవినీతి కథనాలు వస్తున్నాయని, ఏ ఒక్కరు అక్రమార్జనకు పాల్పడినా తీవ్ర పరిణామాలు.

# పార్టీ లైన్ దాటితే చర్యలు

## -ఇక ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలి

## - 15లోగా గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ కమిటీల వరకు నియామకాలు పూర్తి కావాలి

## - ఎపి టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు ఆదేశం



టెలీకాన్ఫరెన్స్‌లో టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 5:** నియోజకవర్గాల్లో సరిగా గ్రీవెన్స్ నిర్వహించడం లేదని, నాయకులు ప్రజల సమస్యలు సరైన రీతిలో పరిష్కరించి ఉంటే మంత్రి లోకేష్ 'ప్రజాదర్బార్' కు 4వేల మంది ఎందుకు వస్తారు? అని నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు మండిపడ్డారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పర్యటించిన ఆయన పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలతో ఆయన మాట్లాడుతూ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం ప్రతి నియోజకవర్గంలో గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఇక అదే రోజు స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని కోరారు. నవంబర్ 15వ తేది లోపు నియోజకవర్గ కమిటీల నుంచి గ్రామ స్థాయి కమిటీల వరకు పార్టీ నియామకాలు పూర్తి చేయాలని డెడ్ లైన్ విధించారు. 15వ తేది లోపు పూర్తి చేయలేకపోతే జాతీయ అధ్యక్షుడు ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించార తెలుగుదేశం పార్టీ అంటే ఒక సంస్క ృతి. క్రమశిక్షణకు మారు పేరు తెలుగుదేశం పార్టీ అని అన్నారు. కొందరి నాయకుల వలన పార్టీకి చెడ్డపేరు వస్తుందని, పార్టీ లైన్ దాటి వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అటువంటి నాయకులు వారి ప్రవర్తన మార్చుకోవాలని, మరలా పునరావృతం అయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో పార్టీ నాయకులు సఫలం కావాలి, దానికి తగ్గట్టు నియోజకవర్గాల్లో కార్యక్రమాల్లో నిర్వహిస్తూ.. క్యాడర్ ను కలుపుకుంటూ.. క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలని సూచించారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తుంది.. అందరూ సఖ్యతతో పనిచేయాలి.. సంయమనం పాటించండి.. సోషల్ మీడియాలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టండంతో పాటు వైసీపీ దుష్ప్రచారాలకు ప్రజలు ప్రభావితం కాకుండా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుచేశారు.

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పని చేయండని కోరారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో టిడిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, పార్లమెంట్, నియోజకవర్గ ఇంచార్జులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బిసిల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలి:కేసన శంకరరావు

**గుంటూరు విద్య, నవంబర్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా జనగణనతో పాటు సమగ్ర కుల గణనను శాస్త్రీయంగా నిర్వహించి, ఆపై జనాభా దామాషా మేరకు బీసీల రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. స్థానిక గుంటూరు చుట్టగుం లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశం లో ఆ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల9 న విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం లో ఉదయం 10 గంటల నుండి జరుగు రాష్ట్రస్థాయి విస్తృత సమావేశం,బీసీల అన్ని సమస్యలపై సమగ్రంగా చర్చిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ ఎన్నికల వాగ్దానాలైన ..చట్టసభల్లో 33 శాతం, స్థానిక సంస్థలలో 34 శాతం రిజర్వేషన్లు అమలు జరపాలన్నా,ముందుగా కుల గణన చేయడం తప్పనిసరన్నారు. బీసీలలో ఏఏ కులాలవారు ఎంతెంత మంది ఉన్నా రో తెలియకుండా,ఎవరికి ఎంతని రిజర్వేషన్లు అమలు చేయాలో తెలియదన్నారు. న్యాయ రాజ్యాంగపర ఆటంకాలు రాకుండా, డెడికేటెడ్ కమిషన్ ద్వారా సరైన ఏంపరికల్ డేటా తో సమగ్ర కుల గణన జరగాలన్నారు. బీసీ రిజర్వేషన్ల లో కూడా అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరగాలంటే ఏబిసిడిలుగా వర్గీకరించాల్సి ఉందన్నారు. సుప్రీం కోర్టు 50 శాతం పరిమితిని అధిగమించేలా మరో చట్టం చేయాల్సి ఉందన్నారు. అందుకు పార్లమెంటుచే రాజ్యాంగ సవరణలు చేయించి,బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగం షెడ్యూల్9 లో పెట్టించాలన్నారు. 2026 మార్చి కల్లా స్థానిక సంస్థల ఎన్నికల గడువు ముగుస్తున్నందున.

# స్వయంకృషి పట్టుదల ఉంటే..



నువ్వేమైనా సంపాదిస్తున్నావా? ఇంట్లో ఖాళీనేగా... చాలామంది గృహిణులు అనేక సందర్భాల్లో ఎదుర్కొనే మాటే ఇది. రితికా సింగ్కి ఆ ప్రశ్న ఎదురైంది. ఆ మాటకు బాధపడుతూ కూర్చోలేదామె. తనను తాను నిరూపించుకున్నారు. సీఓగా ఎదిగారు. ఆమె స్ఫూర్తిదాయక కథనమిది.

తండ్రి ఎయిర్‌ఫోర్స్ అధికారి, ఇంట్లో విపరీతమైన క్రమశిక్షణ. దీనికితోడు తండ్రి ఉద్యోగరీత్యా తరచూ ప్రాంతాలు మారాల్సి వస్తుంది. దీంతో రితికకి స్నేహితులే ఉండేవారు కాదు. పుస్తకాలతోనే సావాసం చేసేవారు. ఈమెది చండీగఢ్. తండ్రి యుద్ధంలో మరణించాక మరింత ఒంటరిగా రితిక. అప్పటికి ఆమెకు 15 ఏళ్లు. ఆ బాధనుంచి బయటపడటానికి చదువుపై దృష్టి పెట్టారు. లిటరేచర్లో ఇంగ్లీష్ మాస్టర్స్ చేశారు. వెంటనే పెళ్లి, ఇద్దరు పిల్లలు. కొన్నేళ్లు గృహిణిగానే మిగిలిపోయారు. ఓరోజు కుటుంబమంతా ఎక్కడికో వెళ్తూ సర్దడం, వంట వంటి పనులన్నీ ఆమెకే అప్పగించారు. ఒక్కదానికే కష్టమంటే ఖిసంపాదన ఖాళీగా ఉన్నావంటూ మాట్లాడారు. ఆ మాటలు ఆమె మనసుని గాయపరిచాయి. దీంతో ఉద్యోగం సంపాదించి అందులో చేరారు రితిక ఆదామెలో ఆత్మవిశ్వాసం నింపింది. ఇంతలో భర్త నుంచి పొరపొచ్చాలు వచ్చాయి. ఒంటరిగా పిల్లల్ని పెంచాల్సిన పరిస్థితి. ఇంట్లో ఉంటూ కంటెంట్ రైటర్ ఫ్రీలాన్సర్గా మారారు. అప్పుడే ఆమెకు వ్యాపారం మొదలు పెట్టాలి అనిపించింది. అలా 2013లో ఖికంటెంట్ ఫ్యాక్టరీఖి. బ్రాండ్ స్ట్రాటజీ, సంస్థలకు సోషల్మీడియా పేజీలు, వెబ్‌సైట్‌లను నిర్వహించడం, ఈమెయిల్ మార్కెటింగ్ వంటివెన్నో సేవలు అందిస్తోంది. వేల సంస్థలతో కలిసి పనిచేసింది. ప్రపంచవ్యాప్తంగా 25 రకాల పరిశ్రమలతో పనిచేస్తోంది. ఖితొలిరోజుల్లో ఆన్‌లైన్ సేవలు, కనీసం ఎవరైనా ఆఫీస్ లేరని చాలామంది అనుమానిస్తున్నారు. అవకాశం ఇవ్వడానికి సంకోచించేవారు. అయినా కుంగిపోకుండా ప్రయత్నించా. ఇప్పుడు చాలా పెద్ద సంస్థలు మా కస్టమర్‌లుఖి రితిక అంటారు. తన సంస్థలో కీలక పదవుల్లో ఉన్నదంతా మహిళలే. గృహిణులు, తల్లులకు అవకాశాలిస్తూ వాళ్ల అభివృద్ధికీ సాయపడుతున్నారామె. టీఐఐకి జనరల్ సెక్రటరీ, ఇండియన్ విమెన్ నెట్‌వర్క్, చండీగఢ్కి చైర్మన్ కూడా. టెడెక్స్ వేదికల మీద స్ఫూర్తి పాఠాలూ చెబుతుంటారు. ఈమె ప్రయాణం... స్వయంకృషి, పట్టుదల ఉంటే ఎవరైనా సాధించగలరనడానికి నిదర్శనం... కదూ!

# వ్యథ

# పెళ్లికి ఉల్లి, వెల్లుల్లికి సంబంధం లేదు !

ప్రశ్న: మా అమ్మ చాదస్తం వల్ల మా చెల్లికి పెళ్ళి కావడం లేదు. ఆమెకు 31 సంవత్సరాలు పూర్తి అయ్యాయి. చెన్నైలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తోంది. అయినా పెళ్ళికాక, తోడు లేక బాధ పడుతున్నది. కొన్నాళ్ళకు డిప్రెషన్‌లోకి వెళ్ళేలా కనిపిస్తోంది. చెల్లికి కుజ దోషం ఉన్నందున చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నది. జాతకాలు కుదరలేదని కొన్ని సంబంధాలు తిరస్కరించింది. అబ్బాయికి తండ్రి ఉన్నాడని కొన్నింటిని వద్దని చెప్పింది. ఆస్తిలేదని, జీతం తక్కువని, ఉద్యోగం లేదని ఏదో ఒక కారణం చెప్పి సంబంధాలు తప్పించి వేస్తోంది. ఇప్పుడు ఎవరో జ్యోతిష్యుని మాట విని ఉల్లి పాయలు, వెల్లుల్లి తినకూడదని చెల్లిపై నిషేధం విధించింది. దాదాపు ఐదేళ్లుగా తిరగని గుడి, చేయని పూజ లేదు. మా అమ్మ ఇంటర్ చదివింది. నాన్న డిగ్రీ చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. మేము ముగ్గురం ఆడ పిల్లలం. నేను పెద్దదాన్ని, బిటెక్ చదివి ఉద్యోగం చేస్తున్నాను. నాకు నచ్చిన ఒక అబ్బాయి జాతకం మార్పించి మా అమ్మను నమ్మించి పెళ్ళి చేసుకున్నాను. నాకు ఇద్దరు అబ్బాయిలు పుట్టారు. మా వారు మంచి వ్యాపార వేత్తగా ఎదుగుతున్నారు. పెద్ద చెల్లెలు జాతకాలు సరిపోవడంతో పెళ్లి చేసుకుంది. ఆమెకు ఒక ఆడ పిల్ల పుట్టింది. వారికి కొంత అప్పులు, సమస్యలు ఉన్నాయి. నేను, మా నాన్న, బంధువులు ఎవరు ఎన్ని చెప్పినా మా అమ్మ వినడం లేదు. ఆమెను మార్చే మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, విశాఖపట్నం**




**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**జవాబు :** మీ అమ్మ అతి జాగ్రత్త పాటిస్తున్నట్టు అర్థం అవుతోంది. దీర్ఘకాలం ఒత్తిడి, సమస్యలకు గురయిన వారిలో మూఢ విశ్వాసాలు బలపడ తాయి. ఆమె చిన్న చిన్న కూతురిపై అమితమైన ప్రేమతో అతిగా ఆలోచిస్తోంది. మన సమాజంలో కొందరు జాతకులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అది వారి నమ్మకం, విశ్వాసం అనడంలో సందేహం లేదు. అయితే వివాహ బంధం బలపడటానికి భార్యా భర్తల ఆలోచనలు, ప్రవర్తన, సర్దుబాటు, ప్రేమ, అనురాగం ముఖ్యం. జాతకాలు కలసినంత మాత్రాన జీవితం బాగుంటుందన్న గ్యారంటీ లేదు. కుజ దోషానికి శాస్త్రీయత లేదు. మీ అమ్మను చులకనగా చూడకుండా ఫ్యామిలీ కౌన్సిలర్ ద్వారా ఆమెలో వివేకం కలిగించే ప్రయత్నం చేయండి. పెళ్లిలో జాతకాల ప్రభావం ఏమీ ఉండదన్న శాస్త్రీయ దృక్పథం కలిగించండి. దీనికి తగిన ఉదాహరణలు చూపి అర్థం అయ్యేలే చెప్పండి. పెళ్లి కాక పోవడానికి ఉల్లి, వెల్లుల్లికి సంబంధం ఉండదన్న విషయం వివరించండి. తల్లి, తండ్రి లేని అబ్బాయిలంటే ఉన్న వారికి కలిగే ప్రయోజనాలు వివరించండి. ఆమెలో ఏవైనా మానసిక సమస్యలు ఉన్నాయేమో గమనించండి. ఇలాంటి వారిలో ఆలోచనా పరమైన అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ ఉండే అవకాశం ఉంది. ఫ్యామిలీ కౌన్సిలర్ అన్నీ పరిశీలించి ప్రవర్తనలో మార్పు తీసుకుని రావడానికి ప్రయత్నిస్తారు.



# ఉన్నది చాలును..



ఒకసారి బొంబాయి నుండి మే, 1917లో కాకా సాహెబ్ దీక్షిత్, తన భార్య షిరిడీలోని సాయి సన్నిధికి వెళుతు న్నారని తెలుసుకున్న సాయి శరణానంద రైల్వేస్టేషన్‌కు వెళ్లి వారి ద్వారా సాయికి పూల మాల, పండ్లు, కొంత దక్షిణ పంపదలచి తన బావతో స్టేషన్‌కు వెళ్లాడు. ఆయన మనసంతా ఆధ్యాత్మిక విషయాలతోనే నిండిపోయింది. తానే స్వమయంగా వెళ్లి, సాయిబాబాకు సమర్పిస్తే బాగుండును అనిపించింది. సాయిబాబాకు అర్పించిన వెంటనే తిరిగి రావచ్చనే ఆలోచనతో, వారితో షిరిడీకి బయలు దేరాడు. కాని, ఆయన చాల రోజులు సాయి సన్నిధిలో ఉండిపోయాడు. ఇక బయలుదేరదామనే సంకల్పం సాయి భక్తులు చేసుకోలేరు. నిర్ణయించేది సాయియే. ఆయన అలా షిరిడీలో 21 రోజులు ఉన్నాడు. ఆ సమయంలో అనేక అమూల్య అనుభవాలను సాయి కలిగించారు సాయి శరణానందకు. అందులో ఒక అనుభవం: ఒకసారి సాయి శరనానంద శనగపప్పు, మసాలా, కొబ్బరి మొదలైన వాటితో చేసిన పచ్చడి తిన్నారు. అది చాలా కారంగా ఉంది. అందువలన ఆయన శరీరంలో వికారం కలిగి, అది వమనం ద్వారా బయటకు వెళ్లిపోయింది. మరునాడు సాయి దర్శనానికి వెళ్ళగా ఏ వస్తువు మన వాటాలో లేదో, దాన్ని తింటే ఇలాగే తెరలు, తెరలుగా బయటకు వస్తుంది అన్నారు సాయి. మనది ఏదో మన వద్దనే ఉంటుంది. మనది కానిది మన నుంచి దూరంగా వెళ్లిపోతుంది. ఇది ఆహారానికే పరిమితం కాదు. అన్నిటికి వర్తించే సూత్రం. ఈ సూత్రం గ్రహిస్తే, ఉన్నది పోతుందే మోనన్న భయము, అనుకున్నది రాదేమో అనే ఆందో ళన కలుగవు. దీనినే సాయి శ్యామారావ్ జయకర్‌కు కూడా తెలిపారు అనుభవం ద్వారా. ఒకసారి జయకర్ ఒక మహమ్మదీయ స్త్రీకి నాలుగు వేల రూపాయ లిచ్చాడు అప్పుగా, ఎంతకూ ఆమె ఆ డబ్బును ఇవ్వటం లేదు. బాబాను అడిగారాయన పాపిష్టి సొమ్ము కొరకు కష్టపడనేల అన్నారు సాయి. ఆయనకు సాయి మాటలు అర్థం కాలేదు. 2,3 సంవత్సరాలు గడిచాయి. ఆమె సంపదంతా పోగొట్టుకుంది. అప్పుడు అర్థమైంది జయ కర్‌కు. తాను ఒకవేళ ఆ సొమ్మును పొందినా, అది తన వద్ద నిలవదని. ఉన్నదానితో సంతృప్తి చెందితే చాలు అనేది సాయి బోధ.

# ప్లాస్టిక్‌తో ముప్పు

ప్లాస్టిక్ వినియోగం విషయంలో చాలామందికి ఈ సందేహం ఉంటుంది. ప్లాస్టిక్, క్యాన్సర్ మధ్య గల సంబంధాన్ని పరిశీలిస్తే.. ప్లాస్టిక్ తయారీ వాడే రసాయన సమ్మేళనాలు ఇందుకు కారణమవుతుంటాయి. ప్లాస్టిక్ తయారీ పరిశ్రమల్లో ఈ సమ్మేళనాలు గ్యాస్ రూపంలో బయటకు వస్తాయి. వాటిని పీల్చినప్పుడు కొంత ప్లాస్టిక్ కరిగి జీర్ణకోశంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. కాబట్టి, ఫుడ్ గ్రేడ్ కాని ప్లాస్టిక్ వస్తువుల్లో వేడి పదార్థాలను పెట్టకపోవడం, అవెన్‌లో పెట్టి వేడి చేయకపోవడం, అలాంటి వస్తువులను వాడకపోవడం మంచిది.



అలాగే క్యాన్సర్‌ను కారణమయ్యే రసాయనాలను విడుదల చేసే పరిశ్రమలకు దూరంగా ఉండడం అన్ని రకాలుగానూ మంచిది. ఏ రకంగా ఇనా సర్వే ప్లాస్టిక్ వినియోగానికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉన్నప్పుడే ఇటు క్యాన్సర్ అటు ఇతర ఆర్యోగాల ముప్పును తగ్గించు కోవచ్చు.

# ఆఫీసులో నిద్రా?



**కొంతమంది ఉద్యోగినులకు ఆఫీసుకెళ్లగానే నిద్ర ముంచుకొస్తుంది. ఇంకొందరికేమో కాస్త అన్నం తినగానే ఆవలింతలు మొదలై పోతాయి. ఎందుకిలా?**

దీనెలా అదుపు చేసుకోవాలి. మధ్యాహ్న భోజనం తరవాత శరీరంలో ఇన్సులిన్ స్థాయి పెరిగి రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువవుతాయి. ఇది నిద్రపోయే హార్మోన్లు సెరటోనిన్, మెలటోనిన్‌ను పెంచుతుంది. దీంతో కాస్త మగతగా నిపిస్తుంది. ఇలాంటప్పుడు తిన్న వెంటనే పనిలో పడిపోకుండా. కాసేపు అంటూ ఇటూ నడవండి లేదా మెట్లెక్కి దిగండి.

★ శరీరానికి తగినన్ని నీళ్లు అందనప్పుడు అలసటకు గురవుతుంది. ఇది నిద్రకూ కారణం అవ్వొచ్చు. ఎప్పుడైనా కళ్లు మూతలు పడుతున్నా యంటే ఓ గ్లాసు వాటర్ తాగి చూడండి. ★ మీరు శక్తినిచ్చే ఆహారం తీసుకోకపోయినా నిద్ర ముంచుకొస్తున్నట్లు అనిపిస్తుంది. సాయంత్రం అయ్యేసరికి ఈ సమస్య ఎదురవుతుంటే మీరు నిససత్తువతో ఉన్నట్లే. ఈ పరిస్థితి అదుపులోకి రావాలంటే గుప్పెడు నట్స్, సీడ్స్‌ని డబ్బాలో వేసుకుని వెంట తీసుకెళ్లండి. మీకు తీసుకునే ఆహారంలో ఇనుము, ప్రొటీన్లు పిండిపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచేవే. ★ పగటి పూట నిద్ర వెంటాడటానికి మరో కారణం రాత్రిళ్లు మీరు గాఢ నిద్ర లేకపోవడమే. ఇందుకు పనివేళలు, గ్యాడ్జెట్స్ కారణం ఏదైనా సరే.. వాటిని నియంత్రించుకోండి. కనీసం ఆరుగంటలైనా కలత నిద్రలేకుండా చూసుకోండి. ఇది మీ సమస్యను అదుపులో ఉంచుతుంది.

# ‘శివ’ రీ రిలీజ్ ట్రైలర్ లాంచ్



తిరగరాస్తూ ఇండియన్ సినిమాను ‘బిఫోర్ శివ’, ‘ఆఫ్టర్ శివ’గా రీడిఫైన్ చేసింది. రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో 1989లో విడుదలైన శివ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో నిర్మాతలు అక్కినేని వెంకట్ సురేంద్ర యార్లగడ్డ నిర్మించారు. అన్నపూర్ణ స్టూడియోస్ 50 ఇయర్స్ సందర్భంగా శివ చిత్రాన్ని 4కె డాల్బీ అట్మాస్ లో నవంబర్ 14న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఫ్యాన్స్ సమక్షంలో శివ రీరిలీజ్ ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో కింగ్ నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పాల్గొన్నారు. అద్భుతమైన 4కె విజువల్స్, డాల్బీ అట్మాస్ సౌండ్ తో ట్రైలర్ అదిరిపోయింది. ప్రతి సీన్‌లో టెన్షన్, ఎమోషన్ ఆడియన్స్‌ని కట్టిపడేసింది. ట్రైలర్ చివర్లో నాగర్జున సైకిల్ చైన్ లాగిన సీన్ గూస్బంప్స్ క్రియేట్ చేసింది. శివ మ్యాజిక్ ని 4కె డాల్బీ అట్మాస్ లో థియేటర్స్‌లో చూడాలనే ఎక్సయిట్మెంట్ ట్రైలర్ మరింతగా పెంచింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ... ఎంతో ప్రేమతో వచ్చిన మీ అందరికీ థాంక్యూ. ఈ సినిమాని మీ నాన్నగారు, అమ్మగారు థియేటర్స్‌లో చూసుంటారు వాళ్ళందరికీ థాంక్యూ. ఇప్పుడు అదే ప్రేమతో మీరు వచ్చారు. మీకు థాంక్యూ. డైరెక్టర్ రాంగోపాల్ వర్మ మాట్లాడుతూ.. అందరికీ హాయ్. 36 ఏళ్ల క్రితం తీసిన ఈ సినిమా.. 36 ఏళ్ల తర్వాత మా ఇద్దరం కూడా ఒకే స్టేజ్ పై ఇలా మీ ముందు రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లడతామని నేను ఎప్పుడూ కూడా ఊహించలేదు. ఇది వెరీ గ్రేట్ ఫీలింగ్. ఆరోజు నాగర్జున నాకు విజువల్‌గా సౌండ్ పరంగా చాలా క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఈ రోజు కూడా అంతే ఫ్రీడమ్ ఇచ్చారు. రీ రిలీజ్ కోసం సౌండ్ ని చాలా బెటర్‌గా డిజైన్ చేశాం.

‘శివ’డాల్బీ అట్మాస్ సౌండ్ తో స్టన్నింగ్ గా అనిపించింది. నవంబర్ 14న థియేటర్స్‌లో మైండ్ బ్లోయింగ్ ఎక్స్ పీరియన్స్ ఉంటుంది: శివ రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో కింగ్ నాగార్జున చిరంజీవి గారు చెప్పినట్టు సినిమా ఉన్నంతవరకు శివ చిరంజీవిలా చిరస్మరణీయం: డైరెక్టర్ రాంగోపాల్ వర్మకింగ్ నాగార్జున ఆల్ టైం కల్ట్ క్లాసిక్ ‘శివ’ బాక్సాఫీసు రికార్డులుని

# ‘శంబాల’ ఏ ఒక్కరినీ నిరాశపర్చదు: ఆది

వెర్సటైల్ హీరో ఆది సాయి కుమార్ నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ ‘శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్ ట్రైలర్ ఒక్కసారిగా అంచనాల్ని పెంచేసిన సంగతి తెలిసిందే. .హీరో ఆది సాయి కుమార్ మాట్లాడుతూ.. .. మా టీజర్‌ను రిలీజ్ చేసిన దుల్కర్ గారికి, మాకు సపోర్ట్ చేసిన థమన్, నా స్నేహితుడు సందీప్ కిషన్, ట్రైలర్ రిలీజ్ చేసిన డార్లింగ్ ప్రభాస్ గారికి థాంక్స్. మా ప్రమోషనల్ కంటెంట్‌కు అన్ని చోట్లా పాజిటివ్ రెస్పాన్స్ వస్తుండటం ఆనందంగా ఉంది. మేం సినిమా మీద బజ్‌ను క్రియేట్ చేసే క్రమంలోనే ట్రైలర్‌ను ఇంత త్వరగా రిలీజ్ చేశాం. ప్రభాస్ ఫ్యాన్స్, సినీ లవర్స్ అందరూ కూడా మా ట్రైలర్‌ను మెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో మాకు సహకరించిన వంశీ, ప్రమోద్, ప్రసాద్ అన్నలకు థాంక్స్. ట్రైలర్ చూసి కిరణ్ అబ్బవరం అభినందించారు. రానా కూడా మా ట్రైలర్ చూసి మెచ్చుకున్నారు. ఈ మూవీకి తనవంతు సాయం చేస్తానని రానా మాటిచ్చారు. హిందీ రిలీజ్ గురించి కూడా అందరూ అడుగుతున్నారు. మీడియా నుంచి కూడా మాకు మంచి సపోర్ట్ లభిస్తోంది.



# తెర

## సంతృప్తిని ఇచ్చింది “ది గర్ల్ ఫ్రెండ్‘ : అల్లు అరవింద్..



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షి త్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా “ది గర్ల్ ఫ్రెండ్“. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ నిర్మాతగా ఎన్నో సినిమాలు చేశాను, చేస్తున్నాను. సినిమాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించాను. అందులో దాపరికం లేదు. అయితే “ది గర్ల్ ఫ్రెండ్“ సినిమా ద్వారా నేను సంపాదించాలనుకున్నది డబ్బు కాదు. సంతృప్తి. ఈ సినిమా నిర్మించాననే విషయం ఎంతో సంతృప్తినిస్తోంది. మనకు తెలిసిన కొన్ని చెప్పలేని నిజాలను సినిమా మాధ్యమం ద్వారా చెప్పాలి అనే ఫీల్ ఈ కథ విన్నప్పుడు కలిగింది. రాహుల్ లాంటి సున్నిత మనస్కుడు, కమిటెడ్ పర్సన్ మాత్రమే ఇలాంటి సినిమాను రూపొందించగలరు. ఆయన కథ చెబుతున్నప్పుడు ఎంత ఉద్వేగంతో చెప్పారో, సినిమాను కూడా అంతే బాగా తెరకెక్కించారు. ఎన్ని పాటలున్నాయి, ఎన్ని జోక్స్ ఉన్నాయి, ఎంత ఎంటర్ టైన్ మెంట్ ఉంది అని చూసే సినిమా కాదిది. అలా చూస్తే ఈ సినిమా చేయలేం. మన అక్క, చెల్లి, పిన్ని వాళ్ల మనసుల్లో ఏముంటుంది, ఎలాంటి కోర్కెలు ఉంటాయి అనుకుని మూవీ చూడాలి. ది గర్ల్ ఫ్రెండ్ కాకుండా మరో టైటిల్ ఈ సినిమాకు చెప్పమంటే నీ జీవితమంతా నేనే అని చెప్పాలి. అమ్మాయి అబ్బాయి తమ జీవిత భాగస్వామి గురించి ఇలాగే అనుకుంటూ అతి సున్నితంగా సాగే ఈ సినిమా చివరకు అతి ఘాటుగా ముగుస్తుంది. ఈ సినిమా చూశాక చాలామంది ఆ రాత్రి నిద్రపోరు. అంతగా ఈ మూవీ వారిని వెంబడిస్తుంది. ప్రతి ఫ్యామిలీలో ప్రతి పర్సన్

## ‘జిగ్రీస్’ మీరేలే సాంగ్ లాంచ్




కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో మౌంట్ మెరు పిక్చర్స్ నిర్మిస్తున్న యూత్‌ఫుల్ క్రేజీ ఎంటర్‌టైనర్ “జిగ్రీస్”. హరిష్ రెడ్డి ఉప్పుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి కృష్ణ వోడపల్లి నిర్మాత. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ తాజాగా మీరేలే సాంగ్ లాంచ్ చేశారు. సయ్యద్ కమ్రాన్ ఈ సాంగ్ ని ఫ్రెండ్ షిప్ మెలోడీగా కంపోజ్ చేశారు. హరీష్ రెడ్డి ఉప్పుల రాసిన లిరిక్స్ ఫ్రెండ్స్ మధ్య ఎమోషన్ ప్రజెంట్ చేశాయి. ఏక్‌నాథ్ వోకల్స్ సాంగ్‌ని మరింత టచ్చింగ్ గా మార్చింది. ఈ సాంగ్ ఇన్సంట్ గా అందరికీ కనెక్ట్ అవుతుంది. జిగ్రీస్ ఫ్రెండ్షిప్, క్రేజీ అడ్వెంచర్స్, హిలేరియస్ రోడ్ ట్రిప్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందిఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. ఈశ్వరాదిత్య డీవోపీ, కమ్రాన్ మ్యూజిక్, చాణక్య రెడ్డి ఎడిటర్. జిగ్రీస్ నవంబర్ 14న వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. నటీనటులు: కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ, మణి వక్కా, రామ్ నితిన్ స్క్రీన్‌ప్లే దర్శకత్వం: హరిష్ రెడ్డి ఉప్పుల నిర్మాత: కృష్ణ వోడపల్లి, డీవోపీ: ఈశ్వరాదిత్య ఎడిటర్: చాణక్య రెడ్డి, సంగీతం: కమ్రాన్, సౌండ్ డిజైన్: వి. స్వాప్నిక్ రావు పీఆర్వో: వంశీశేఖర్

# జటాధర వండర్‌ఫుల్ సినిమా :

## ప్రేరణ అరోరా



నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్, నిఖిల్ నందా నిర్మించారు. ఈ సందర్భంగా నిర్మాత ప్రేరణ అరోరా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**జటాధర సినిమా జర్నీ ఎలా మొదలైంది?**

తెలుగులో సినిమా చేయాలనేది ఎప్పటినుంచో నా కల. తెలుగు సినిమా, తెలుగు కల్చర్ అంటే చాలా ఇష్టం. నేను హిందీలో సినిమాలో చేస్తున్నప్పటికీ తెలుగు సినిమా అంటే నాకు చాలా ఇన్స్పిరేషన్. రామ్ చరణ్ గారి ఆరెంజ్ సినిమా చూశాను. అప్పటి నుంచి నాకు తెలుగు సినిమా పట్ల చాలా పాషన్ వచ్చింది. తెలుగు సినిమాలు చాలా అద్భుతంగా ఉంటాయి. కమర్షియల్, మాస్, హ్యాపీ, ఫ్యామిలీ అన్ని ఎమోషన్స్ తో సినిమాలు వస్తుంటాయి. తెలుగు సినిమా చాలా గొప్ప సినిమాలని ఇండియన్ సినిమాకి అందించింది.

**సుధీర్ సుధీర్ బాబు గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

సుధీర్ బాబు గారంటే నాకు చాలా అభిమానం. ఆయన సినిమాలు చూస్తుంటాను. నేను తెలుగులో చేసిన మొదటి సినిమా ఆయనతో చేయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆయన చాలా హార్డ్ వర్క్ చేస్తారు. చాలా పాషన్ తో వర్క్ చేశారు. ఇందులో చాలా చాలెంజింగ్‌గా అనిపించే సీక్వెన్స్ లో ఉన్నాయి.

**సోనాక్షి సిన్హా గారు ఈ కథ విన్నప్పుడు ఎలా రియాక్ట్ అయ్యారు?**

ఈ సినిమా కథ విన్నప్పుడే దీన్ని హిందీలో కూడా చేయాలని నిర్ణయించుకున్నాను. సోనాక్షి సిన్హా గారు నాకు ముందే తెలుసు. ఆమె అద్భుతమైన పెర్ఫార్మర్. ధన పిశాచి క్యారెక్టర్ కి సోనాక్షి పర్ఫెక్ట్. చాలా మెమొరబుల్ క్యారెక్టర్ అవుతుంది. తప్పకుండా ఆడియన్స్‌కి గ్రేట్ థియేటర్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది.

షూటింగ్ ముందు చాలా ప్రిపరేషన్ ఉండేది. సుధీర్ బాబు గారితో సోనాక్షికి చాలా హెవీ యాక్షన్ సీక్వెన్స్ లో ఉన్నాయి. అవన్నీ కూడా ప్రేక్షకుల్ని అలరిస్తాయి.

**కథలో అనంత పద్మనాభస్వామి ఆలయానికి సంబంధించిన స్ఫూర్తి ఉందా?**

మైథలాజికల్ స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది. అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నాగబంధం గురించి తెలిసే ఉంటుంది. నేను పురాణాలని చదువుతాను. శ్రీ వెంకటేశ్వర స్వామి నాకు ఇష్ట దైవము. పద్మనాభ స్వామి టెంపుల్ ఇన్స్పిరేషన్ ఇందులో ఉంటుంది. ధన పిశాచి కి సంబంధించి ఎలిమెంట్స్ ఆడియన్స్ ని చాలా సర్ప్రైజ్ చేస్తాయి. ఈ సినిమాలో డివైన్ ఎలిమెంట్స్ బ్లాక్ మ్యాజిక్ లాంటి ఎక్సైటింగ్ ఎలిమెంట్స్ వున్నాయి.

**శిల్పా శిరోద్కర్ గారికి గురించి?**

శిల్పా శిరోద్కర్ గారు బిగ్ బాస్ లోకివెళ్లే సమయంలో కలిసాను. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఈ క్యారెక్టర్ గురించి చెప్పాను. తన పెర్ఫార్మన్స్ ఈ సినిమాలోచాలా స్పెషల్‌గా ఉండబోతుంది . ఆ క్యారెక్టర్ లో చాలా ఎమోషన్స్ ఉంటాయి.మేము మరో తెలుగు సినిమా కూడా మేము చేయబోతున్నాం. పెద్ద హీరోతో ఆ సినిమా చేస్తున్నాం. త్వరలోనే ఆ సినిమా వివరాలు కూడా తెలియజేస్తాం.

### ఫిడే ప్రపంచ కప్..
# తొలి గేమ్ గెలిచిన అర్జున్, ప్రణవ్




**న్యూఢిల్లీ:** ఫిడే ప్రపంచ కప్ 2025లో నాల్గవ రోజున భారత ఆటగాళ్లకు మిశ్రమ స్పందన లభించింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్ వి ప్రణవ్, గ్రాండ్ మాస్టర్ ఎరిగాసి అర్జున్ వరుస విజయాలు నమోదు చేశారు. గోవాలో జరిగిన రెండవ రౌండ్ ప్రారంభ ఆటలో టాప్ సీడ్ గుకేష్, గ్రాండ్ మాస్టర్ విదిత్, ఆర్ ప్రజ్ఞానంద డ్రాగా ముగిశారు. ఇద్దరు యువ తారల మధ్య జరిగిన పోరులో ప్రణవ్ నార్వేకు చెందిన గ్రాండ్ మాస్టర్ ఆర్యన్ తారిని 41 ఎత్తుగడలలో ఓడించగా, అర్జున్ బల్గేరియాకు చెందిన మార్టిన్ పెట్రోవ్‌ను 37 ఎత్తుగడలలో ఓడించాడు. అలాగే ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ కజకిస్తాన్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్ కాజిబెక్ నోగర్‌బెక్‌తో డ్రా చేసుకోవడంతో తన ప్రచారాన్ని నిరాశపరిచాడు. అర్జెంటీనా ప్రాడిజీ ఐఎం ఫాస్టినో ఓరోతో జరిగిన మ్యాచ్‌లో విదిత్ తన సమయ ఒత్తిడిని అధిగమించి పాయింట్లను విభజించుకున్నాడు. విదిత్ 11 కదలికల తర్వాత 31 ఏళ్ల ఓరో కేవలం 38 నిమిషాలు మాత్రమే మిగిలి ఉన్నాడు.

ఓరో తన రూక్‌ను అటాకింగ్ లైన్ నుండి దూరంగా తరలించడం ద్వారా ప్రయత్నించాడు ఇక విదిత్ 28 కదలికల తర్వాత పునరావృతం ద్వారా డ్రా చేసుకోవడానికి అవకాశం ఇచ్చాడు.

# నేడు ఆస్ట్రేలియాతో నాలుగో టి20
### సిరీస్ కోసం అమీతుమీకి భారత్ సిద్ధం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచిన భారత జట్టు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీ, గురువారం గోల్డ్ కోస్ట్ వేదికగా జరిగే నాలుగో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. మూడో టీ20లో అద్వితీయమైన ప్రదర్శనతో 5 వికెట్ల తేడాతో గెలుపొందిందిన భారత్ అదే జోరును నాలుగో టీ20లోనూ కొనసాగించాలనుకుంటుంది. మరోవైపు ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌పై పట్టు సాధించాలని ఆసీస్ భావిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక ఈ సిరీస్‌లో కాన్‌బెర్రా వేదికగా జరిగిన తొలి టీ20 వర్షంతో రద్దయ్యింది. రెండు, మూడో టీ20కి వర్షం ముప్పు పొంచి ఉందని వార్తలు వచ్చినా మ్యాచ్‌లు సజావుగానే సాగాయి. ఈ క్రమంలోనే నాలుగో




టీ20కి ఆతిథ్యం ఇచ్చే గోల్డ్ కాస్ట్ వాతావరణం ఎలా ఉందనేది ఇప్పుడ చర్చనీయాంశమైంది. అయితే నాలుగో టీ20కి ఎలాంటి వర్షం ముప్పు లేదు. పూర్తిగా ఎండ కొట్టనుంది. మ్యాచ్ సమయంలో మాత్రం ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోనున్నాయి. ఇక గోల్డ్ కోస్ట్‌లో బిల్ పిప్పెన్ ఓవల్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. బంతి మంచిగా బౌన్స్ అవుతుంది. ఈ పిచ్ ఆరంభంలో బౌలర్లకు కాస్త సహకరించినా, మిడిల్ ఓవర్లలో మాత్రం ప్రతికూలంగా మారుతుంది. ఇక్కడ టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే ఛాన్స్ ఉంది. కాగా భారత్ జట్టులో శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ (కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా ఉండే అవకాశాలు ఉన్నాయి.

### అంతర్జాతీయ వన్డేలో సచిన్, మిథాలీ
# రికార్డు రన్స్
### పురుషులు, మహిళా విభాగాల్లో భారత్ విక్టరీ




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రికార్డు భారత్‌కే దక్కింది. పురుషుల, మహిళల విభాగాలలో ఒకే దేశానికి చెందిన ఆటగాళ్ల పేరు మీద ఉండటం భారత క్రికెట్‌కు గర్వకారణం. దిగ్గజ క్రికెటర్, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పురుషుల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా ఉన్నారు. అలాగే భారత మహిళా క్రికెట్‌కు విశేష సేవలందించిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ మహిళల వన్డే క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన ప్రపంచ రికార్డును కలిగి ఉండి ఈ ఇరువురు అరుదైన ఘనతను సాధించారు. పురుషుల విభాగంలో సచిన్ 18,426 పరుగులు, మహిళల విభాగంలో మిధాలీ రాజ్ 7,805 పరుగులు చేసి తమ తమ విభాగాలలో అగ్రస్థానంలో నిలిచారు. సచిన్ టెండూల్కర్ తన 24 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 463 వన్డే మ్యాచ్‌లు ఆడి, ఏకంగా 18,426 పరుగులు సాధించాడు. ఇది పురుషుల వన్డే క్రికెట్‌లో ప్రపంచ రికార్డు. ఆయన తన కెరీర్‌లో 49 సెంచరీలు, 96 హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. అంతేకాక, వన్డే చరిత్రలో మొదటి డబుల్ సెంచరీ (200 నాటౌట్) చేసిన పురుష క్రికెటర్ కూడా సచినే. ఆయన 2010లో దక్షిణాఫ్రికాపై గ్వాలియర్‌లో ఈ ఘనత సాధించాడు. సచిన్ ఆట ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యువకులకు ప్రేరణగా నిలిచింది. అలాగే లేడీ టెండూల్కర్ గా ప్రసిద్ధి చెందిన మిథాలీ రాజ్, 1999 నుంచి 2022 వరకు సాగిన తన సుదీర్ఘ కెరీర్‌లో 211 ఇన్నింగ్స్‌లలో 50.68 సగటుతో మొత్తం 7,805 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డే క్రికెట్‌లో ప్రపంచ రికార్డు. ఆమె తన ఖాతాలో 7 సెంచరీలు, 64 హాఫ్ సెంచరీలు నమోదు చేసుకుంది. మిథాలీ అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లు (టెస్ట్, ఒడిఐ, టీ20) కలిపి భారత్ తరఫున 10,868 పరుగులు చేసి, ఆల్‌టైమ్ లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచింది. ఆమె రిటైర్మెంట్ తర్వాత కూడా, ఆమె వారసత్వం కొత్త తరానికి స్ఫూర్తినిస్తోంది. ఇక భారత మహిళల జట్టు 2025లో తొలిసారిగా ప్రపంచకప్ గెలిచింది. ప్రస్తుతం భారత పురుషుల జట్టు వన్డే క్రికెట్‌లో నంబర్ 1 స్థానంలో ఉంది. ఈ రికార్డులు భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి.

### వరల్డ్ ఛాంపియన్స్:
# మానవ్ శుభారంభం

**న్యూఢిల్లీ:** ప్రపంచ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్స్ అరంగేట్రంలో మానవ్ థక్కర్ విజయంతో శుభారంభం చేశాడు. జర్మనీలో టోమిస్లావ్ పుకార్‌తో జరిగిన ఐదు గేమ్‌ల కఠినమైన థ్రిల్లర్ తర్వాత భారత ఏస్ మానవ్ ఠక్కర్ 16 డబ్ల్యూటిటి ఛాంపియన్స్ ఫ్రాంక్‌ఫర్ట్ రౌండ్‌లోకి ప్రవేశించాడు. ఈ ఏడాది పొడవునా కొన్ని స్థిరమైన ఫలితాల తర్వాత, అతను



ఇప్పుడు ప్రపంచ టాప్ 40లోకి ప్రవేశించాడు, ఇది అతనికి అత్యంత కఠినమైన సింగిల్స్ టోర్నమెంట్ యొక్క ప్రధాన డ్రాలో తన స్థానాన్ని సంపాదించుకోవడానికి సహాయపడింది. తన తొలి ఛాంపియన్స్ మ్యాచ్‌లో, మానవ్ కఠినమైన ఆరంభాన్ని ఎదుర్కొన్నాడు. కానీ వ్యూహాత్మకంగా వ్యవహరించి అనుభవజ్ఞుడైన క్రొయేషియాను 12-10, 3-11, 11-6, 5-11, 11-7 తేడాతో ఓడించాడు.

# తొలి టి20లో వెస్టిండీస్ విజయం
### 7 రన్స్ తేడాతో న్యూజిలాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్ పర్యటనను వెస్టిండీస్ ఘనంగా ఆరంభించింది. ఉత్కంఠభరితంగా న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో వెస్టిండీస్ 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. తద్వారా ఐదు టీ20ల సిరీస్‌లో 1-0తో విండీస్ ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్‌లో బుధవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ గెలిచిన న్యూజిలాండ్ బౌలింగ్ ఎంచుకుని విండీస్‌ను బ్యాటింగ్‌కు అహ్వానించింది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు నష్టానికి 164 పరుగులు చేసింది. ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (3), అలిక్ అథనాజ్ (16) విఫలమైనా, వన్‌డౌన్ బ్యాటర్ షాయి హోప్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరిశాడు. మొత్తంగా 39 బంతులు ఎదుర్కొన్న హోప్ 4 ఫోర్లు, 3 సిక్సుల సాయంతో




53 పరుగులు సాధించాడు. మిగలిన వారిలో రోస్టన్ చేజ్ (28), రోవ్‌మన్ పావెల్ (23 బంతుల్లో 33) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేశారు. కివీస్ బౌలర్లలో జేకబ్ డఫీ, జకారీ ఫౌల్క్స్ రెండేసి వికెట్లు తీయగా, కైలీ జెమీషన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు. ఇక 165 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ ఆదినుంచే తడబడింది. ఓపెనర్లు టిమ్ రాబిన్సన్ (27), డెవాన్ కాన్వే (13) ప్రభావం చూపలేకపోయారు. వన్‌డౌన్ బ్యాటర్ రచిన్ రవీంద్ర(21) నిరాశపరచగా, మార్క్ చాప్‌మన్ (7), డారిల్ మిచెల్ (13), మైకేల్ బ్రాస్‌వెల్ (1), జేమ్స్ నిషమ్ (11) విఫలమయ్యారు. ఈ దశలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ఆకాశమే హద్దుగా చెలరేగుతూ గెలుపు ఆశలు చిగురించేలా చేశాడు. కేవలం 28 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు బాది 55 పరుగులు సాధించి సాంట్నర్ ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. అయితే మిగిలిన వారి నుండి సహకారం అందకపోవడంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయిన కివీస్ 157 పరుగుల వద్దే నిలిచిపోయింది. ఫలితంగా వెస్టిండీస్ చేతిలో ఓటమి పాలైంది.

# రికార్డు సేల్స్ నమోదుచేసిన 'మారుతి'

వాణిజ్యం



**న్యూఢిల్లీ, నవంబరు 5:** జిఎస్టీ రేట్లు తగ్గించిన క్రమంలో చిన్న కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ అప్పుడు రికార్డు సాధించింది. నవరాత్రి సీజన్‌లో నెల వ్యవధిలోనే ఏకంగా 4 లక్షలకుపైగా బుకింగ్స్‌తో నం.1గా నిలిచింది. ఇంకా 2.50 లక్షలకుపైగా కార్లను విక్రయించింది. ఇప్పుడు మారుతీ సుజుకీ మరో చరిత్ర సృష్టించింది. 42 ఏళ్ల కిందట ప్రారంభమైన మారుతీ సుజుకీ దేశీయంగా రికార్డు స్థాయిలో 3 కోట్లకుపైగా కార్లను విక్రయించింది. ఈ మైల్‌స్టోన్ చేరిన తొలి భారతీయ కార్ల తయారీ కంపెనీగా నిలిచింది. ఇప్పటివరకు మరే కంపెనీ ఇంతటి స్థాయిలో కార్లను విక్రయించలేదు. ఇక్కడ టయోటా ఇండియా వంటి వాటికి విక్రయించినవి కూడా ఉన్నాయి. మారుతీ సుజుకీ ఇటీవలి కాలంలో తన కార్ సేల్స్‌ను భారీగా పెంచుకుంటూ వెళ్లింది. మొదటి కోటి కార్లను విక్రయించేందుకు 28 సంవత్సరాల 2 నెలల సమయం పట్టగా తర్వాతి కోటి కార్ల విక్రయాల్ని చేరుకునేందుకు కేవలం 7 సంవత్సరాల 5 నెలలు పట్టింది. తర్వాత మరో కోటి మార్కును చేరుకునేందుకు 6 సంవత్సరాల 4 నెలల సమయం పట్టింది. ఇది సుజుకీ పట్ల విశ్వసనీయతను, మార్కెట్ లీడర్‌షిప్‌ను చాటిచెబుతోంది. అన్నింటికంటే ఎక్కువగా ఆల్టో మోడల్ కార్లు విక్రయించింది. దీని వాటానే ఏకంగా 47 లక్షలకుపైగా ఉంది. మారుతీ సుజుకీ వ్యాగన్ ఆర్ మోడల్ కార్లు 34 లక్షలకుపైగా అమ్ముడుబోయాయి. మారుతీ సుజుకీ స్విఫ్ట్ కార్లను 32 లక్షలకుపైగా యూనిట్లు విక్రయించింది. ఇంకా కంపెనీ బెస్ట్ కాంపాక్ట్ ఎస్‌యువిలుగా ఉన్న బ్రెజా, ఫ్రాంక్స్ వంటి మోడల్స్ కూడా టాప్ 10 బెస్ట్ సెల్లింగ్ మోడళ్లుగా ఉన్నాయి. ఈ కంపెనీ విషయానికి వస్తే 1983, డిసెంబరు 14న ప్రారంభమైంది. మారుతీ 800 తొలి మోడల్. దశాబ్దాలుగా వినియోగదారుల ప్రాధాన్యత, అభిరుచికి అనుగుణంగా మారుతూ.. కంపెనీ 19 మోడళ్లలో 170కిపైగా వేరియంట్లను అందిస్తోంది.

# భారత్ బ్యాంకులపై విజయ్‌మాల్యా కౌంటర్ కేసు!

**బెంగళూరు, నవంబరు 5:** బ్యాంకు రుణాల ఎగవేత ఆరోపణలు ఎదుర్కొంటున్న విజయ్ మాల్యా భారతీయ బ్యాంకులపై సరికొత్త న్యాయ పోరాటానికి తెరలేపారు. తన నుంచి, కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌ను నియంత్రించిన యూబీ హోల్డింగ్స్ కంపెనీ నుంచి ఇప్పటికే రికవరీ చేయబడిన రుణాలపై కూడా బ్యాంకులు వడ్డీని వసూలు చేయడం కొనసాగించకూడదని విజయ్ మాల్యా మంగళవారం కర్ణాటక హైకోర్టును అభ్యర్థించారు. అంతేకాకుండా అప్పులు, తిరిగి వసూలు చేసిన మొత్తాలకు సంబంధించిన పూర్తి అకౌంట్ స్టేట్‌మెంట్‌లను బ్యాంకులు ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. విజయ్ మాల్యా తరఫున సీనియర్ లాయర్ సజన్ పూవయ్య కర్ణాటక హైకోర్టులు వాదనలు వినిపించారు. కోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే సాకుతో ఇప్పటికే కోర్టుల ఆదేశాల ద్వారా వసూలు చేసిన మొత్తాన్ని ఫైనల్ రికవరీగా పరిగణించలేమని బ్యాంకులు చేస్తున్న వాదనను మాల్యా తీవ్రంగా ఖండించారు. బ్యాంకులు ఇప్పటికే తమకు రావాల్సిన మొత్తాన్ని వసూలు చేశాయని ఆ మొత్తాన్ని వారు ఉపయోగిస్తున్నారు కాబట్టి వసూలు చేసిన మొత్తంపై వడ్డీని విధించకూడదని వాదించారు. రుణ రికవరీ ట్రిబ్యునల్ జారీ చేసిన రికవరీ సర్టిఫికెట్ ప్రకారం రూ.6,203 కోట్ల అప్పులకు 11.5 శాతం వడ్డీతో తిరిగి వసూలు చేయాలి. రికవరీ చేసిన మొత్తాలపై విజయ్ మాల్యా తరఫు లాయర్ పలు గణాంకాలను హైకోర్టు ముందు ఉంచారు. 2021 జూలై 16వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. విజయ్ మాల్యా నుంచి రికవరీ చేసిన మొత్తం సొమ్ము రూ.7,181 కోట్లు అని తెలిపారు. ఇక రికవరీ ప్రక్రియల ప్రకారం అప్పటికే రూ.10,040 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు విజయ్ మాల్యా నుంచి దాదాపు రూ.14 వేల కోట్లను తిరిగి వసూలు చేసినట్లు స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌కు తెలియజేశారు. తమకు రావాల్సిన దానికంటే బ్యాంకులు ఎక్కువ మొత్తాన్ని వసూలు చేశాయని కనీసం పూర్తి అసలు, వడ్డీని పొందే దశలో ఉన్నాయని విజయ్ మాల్యా వాదిస్తున్నారు. గత నెలలో విజయ్ మాల్యా తమకు రావాల్సిన మొత్తాలపై పారదర్శకంగా, కచ్చితమైన అకౌంట్ స్టేట్‌మెంట్‌ను సమర్పించని పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు సిగ్గు పడాలి అని విజయ్ మాల్యా తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత ప్రభుత్వ రంగ బ్యాంకులు తమరికవరీలవిషయంలో స్పష్టతనిచ్చేవరకు తాను ఇంగ్లాండ్‌లో చట్టపరమైన చర్యలను కొనసాగించబోనని తన కౌంటర్ క్లెయిమ్‌లను భారత దేశంలో మాత్రమే విచారించవచ్చని విజయ్ మాల్యా స్పష్టం చేశారు.

# ఫోర్బ్స్ బెస్ట్ కంపెనీల్లో 'అమర్‌రాజా'



**న్యూఢిల్లీ, నవంబరు 5:** బ్యాటరీల తయారీ రంగంలోని కంపెనీల్లో ఒకటైన అమర రాజా గ్రూప్ మరో ఘనత సాధించింది. ఫోర్బ్స్ రూపొందించిన వరల్డ్ బెస్ట్ ఎంప్లాయర్స్ 2025 జాబితాలో చోటు దక్కించికుంది. ప్రపంచ వ్యాప్తంగా 31 కంపెనీలతో ఫోర్బ్స్ సంస్థ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాను రూపొందించింది. అందులో బ్యాటరీ కంపెనీ అమర రాజా 28వ స్థానంలో నిలిచింది. వంద పాయింట్లకు గానూ అమర రాజా 63.65 పాయింట్లు దక్కించుకుని టాప్ 30లో నిలిచింది. ఈ ఏడాది ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్స్ జాబితాలో భారత దేశంనుంచి మొత్తం 6 కంపెనీలు చోటు దక్కించుకున్నాయి. ఈ ఆరు కంపెనీల్లో ఎపి కంపెనీ అమర రాజా గ్రూప్ ఒకటని కంపెనీ తెలిపింది. ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకోవడంపై అమర రాజా గ్రూప్ ఛైర్మన్ జయదేవ్ గల్లా సంతోషం వ్యక్తం చేశారు. మానవ వనరుల అభివృద్ధికి తమ కంపెనీ ఎంతో ప్రాధాన్యం ఇస్తుందని, ఈ కారణంగానే ఈ గుర్తింపు లభించినట్లు ఆయన వివరించారు. అమర రాజా గ్రూప్ సంస్థల్లో ప్రస్తుతం 21 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారు.

21 వేల మందికి పైగా ఉద్యోగుల కుటుంబంలో భాగమైనందుకు నేను గర్విస్తు న్నాను. ఈ గుర్తింపు మా ప్రత్యేకమైన ఉద్యోగి విధానాలకు, నిరంతరం మెరుగుపరుచు కునే లక్ష్యానికి లభించిన అద్భుతమైన ధ్రువీకరణ. మేము కలిసి సాధించే ప్రతి మైలురాయి, మా వారసత్వాన్ని మరింత బలోపేతం చేసి మేరుగైనా ఫలితాల కోసం ప్రేరేపిస్తుందని ఆయన అన్నారు. ఉద్యోగుల సాధికారత కల్పించే సంస్కృతిని నిర్మించడంలో అమర రాజా కృషి చేస్తోంది. ఈ జాబితాను రూపొందేందుకు ఫోర్బ్స్ డేటా, ఇంటెలిజెన్స్ ప్లాట్ ఫామ్ స్టాటిస్టా సహకారం తీసుకుంది.


మీ పాత బ్యాంక్ అకౌంట్స్‌లో ఉన్న డబ్బుని మర్చిపోయారా?



మీ సొమ్ముని తిరిగి పొందడానికి ఆర్‌బిఐ మీకు సహాయపడుతుంది.

మీ బ్యాంకులో ఉన్న (2 సంవత్సరాలకు పైగా మరియు 10 సంవత్సరాల వరకు నిష్క్రియంగా ఉన్న) ఉపయోగంలో లేని ఖాతాలలోని డబ్బు / క్లెయిమ్ చేయని డిపాజిట్లు (10 సంవత్సరాలకు పైగా) ఆర్‌బిఐ యొక్క డిఇఏ ఫండ్‌కి బదిలీ చేయబడుతుంది. మీరు లేదా మీ చట్టపరమైన వారసులు ఎప్పుడైనా దాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు.

మీ డబ్బును క్లెయిమ్ చేసుకోవడానికి 3 సులభమైన విధానాలు

1. మీ రెగ్యులర్ బ్రాంచ్ కాకపోయినా, ఏదైనా మీ బ్యాంక్ బ్రాంచ్‌ని సంప్రదించండి.
2. కెవైసి పత్రాలతో (ఆధార్, పాస్‌పోర్ట్, ఓటరు ఐడి లేదా డ్రైవింగ్ లైసెన్స్) ఫారమ్‌ను సమర్పించండి.
3. ధృవీకరణ తర్వాత మీ డబ్బును వడ్డీతో సహా స్వీకరించండి.

మీ క్లెయిమ్ చేయని డిపాజిట్లను కనుగొనడానికి

మీ బ్యాంక్ వెబ్‌సైట్‌లో వెతకండి లేదా ప్రస్తుతం 30 బ్యాంకులను కలిగి ఉన్న ఆర్‌బిఐ యొక్క UDGAM పోర్టల్ (https://udgam.rbi.org.in) లో చూడండి.

అక్టోబర్ నుండి డిసెంబర్ 2025 వరకు దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించబడుతున్న అన్‌క్లెయిమ్డ్ ఆస్తులపై ప్రత్యేక శిబిరాలను సందర్శించండి.




మరిన్ని వివరాల కోసం, https://rbikehtahai.rbi.org.inని సందర్శించండి
అభిప్రాయం కోసం, rbikehtahai@rbi.org.inకు వ్రాయండి.
క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి
అధికారిక వాట్సాప్ నం. 9999041935

ప్రజా హితార్థం జారీ చేయబడింది
भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.